



www.navabhoomi.in | epaper.navabhoomi.in | RNI No:TELTEL:82083

# నవభూమి

ANUKSHANAM
NAVABHOOMI TELUGU DAILY
నవతరం తెలుగు దినపత్రిక






Published from Hyderabad and Vijayawada
ఎడిటర్ : అజీద్
Navabhoomi daily fallows..
హైదరాబాద్ | 20 ఆదివారం | ఏప్రిల్ 2025 | పేజీలు 12 | వెల: రూ.6 | సంపుటి:2 సంచిక: 216
Circulated at: Hyderabad, Rangareddy, Adilabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Medak, Nizamabad, Krishna, Guntur, Easrt Godavari, West Godavari, Prakasam, Nellore, Srikakulam, Vizianagaram, Visakhapatnam, Kurnool, Chittoor, Kadapa, and Anantapur

# పగబట్టిన ట్రంప్

- భారతీయులపైనే ట్రంప్ సర్కార్‌కు పగ
- అమెరికా పౌరసత్వం, ఇమ్మిగ్రేషన్‌లో మార్పులు
- భారతీయ విద్యార్థులపై డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్టేట్, ఇమ్మిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఉక్కుపాదం
- గత నెలలో 300లకు పైగా స్టూడెంట్స్ వీసాలు రద్దు
- సోషల్ మీడియా అకౌంట్లపై నిఘా..327 కేసులు
- నిరసన ప్రదర్శనలు, ధర్నాలు, ఆందోళనల్లో పాల్గొన్న విద్యార్థుల వీసా రద్దు

2



**న్యూయార్క్-నవభూమిబ్యూరో**

అమెరికా పౌరసత్వం, ఇమ్మిగ్రేషన్‌లో చోటు చేసుకుంటోన్న మార్పులు.. భారతీయ విద్యార్థులను దెబ్బకొడుతున్నాయి. వారిపై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయి. అమెరికాలో చదువుకోవాలనుకునే విద్యార్థుల ఆశలను నీరుగారుస్తోన్నాయి. ఇతర దేశాలతో పోల్చుకుంటే భారతీయ విద్యార్థులే అధికంగా బలి అవుతోండటం ప్రాధాన్యతను సంతరించుకుంది. చదువుకోవడానికి తమ దేశానికి వచ్చే విదేశీ విద్యార్థులపై డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్టేట్, ఇమ్మిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్.. ఉక్కుపాదం మోపుతోన్న విషయం తెలిసిందే. స్టూడెంట్స్ వీసాల్లో పెను మార్పులను తీసుకొచ్చాయి ఈ రెండు శాఖలు. సంస్కరణలకు తెర తీశాయి. దీనివల్ల భారతీయ విద్యార్థులు తీవ్రంగా నష్టపోయారు. కిందటి నెలలో 300లకు పైగా స్టూడెంట్స్ వీసాలు రద్దయినట్లు డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్టేట్ వెల్లడించింది. స్టూడెంట్ వీసాల కోసం దరఖాస్తు చేసుకున్న వాళ్ల మనస్తత్వం ఎలాంటిదని తెలుసుకోవడానికి వాళ్ల సోషల్ మీడియా అకౌంట్లపై నిఘా పెట్టింది. క్యాచ్ అండ్ రివోక్ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టింది. అమెరికన్ ఇమ్మిగ్రేషన్ లాయర్స్ అసోసియేషన్ విడుదల చేసిన తాజా నివేదిక ప్రకారం- క్యాచ్ అండ్ రివోక్‌లో 327 కేసులు నమోదు కాగా.. ఇందులో 50 శాతం భారతీయ విద్యార్థులే. మిగిలిన దేశాలతో పోల్చుకుంటే భారతీయ స్టూడెంట్ వీసాలే అధిక శాతం రద్దు కావడం ప్రాధాన్యతను సంతరించుకుంది. రాజకీయ పార్టీలు చేపట్టిన నిరసన ప్రదర్శనలు, ధర్నాలు, ఆందోళనల్లో పాల్గొన్న ఇద్దరు విద్యార్థుల స్టూడెంట్ వీసా సైతం రద్దు కావడం చర్చనీయాంశమైంది. చైనా, దక్షిణ కొరియా, నేపాల్, బంగ్లాదేశ్‌కు చెందిన విద్యార్థుల వీసాలు కూడా రద్దయినప్పటికీ వాటి శాతం తక్కువే. ఆయా దేశాల విద్యార్థుల్లో 50 శాతం మంది ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రైనింగ్‌పై డిపెండ్ అయిన వాళ్లు ఉన్నారు. %=వషీఎవఅవస ఖీశీ్‌శీబ% "ట్రంప్ కు ఎదురుతిరిగిన భారతీయ విద్యార్థి చిన్మయ్ డియోర్ ఎవరు? అసలేం జరిగింది?" ఈ ఏడాది జనవరి 20వ తేదీ నుంచి అంటే- అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ ప్రమాణ స్వీకారం చేసిన తేదీ నుంచి 4,736

# ఆఫ్ఘన్‌లో భారీ భూకంపం

- 3 రోజుల్లో రెండోసారి ఆఫ్ఘనిస్తాన్‌లో భారీ భూకంపం
- కాశ్మీర్, ఢిల్లీ పరిధిలో తేలికపాటి ప్రకంపనలు
- రిక్టర్ స్కేలుపై దీని తీవ్రత 5.8గా నమోదు
- కొన్ని ప్రాంతాల్లో నివాసాలు బీటలు వారినట్లు వార్తలు
- కాబుల్‌కు ఈశాన్య దిశగా ఉన్న బదాక్షన్ ప్రావిన్స్‌పరిధిలోని మాఫ్ నువుల్ ప్రాంతాన్ని భూకంప కేంద్రంగా గుర్తింపు

2



**న్యూఢిల్లీ-నవభూమిబ్యూరో**

పొరుగుదేశం ఆఫ్ఘనిస్తాన్‌లో మరోసారి భారీ భూకంపం సంభవించింది. ఆ దేశ ఈశాన్య ప్రాంతాన్ని వణికించింది. తీవ్ర భయాందోళనలకు గురి చేసింది. ఈ స్థాయిలో భూమి ప్రకోపించడం మూడు రోజుల వ్యవధిలో ఇది రెండోసారి. ఈ నెల 16వ తేదీన అక్కడ భూమి కంపించింది. ఇటీవలే మయన్మార్, థాయ్‌లాండ్‌లల్లో సంభవించిన భూకంపాలు మిగిల్చిన విషాదాన్ని ఇంకా విస్మరించకముందే భూమి ప్రకంపించడం ఉలిక్కిపడేలా చేసింది. సరిహద్దు ప్రాంతం కావడం వల్ల పాకిస్తాన్‌లోనూ ప్రకంపనలు నమోదయ్యాయి. దీని తీవ్రత ఇటు భారత్‌పైనా పడింది. జమ్మూ కాశ్మీర్, ఢిల్లీ- నేషనల్ కేపిటల్ రీజియన్ పరిధిలో తేలికపాటి ప్రకంపనలు కనిపించాయి. ఈ భూకంపం వల్ల వల్ల ప్రాణ, ఆస్తినష్టం చోటు చేసుకున్నట్లు సమాచారం లేదు. కొన్ని ప్రాంతాల్లో నివాసాలు బీటలు వారినట్లు వార్తలు అందుతున్నాయి. రిక్టర్ స్కేలుపై దీని తీవ్రత 5.8గా రికార్డయింది. ఈ మధ్యాహ్నం సరిగ్గా 12:17 నిమిషాలకు ఆఫ్ఘనిస్తాన్ 36.10 ఉత్తర అక్షాంశం, 71.20 తూర్పు రేఖాంశ వద్ద భూమి కంపించింది. ఉపరితలం నుంచి 130 కిలోమీటర్ల లోతున టెక్టానిక్ ప్లేట్స్‌లల్లో చోటు చేసుకున్న పెను కదలికల వల్ల భూమి ప్రకోపించినట్లు నేషనల్ సెంటర్ ఫర్ సెస్మాలజీ వెల్లడించింది. రాజధాని కాబుల్‌కు ఈశాన్య దిశగా ఉన్న బదాక్షన్ ప్రావిన్స్ పరిధిలోని మాఫ్ నువుల్ ప్రాంతాన్ని భూకంప కేంద్రంగా గుర్తించింది. పాకిస్తాన్‌తో సరిహద్దులను పంచుకుంటోన్న ప్రావిన్స్ ఇది. ఫలితంగా అటు పాకిస్తాన్, దానికి ఆనుకునే ఉన్న జమ్మూ కాశ్మీర్‌లల్లో ప్రకంపనలు

# అభివృద్ధిని అడ్డుకుంటున్నది వారే

- ఐటీ, ఫార్మా రంగాల్లో దూసుకుపోతోన్న తెలంగాణ రాష్ట్రం
- రాబోయే రోజుల్లో డ్రై పోర్ట్ ఏర్పాటుతో మరింత అభివృద్ధి
- ప్రపంచంతో పోటీ పడేలా తెలంగాణను తీర్చిదిద్దడమే ప్రభుత్వ ధ్యేయం
- టోక్యోలోని తెలుగు సమాఖ్య కార్యక్రమంలో సీఎం రేవంత్ ప్రసంగం

2



**హైదరాబాద్-నవభూమిబ్యూరో**

తెలంగాణ రాష్ట్రం ఐటీ, ఫార్మా రంగాల్లో దూసుకుపోతోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. రాబోయే రోజుల్లో డ్రై పోర్ట్ ఏర్పాటుతో మరింత అభివృద్ధి చెందుతుందని ఆయన స్పష్టం చేశారు. ప్రపంచంతో పోటీ పడేలా తెలంగాణను తీర్చిదిద్దడమే ప్రభుత్వ ధ్యేయమని ఆయన ఉద్ఘాటించారు. జపాన్ పర్యటనలో సీఎం నాలుగో రోజు పర్యటన కొనసాగుతోంది. ఈ సందర్భంగా టోక్యోలు ఏర్పాటు చేసిన తెలుగు సమాఖ్య కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మూసీ నది ప్రక్షాళన విషయంలో సీఎం రేవంత్ రెడ్డి మరోసారి తనదైన శైలిలో విమర్శలు గుప్పించారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు మూసీ ప్రక్షాళనకు అడ్డుపడుతున్నాయని మండిపడ్డారు. "గుజరాత్‌లో మోడీ సబర్మతి రివర్ ఫ్రంట్ కట్టుకుంటే, ప్రయాగరాజ్‌లో గంగానది ఒడ్డున రివర్ ఫ్రంట్ ఉంటే, మరి తెలంగాణలో మూసీ ప్రక్షాళన ఎందుకు కాకూడదు?" అని ఆయన సూటిగా ప్రశ్నించారు. నీరు మన సంస్కృతికి, అభివృద్ధికి ప్రతీక అని ఆయన అన్నారు. నాలాల ఆక్రమణలు తొలగించకపోతే, చెరువుల మధ్యలో నిర్మాణాలు కూల్చకపోతే ప్రకృతి మనల్ని క్షమించదని ఆయన హెచ్చరించారు. మూసీ అభివృద్ధికి అడ్డుపడే శక్తులు బీఆర్ఎస్, బీజేపీలే అని ఆయన నిందించారు. ' ఢిల్లీలో కాలుష్యంతో అన్ని సంస్థలకు సెలవులు ఇస్తున్న పరిస్థితి వచ్చిందని ముఖ్యమంత్రి అన్నారు. కేవలం కాలుష్యంతో ఢిల్లీ నగరం స్థంభించే పరిస్థితి ఉంటే.. మనం గుణపాఠం నేర్చుకోవాల్సిన అవసరం లేదా.. అని ప్రశ్నించారు. అందుకే హైదరాబాద్ లో మూసీ ప్రక్షాళన చేయాలని చెబుతున్నాని స్పష్టంచేశారు. మూసీ ప్రక్షాళన, మెట్రో విస్తరణ, రీజనల్ రింగ్ రోడ్, రేడియల్ రోడ్స్ తెలంగాణ పురోగతికి అత్యంత కీలకమైన అంశాలని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జపాన్ పర్యటనలో తెలంగాణకు భారీ పెట్టుబడులు వెల్లువెత్తాయి. హైదరాబాద్‌లో అత్యాధునిక డేటా సెంటర్ క్లస్టర్‌ను ఏర్పాటు చేయడానికి డేటా, నెయిసా నెట్‌వర్క్ సంయుక్తంగా ముందుకు వచ్చాయి. తెలంగాణ ప్రభుత్వంతో కలిసి దాదాపు 10 వేల 500 కోట్ల రూపాయల భారీ పెట్టుబడితో ఈ క్లస్టర్ రూపుదిద్దుకోనుంది. ఈ మేరకు ఇరు సంస్థలు ప్రభుత్వంతో

# చేజారిన విశాఖ

- వైసీపీకి అతిపెద్ద ఎదురుదెబ్బ..!
- ఏకపక్షంగా నెగ్గిన అవిశ్వాస తీర్మానం
- ఎన్డీయే కూటమి ప్రతిపాదించిన అవిశ్వాసం
- కార్పొరేటర్లను క్యాంపులకు పంపిన వైసీపీ,కూటమి
- 72 మంది తీర్మానానికి అనుకూలంగా ఓటు
- కూటమికి దక్కిన విశాఖ మున్సిపల్ కార్పొరేషన్

2




**అమరావతి-నవభూమిబ్యూరో**

గతేడాది అసెంబ్లీ ఎన్నికల్లో అధికారం కోల్పోయిన తర్వాత వైసీపీకి వరుస ఎదురుదెబ్బలు తగులుతూనే ఉన్నాయి. అయితే వీటన్నింటికీ మించిన ఎదురుదెబ్బ ఇవాళ ఆ పార్టీకి తగిలింది. గత ప్రభుత్వంలో మూడు రాజధానుల ఏర్పాటులో భాగంగా కార్యనిర్వాహక రాజధానిగా నిర్ణయించిన విశాఖపట్నంలో ఆ పార్టీ మేయర్ పదవిని కోల్పోయింది. ఈ మేరకు ఎన్డీయే కూటమి ప్రతిపాదించిన అవిశ్వాస తీర్మానం ఏకపక్షంగా నెగ్గింది. దీంతో వైసీపీకి మరో గట్టి షాక్ తగిలినట్లయింది. 97 మంది సభ్యులున్న గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ లో మేయర్ పదవిని గత వైసీపీ ప్రభుత్వం అప్పట్లో సునాయాసంగా కైవసం చేసుకుంది. దీంతో మేయర్ గా గొలగాని హరి వెంకటకుమారి పగ్గాలు చేపట్టారు. ఆమె నాలుగేళ్ల పదవీకాలం పూర్తి చేసుకున్న నేపథ్యంలో నాలుగేళ్ల తర్వాత అవిశ్వాసం పెట్టేందుకు అనుకూలంగా ఉన్న నిబంధనల సాయంతో కూటమి పార్టీలు ఆమెపై అవిశ్వాసం ప్రతిపాదించాయి. దీంతో విశాఖలో రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది. వైసీపీతో పాటు

# ఎమ్మెల్సీ ఎన్నికల బహిష్కరణ

- పిచ్చి పనులతో కాంగ్రెస్ పార్టీ పట్ల ప్రజల్లో అసహ్యం
- ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ప్రజలే బీఆర్ఎస్ పార్టీని గెలిపిస్తారు
- బీఆర్ఎస్ సాధించిన విజయాలు అసమాన్యమైనవి
- పార్టీ ఆవిర్భావ సభలో కేసీఆర్ భవిష్యత్ లక్ష్యాలు వివరిస్తారు
- ఎమ్మెల్సీ ఎన్నికల వేళ కేడర్‌కు కేటీఆర్ కీలక పిలుపు..!!

2



**హైదరాబాద్-నవభూమిబ్యూరో**

ఎమ్మెల్సీ ఎన్నికల వేళ కేటీఆర్ కీలక ప్రకటన చేసారు కేడర్‌కు స్పష్టత ఇచ్చారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవం గురించి దిశా నిర్దేశం చేసారు. ముఖ్యమంత్రి రేవంత్ తీరును తప్పు బట్టారు. సీఎం రేవంత్ రెడ్డి పిచ్చి పనులతో కాంగ్రెస్ పార్టీ పట్ల ప్రజల్లో అసహ్యం పెరుగుతుందని అన్నారు. రాష్ట్రంలో ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ప్రజలే బీఆర్ఎస్ పార్టీని గెలిపిస్తారని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. పార్టీ ఆవిర్భావ సభలో కేసీఆర్ భవిష్యత్ లక్ష్యాలను స్పష్టం చేస్తారని వెల్లడించారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవ సభ కోసం గ్రేటర్ పరిధిలోని ప్రతీ కాలనీ నుంచి కేడర్ కదలాలని కేటీఆర్ సూచించారు. జరగబోయే ఎమ్మెల్సీ ఎన్నికలను బహిష్కరిస్తున్నామని వెల్లడించారు. పార్టీ ఓటర్లు గా ఉన్న వారికి విప్ జారీ చేస్తామని, ధిక్కరించిన వారిపై చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. బీఆర్ఎస్ సాధించిన విజయాలు అసమాన్యమైనవని, అనితర సాధ్యమైనవని

# రాజ్ ఎక్కడ?

- లిక్కర్ స్కాంలో రాజ్ కసిరెడ్డిపై తీవ్ర ఆరోపణలు
- నేడు ఆడియో సందేశం వెలువరించిన రాజ్
- దాంతో అతడి ఆచూకీపై మరోసారి చర్చ

2

**అమరావతి-నవభూమిబ్యూరో**

ఏపీ లిక్కర్ స్కాంలో తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్న రాజ్ కసిరెడ్డి తాజాగా ఆడియో సందేశం వెలువరించిన నేపథ్యంలో, ఆయన ఎక్కడున్నారన్న విషయం మరోసారి చర్చనీయాంశంగా మారింది. రాజ్ కసిరెడ్డి ఆచూకీపై భిన్న వాదనలు వినిపిస్తున్నాయి. గత ఏడాది ఆగస్టు 23న ఆయనపై లుక్ అవుట్ సర్క్యులర్ జారీ చేసినప్పటికీ, ఆయన నేపాల్ మీదుగా స్కాట్లాండ్ పారిపోయి, అక్కడి నుంచే న్యాయ పోరాటం చేస్తున్నారని, ఈ ఆడియో కూడా అక్కడి నుంచే పంపి ఉంటారని ప్రచారం జరుగుతోంది.

# జగన్ కీలక నిర్ణయాలు

- ఇక పూర్తిస్థాయి పార్టీ బలోపేతంపైనే దృష్టి
- భవిష్యత్ రాజకీయంపై పూర్తిస్థాయిలో మేథోమథనం
- 22,23తేదీల్లో 2 కీలక భేటీల నిర్వహణ
- సొంత పార్టీ నేతలకు భవిష్యత్ రాజకీయంపై దిశానిర్దేశం

2



**అమరావతి-నవభూమిబ్యూరో**

ఏపీలో గతేడాది సార్వత్రిక ఎన్నికల్లో చిత్తుగా ఓటమిపాలైన తర్వాత భవిష్యత్ రాజకీయంపై జగన్ పూర్తిస్థాయిలో మేథోమథనం చేయలేదు. అదే సమయంలో కూటమి సర్కార్ పాత కేసులతో వైసీపీ నేతల్ని తరుముతుతోంది. అటు కేంద్రంలో ఎన్డీయే సర్కార్‌కు అండగా నిలవాలా లేక పోరాటం చేయాలా అన్న దానిపై క్లారిటీ లేదు. ఈ నేపథ్యంలో సొంత పార్టీ నేతలకు భవిష్యత్ రాజకీయంపై దిశానిర్దేశం చేసేందుకు జగన్ సిద్ధమవుతున్నారు. ఇందుకోసం రెండు కీలక భేటీలు నిర్వహించబోతున్నారు. ఈ నెల 22, 23 తేదీల్లో తాడేపల్లిలోని వైసీపీ కేంద్ర కార్యాలయంలో పార్టీకి సంబంధించిన కీలక నేతలతో జగన్ భేటీ కాబోతున్నారు. ఇందులో 22వ తేదీన వైసీపీ పొలిటికల్ ఎఫైర్స్ కమిటీతో జగన్ సమావేశం కాబోతున్నారు. ఇందులో తాజా రాజకీయ పరిణామాలతో పాటు భవిష్యత్ కార్యాచరణపై జగన్ చర్చించనున్నారు. అలాగే పార్టీ భ మరోవైపు ఈ నెల 23న జిల్లా సోషల్ మీడియా, వైసీపీ అధ్యక్షులతో వైఎస్ జగన్ సమావేశం అవుతారు. ఇందులో వైసీపీ

# పూసపాటిరేగ పోలీస్ స్టేషన్‌లో శ్రీరెడ్డి విచారణ

- పూసపాటిరేగ పోలీస్ స్టేషన్‌కు వచ్చిన శ్రీరెడ్డి
- చంద్రబాబు, పవన్, లోకేశ్ లపై దారుణ వ్యాఖ్యలు చేసిన శ్రీరెడ్డి
- శ్రీరెడ్డిపై కేసు నమోదు చేసిన పోలీసులు
- మళ్లీ పిలుస్తామని, తప్పకుండా హాజరుకావాలన్న పోలీసులు

2




**విజయనగరం-నవభూమిబ్యూరో**

నటి శ్రీరెడ్డిని విజయనగరం జిల్లా పూసపాటిరేగ పోలీసులు విచారిస్తున్నారు. ఎన్నికలకు ముందు ప్రస్తుత సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ లపై దారుణమైన వీడియోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన శ్రీరెడ్డి

# అజర్‌కు షాక్!

- ఉప్పల్ స్టేడియంలో ఓ పెవిలియన్ స్టాండ్‌కున్న టీమిండియా మాజీ కెప్టెన్ అజరుద్దీన్ పేరు తొలగింపు

2



**హైదరాబాద్-నవభూమిబ్యూరో**

హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ మరో వివాదానికి కేంద్రబిందువు అయింది. ఉప్పల్ రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ స్టేడియంలో ఓ పెవిలియన్ స్టాండ్‌కు పెట్టిన భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్, హైదరాబాద్‌కే చెందిన మహ్మద్ అజరుద్దీన్ పేరును తొలగించాలంటూ ఆదేశాలు జారీ చేసింది. ఇది కాస్తా వివాదాన్ని రేపుతోంది. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఎథిక్స్ ఆఫీసర్, అంబుడ్స్‌మన్ జస్టిస్ వీ ఈశ్వరయ్య ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు. ఉప్పల్ స్టేడియం నార్త్ పెవిలియన్ స్టాండ్‌కు మహ్మద్ అజారుద్దీన్ పేరు కొనసాగుతూ వస్తోన్న విషయం తెలిసిందే. టీమిండియా ప్లేయర్‌గా, కెప్టెన్‌గా క్రికెట్‌కు అజరుద్దీన్ అందించిన సేవలకు గుర్తింపుగా 2019లో నార్త్ పెవిలియన్ స్టాండ్‌కు ఆయన పేరు

# 'సాయిరెడ్డి బట్టే బాజ్'


- విజయసాయి చరిత్రను అందరి ముందు పెడతా
- నోటీసులపై 24 గంటల్లోనే స్పందించా..ఎందుకు రమ్మన్నారు
- తనకు వచ్చిన నోటీసులపై హైకోర్టులో సవాల్..బెయిల్ పిటిషన్
- విచారణకు అప్పుడే వస్తా- రాజ్ కసిరెడ్డి ఆడియో రిలీజ్..!

2



**అమరావతి-నవభూమిబ్యూరో**

ఏపీలో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన మద్యం కుంభకోణంపై సీఐడీ దర్యాప్తు ముమ్మరంగా సాగుతోంది. ఈ కేసులో సాక్షిగా ఇప్పటికే వైసీపీ మాజీ ఎంపీ విజయసాయిరెడ్డితో పాటు ప్రస్తుత ఎంపీ మిథున్ రెడ్డిని నిందితుడిగా పిలిపించారు. అలాగే ఈ కేసులో ప్రధాన నిందితుడిగా భావిస్తున్న గత ప్రభుత్వ సలహాదారు రాజ్ కసిరెడ్డికి నోటీసులు జారీ చేసినా ఆయన విచారణకు హాజరు కావడం లేదు. దీంతో తాజాగా హైదరాబాద్‌లోని ఆయన ఇంట్లో సోదాలు కూడా చేశారు. ఈ నేపథ్యంలో పరారీలో ఉన్న రాజ్ కసిరెడ్డి ఆడియో విడుదల చేశారు. ఏపీ లిక్కర్ స్కామ్ కేసులో సిట్ ఇచ్చిన నోటీసులపై రాజ్ కసిరెడ్డి ఆడియో మెసేజ్ విడుదల చేశారు. ఇందులో ఆయన లిక్కర్ కేసులో తనకు నోటీసులు ఇచ్చి విచారణకు హాజరుకావాలన్నారని తెలిపారు. నోటీసులపై 24 గంటల్లోనే తాను స్పందించానని, తనను ఎందుకు రమ్మంటున్నారని అడిగానని వెల్లడించారు. ఏమైనా



# హరీశ్ రావే కాదు.. చిన్నారి స్పీచ్ వింటే ఎవరైనా కన్నీరు పెట్టాల్సిందే



**హైదరాబాద్-నవభూమి:**ఆ చిట్టిపొట్టి చిన్నారి విద్యార్థిని ఇచ్చిన బహిరంగ స్పీచ్ వింటే, మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావే కాదు, మానవత్వమున్నవారెవరైనా కన్నీరు కార్చాల్సిందే. అదే జరిగింది ఇవాళ. విద్యార్థులు భవిష్యత్తులో ముందుకెళ్లడానికి, ఉన్నతంగా ఎదగడానికి ప్రోత్సాహాన్ని అందించేలా.. "ధైర్యంగా ఉండాలి.. భవిష్యత్తులో ఎదగాలి". అనే కార్యక్రమాన్ని సిద్ధిపేటలో ఏర్పాటు చేశారు. పట్టణంలోని మెట్రో గార్డెన్‌లో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు హాజరయ్యారు.ఈ సందర్భంగా అందరు విద్యార్థులతోపాటు సాత్విక అనే ఓ విద్యార్థిని కూడా మైక్‌లో మాట్లాడింది. అయితే, ఆ చిన్నారి కన్నీళ్లు పెట్టుకుంటూ చెప్పిన మాటలు, ఆమె తీసుకున్న నిర్ణయాలు.. ఆమె మాటల్లోనే వింటే ఎలాంటి వారికైనా కన్నీళ్లు కారిపోతాయి. అదే ఇవాళ మాజీ మంత్రి హరీశ్ రావు కూడా స్వయంగా అనుభవించారు. ఇంతకీ ఆ చిన్నారి తల్లి ఏమందంటే.. " అందరికీ నమస్కారం.. నేను ఇక్కడికి రావడానికి కారణం మా మమ్మీ. నేను రెండవ తరగతిలో ఉన్నప్పుడే మా నాన్న చనిపోయారు. మా మమ్మీ కష్టపడి స్కూల్ ఫీజు కడుతూ నన్ను చదివిస్తోంది. ఇప్పటి నుంచి మా మమ్మీని మంచిగా చూసుకుంటాను. మా మమ్మీకి మంచి పేరు తీసుకొస్తాను. మా మమ్మీకి, డాడీ.. వాళ్ల పేర్లకు వాల్యూ తెచ్చేలా నడుచుకుంటాను. ధన్యవాదాలు." అంటూ ఏడుస్తూనే మాట్లాడింది ఆ చిన్నారి.ఆ దృశ్యాన్ని చూసి హరీష్ రావు చలించిపోయారు. ఆ చిన్న పాపను దగ్గరకు తీసుకుని ఓదార్చారు. ఈ క్రమంలో ఆయన కంటి నుంచి కన్నీళ్లు కారిపోయాయి. చిన్నారి మాటలకి అక్కడున్న వాళ్లంతా చలించి పోయారు.

## ఈనెల 22న ఇంటర్ ఫలితాలు..




**హైదరాబాద్-నవభూమి:**ఈ నెల 22న ఇంటర్ ఫలితాలు వెలువడనున్నాయి. మొదటి సంవత్సరం, సెకండియర్ ఫలితాలను ఒకేసారి ప్రకటించనున్నట్లు ఇంటర్ బోర్డు ప్రకటించింది. మంగళవారం (ఏప్రిల్ 22) మధ్యాహ్నం 12 గంటలకు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఫలితాలను విడుదల చేయనున్నట్లు వెల్లడించింది. విద్యార్థులు ఇంటర్మీడియట్ బోర్డు అధికారిక వెబ్‌సైట్ tsbie.cgg.gov.in లేదా results.cgg.gov.inలో చూసుకోవచ్చు.
మార్చి 5 నుంచి 25 వరకు రాష్ట్ర వ్యాప్తంగా 1532 పరీక్ష కేంద్రాల్లో ఇంటర్ పరీక్షలు నిర్వహించారు. మొత్తం 9,96,971 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. వారిలో 4.88 లక్షల మంది ఫస్టియర్ విద్యార్థులు ఉండగా, 5 లక్షలకుపైగా సెకండియర్ విద్యార్థులు ఉన్నారు. మార్చి 18 నుంచి సమాధాన పత్రాల మూల్యాంకనం చేశారు.


## తెలంగాణలో వర్షాలు.. ఐఎండీ వార్నింగ్



**హైదరాబాద్-నవభూమి:** తెలంగాణలో రాగల రెండురోజులు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వానలు పడే అవకాశం ఉందని తెలిపింది. శనివారం నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది.
ఆదివారం రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్, మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో ఈదురుగాలులతో వానలు కురిసే ఛాన్స్ ఉందని తెలిపింది. ఈ క్రమంలో ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్‌ని జారీ చేసింది. ఇదిలా ఉండగా.. గడిచిన 24 గంటల్లో హైదరాబాద్, రంగారెడ్డి, యాదాద్రి భువనగిరి, సిద్దిపేట, జగిత్యాలతో పాటు పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి భారీ వర్షాలు కురిశాయి. అత్యధికంగా హైదరాబాద్ పరిధిలోని బండ్లగూడలో ఎనిమిది సెంటీమీటర్ల వర్షాపాతం నమోదైంది.

## ఆ బాలుడికి క్రికెట్ అంటే పిచ్చి..

### ఆ పిచ్చే రూ.3900 కోట్ల విలువైన భూమిని కాపాడింది..!

**హైదరాబాద్-నవభూమి:**తాను క్రికెట్ ఆడుకునే స్థలం కబ్జాకు గురికావడంతో ఓ బాలుడు హైడ్రా కమిషనర్‌కు లేఖ రాశాడు. స్పందించిన అధికారులు జూబ్లీహిల్స్ ప్రాంతంలో రూ.3900 కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని కాపాడారు. నార్నె ఎస్టేట్స్ అనే సంస్థ భూమిని ఆక్రమించి అమ్మడానికి ప్రయత్నించగా.. నిర్మాణాలు నిలిపివేశారు. బాలుడి చొరవతో వేల కోట్ల విలువైన భూమిని పరిరక్షించారు.
ఆ బాలుడికి క్రికెట్ అంటే పిచ్చి.. స్కూల్ అయిపోగానే సమీపంలోని గ్రౌండ్‌కు వెళ్లి స్నేహితులతో కలిసి సరదాగా క్రికెట్ ఆడుకునేవాడు. గత కొన్నేళ్లుగా ఇదే తంతు. అయితే ఉన్నట్లుండి కొన్ని నెలల నుంచి తాను క్రికెట్ ఆడుకునే గ్రౌండ్ సమీపంలో భారీ నిర్మాణ పనుల మ్మొదలయ్యాయి. గ్రౌండ్ చుట్టూ కంచె వేయటం, నిర్మాణం కోసం గ్రౌండ్‌లో పెద్ద పెద్ద గోతులు తవ్వటం ప్రారంభించారు. నిర్మాణ పనులతో క్రికెట్ ఆడుకునేందుకు వీలు లేకుండా పోయింది. దీంతో తాను ఆడుకునే క్రికెట్ గ్రౌండ్‌ను కాపాడుకోవాలనుకున్న బాలుడు హైడ్రాకు లేఖ రాశాడు. ఆ లేఖే రూ. 3900 కోట్ల విలువైన భూమిని కాపాడేలా చేసింది.వివరాల్లోకి వెళితే.. లంగర్‌హౌజ్‌కు చెందిన ఒక బాలుడు చాలా సంవత్సరాలుగా జూబ్లీహిల్స్ జేఆర్సీ కన్వెన్షన్ సెంటర్ దగ్గర ఉన్న ఖాళీ స్థలంలో క్రికెట్ ఆడుకునేవాడు. అయితే కొంతకాలంగా ఆ స్థలానికి వెళ్ళడానికి వీలు లేకుండా పోయింది. అక్కడ కంచె వేయడం, నిర్మాణాలు చేయడం మొదలుపెట్టారు. దీంతో ఆ బాలుడు హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌కు లెటర్ రాసి విషయం చెప్పాడు. బాలుడు రాసిన లేఖపై హైడ్రా కమిషనర్ స్పందించారు. క్షేత్రస్థాయి పరిశీలనకు వెళ్లారు. ఆ భూమి ప్రభుత్వానిదని, ప్రస్తుతం అది కోర్టులో వివాదంలో ఉందని గుర్తించారు. బాలుడు ఇచ్చిన సమాచారంతో అధికారులు వెంటనే చర్యలు చేపట్టారు. ఆ స్థలాన్ని పరిశీలించి అక్కడ జరుగుతున్న నిర్మాణాలను ఆపేశారు. నార్నె ఎస్టేట్స్ అనే సంస్థ భూమిని ఆక్రమించి అమ్మడానికి ప్రయత్నిస్తున్నారని తెలుసుకుని వెంటనే కూల్చివేతలు మ్మొదలుపెట్టారు.
ఈ భూమి నిషేధిత జాబితాలో ఉందని కమిషనర్ ఏవీ రంగనాథ్ వెల్లడించారు. కోర్టులో కేసులు నడుస్తున్నా.. నార్నె ఎస్టేట్స్ దాన్ని అమ్మడానికి ప్రయత్నించిందన్నారు. కోర్టులో కేసు నడుస్తుండగా ఎలాంటి నిర్మాణాలు చేపట్టకూడదని.. అమ్మకాలు జరపకూడదని ఆయన స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో అత్యంత ఖరీదైన ప్రాంతంలో ఉన్న ఈ 39 ఎకరాల భూమి ఒక్కో ఎకరం 100 కోట్ల రూపాయల కంటే ఎక్కువ పలుకుతోందని చెప్పారు. అక్కడ ప్లాట్లు వేసి, నిర్మాణాలు చేపట్టడానికి ప్రయత్నాలు జరిగాయని అధికారులు తెలిపారు. అందుకే వెంటనే చర్యలు తీసుకున్నామని చెప్పారు. ఇలా ఆ బాలుడు క్రికెట్‌పై ఉన్న ఫ్యాషన్‌తో జూబ్లీహిల్స్ ప్రాంతంలో రూ. 3,900 కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని కాపాడటానికి కారణమయ్యాడు.

# కుమురం భీం మనవడి దీనస్థితి.. కూలి పనులకు వెళ్తున్న గిరిజన యోధుడి వారసుడు..!



**హైదరాబాద్-నవభూమి:**నిజాం పాలనపై తిరుగుబాటు చేసిన కుమురం భీం వారసుడు కుమురం సోనేరావు నిరుపేదరికంలో మగ్గుతున్నారు. ప్రభుత్వం ఐదెకరాల భూమినిచ్చినా, సొంతిల్లు లేక ఉపాధి కోసం కూలి పనులకు వెళ్తున్నారు. గుస్సాడీ రాజుకు ఇచ్చిన గౌరవం తనకు లేదని, ఆసరా పింఛను మంజూరు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు. నిజాం పాలనపై తిరుగుబాటు బావుటా ఎగురవేసి.. గిరిజనుల హక్కుల కోసం పోరాడిన కుమురం భీం వీరత్వం గురించి.. ఎంతో గొప్పగా చెప్పుకుంటాం. "జల్, జంగల్, జమీన్" అనే నినాదంతో ఆయన చేసిన పోరాటాలు ఇప్పటికీ చరిత్ర పుటల్లో పదిలం. గిరిజనులకు ఈనాడు హక్కులు అందుతున్నాయన్నా.. పోడు భూములకు పట్టాలు మంజూరవుతున్నాయన్నా.. అది కుమురం భీం ఆనాడు చేసిన పోరాటాల ఫలమే. ఎంతో మంది గిరిజనులు.. సొంత భూముల్లో వ్యవసాయం చేసుకుంటూ, మంచి మంచి చదువులు చదివి గొప్ప గొప్ప ఉద్యోగాలు చేస్తూ.. ఆయా రంగాల్లో ఉన్నత స్థాయిల్లో ఉన్నారంటే.. ఆయన వేసిన అడుగుల తాలుకూ ఫలితాలే. ఇలా కుముర భీం వీరత్వాన్ని.. ఆయన జయంతి రోజునో లేదా వర్ధంతి రోజునో నెమరువేసుకుని, గ్రామాల్లో ఉన్న విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళు లర్పించటం ఒక ఆనవాయితీ మాత్రమే. ఎంతో మంది గిరిజనుల జీవితాల్లో వెలుగులు నిండేందుకు కారణమైన ఆ గిరిజన వీరుని కుటుంబం ఎలా ఉంది.. ఏం చేస్తుంది.. ఆయన వారసులు ఎలాంటి పరిస్థితుల్లో బతుకుతున్నారు అన్నది ఏ ఒక్కరికీ పట్టకపోవటం, ప్రభుత్వాలు కూడా పట్టించుకోకపోవటం శోచనీయం.గిరిజన వీరుడు కుమురం భీం మనవడు కుమురం సోనేరావు నిరుపేదరికంతో పోరాడుతున్న ఘటన చాలా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ (యు) మండలం దోబే గ్రామంలో నివాసముంటున్న సోనేరావు.. ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక భార్య గౌరుబాయితో కలిసి గత 15 రోజులుగా ఉపాధి హామీ పథకం కింద కూలి పనులకు వెళ్తున్నారు. చేతిలో డబ్బుల్లేని దుస్థితిలో సోనేరావు కుటుంబం జీవనం సాగిస్తుండటం.. ఇప్పుడు అందరినీ కలచివేస్తోంది.ప్రభుత్వం గతంలో ఐదెకరాల సాగుభూమిని మంజూరు చేసినప్పటికీ.. కుమురం సోనేరావుకు ఇప్పటివరకు సొంతిల్లు లేదు. తలదాచుకోవడానికి గూడు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను పరిష్కరించాలని కోరుతూ ఆయన పలుమార్లు స్థానిక ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్‌కు దరఖాస్తు చేసుకున్నా.. ఇప్పటివరకు ఎలాంటి సహాయం అందకపోవటం గమనార్హం.గతంలో గుస్సాడీ రాజుకు ప్రభుత్వం అందించిన గౌరవాన్ని గుర్తుచేసుకుంటూ.. తనను కూడా గుర్తించి ఆదుకోవాలని ప్రభుత్వానికి కుమురం సోనేరావు విజ్ఞప్తి చేస్తున్నారు. తన జీవనోపాధి కోసం ప్రతి నెల ఆసరా పింఛను మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు. గిరిజన పోరాట యోధుడి వారసుడి ఈ దుర్భర పరిస్థితి ఇప్పుడు స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వం తక్షణమే స్పందించి సోనేరావు కుటుంబానికి సహాయం అందించాలని ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

# కొందర్ని మాత్రమే టార్గెట్ చేస్తున్నారా..?

## పోలీసుల నోటీసులపై స్మితా సబర్వాల్ రియాక్షన్



**హైదరాబాద్-నవభూమి:**హైదరాబాద్ కంచ గచ్చిబౌలి భూముల వివాదంలో సీనియర్ ఐఏఎస్ స్మితా సబర్వాల్‌కు పోలీసులు నోటీసులు జారీ చేసిన సంగతి తెలిసిందే. అక్కడ జంతువులు ఉన్నాయంటూ ఏఐ ఫొటోతో ప్రచారం జరిగింది. 'హాయ్ హైదారాబాద్' అనే ట్విట్టర్ యూజర్ ఓ ఏఐ ఫొటోను ట్వీట్ చేయగా.. స్మితా సబర్వాల్ దాన్ని రీట్వీట్ చేశారు. దీనిపై పోలీసులు ఆమెకు నోటీసులు పంపారు. మొదట స్పందించకపోయినా.. తర్వాత ఆమె ప్రభుత్వానికి వ్యతిరేకంగా ట్వీట్లు చేశారు. తాజాగా ఆమె ఈ వివాదంపై స్పందిస్తూ.. నోటీసులకు సమాధానం ఇచ్చానని తెలిపారు. చట్టాన్ని గౌరవించే వ్యక్తిగా, పోలీసులు అడిగిన ప్రశ్నలకు వివరణ ఇచ్చానని ఆమె పేర్కొన్నారు. స్మితా సబర్వాల్ తన రీట్వీట్‌పై వివరణ ఇస్తూ.. తనలాగే మరో 2 వేల మంది కూడా ఆ ట్వీట్‌ను రీట్వీట్ చేశారని గుర్తు చేశారు. 'నాకు పంపినట్లే మిగతా 2 వేలమందికి కూడా నోటీసులు పంపించారా..? వారందరిపైనా ఇలాంటి చర్యలే తీసుకున్నారా?' అని ఆమె ప్రశ్నించారు. చట్టం అందరికీ సమానంగా వర్తిస్తుందా..? లేక కొందరినే ఎంపిక చేసి టార్గెట్ చేస్తున్నారా..? అని ఆమె పోలీసులను నిలదీశారు.కాగా, కంచ గచ్చిబౌలి భూముల విషయంలో ఫేక్ ప్రచారం జరుగుతోందని రేవంత్ రెడ్డి ప్రభుత్వం సీరియస్‌గా చర్యలు తీసుకుంటోంది. మార్ఫింగ్ చేసిన ఫోటోలను పోస్ట్ చేసిన వారిపై కేసులు నమోదు చేస్తున్నారు. దీంతో చాలామంది నాయకులు తాము చేసిన పోస్టులను తొలగించారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కూడా తన ట్వీట్‌ను తొలగించారు. అయితే, స్మితా సబర్వాల్ మాత్రం వెనక్కి తగ్గకుండా ప్రభుత్వానికి వ్యతిరేకంగా మరిన్ని పోస్టులు చేస్తున్నారు. పోలీసుల నోటీసులు అందుకున్నా ఆమె తన దూకుడును తగ్గించలేదు. సుప్రీంకోర్టు తీర్పులకు సంబంధించిన వార్తలను వరుసగా ట్వీట్ చేశారు. వాటిల్లో 100 ఎకరాలను పునరుద్ధరించాలంటూ సుప్రీంకోర్టు ఆదేశాలు ఉన్న ఫోటో కూడా ఉంది.స్మితా సబర్వాల్ ఒక సీనియర్ ఐఏఎస్ అధికారిణి కావడంతో ఈ వ్యవహారం మరింత ప్రాధాన్యత సంతరించుకుంది. ఆమె ప్రభుత్వానికి వ్యతిరేకంగా ట్వీట్లు చేయడం, పోలీసుల నోటీసులకు సమాధానం ఇవ్వడం వంటి విషయాలు హాట్ టాఫిక్‌గా మారాయి. ఈ వివాదం ముందు ముందు ఎలాంటి మలుపులు తిరుగుతుందనేది ఆసక్తికరంగా మారింది.

# అజర్‌కు షాక్!

**(1వపేజీ తరువాయి)**పెట్టారు. సౌత్ పెవిలియన్ స్టాండ్‌కు హైదరాబాద్‌కే చెందిన మరో మాజీ క్రికెటర్ వీవీఎస్ లక్ష్మణ్ పేరును పెట్టారు. 2019 డిసెంబర్‌లో భారత్-వెస్టిండీస్ టీ20 సిరీస్ ఆరంభానికి ముందు ఈ రెండు స్టాండ్లను ఆవిష్కరించారు. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ అపెక్స్ కౌన్సిల్ అప్పట్లో ఈ నిర్ణయాన్ని తీసుకుంది. ఈ అపెక్స్ కౌన్సిల్ సమావేశానికి హెచ్‌సీఏ అధ్యక్షుడి హోదాలో అజరుద్దీన్ హాజరయ్యారని, నార్త్ పెవిలియన్ స్టాండ్‌కు తన పేరును పెట్టాలంటూ ఒత్తిడి తీసుకొచ్చారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ మేరకు లార్డ్స్ క్రికెట్ క్లబ్ కోశాధికారి సోమ్నా మిశ్రా హెచ్‌సీఏ అంబుడ్స్‌మెన్‌కు ఫిర్యాదు చేశారు. నార్త్ పెవిలియన్ స్టాండ్‌కు అజరుద్దీన్ పేరు పెడుతూ అపెక్స్ కమిటీ తీసుకున్న నిర్ణయం 2018 నాటి హెచ్‌సీఏ రూల్ 38కు వ్యతిరేకమని సోమ్నా మిశ్రా వాదించారు. ఈ రూల్ ప్రకారం- ఆఫీస్ బేరర్లు తమకు అనుకూలంగా నిర్ణయాలు తీసుకోకూడదని తెలిపారు. అదే సమయంలో- సర్వసభ్య సమావేశం ఆమోదంతో సౌత్ పెవిలియన్ స్టాండ్‌కు వీవీఎస్ లక్ష్మణ్ పేరు పెట్టడం వల్ల ఇబ్బందులు తలెత్తలేదు. %=వషిశీఎఎవఅనవవ ఖీశీతీ "శీబ% "హైదరాబాద్‌లో భారీ వర్షం, రోడ్లు జలమయం, సిటీ జనులకు అలర్ట్" స్టేడియంలో హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ అంటూ కనిపించే నేమ్ బోర్డుపై అదనంగా ఎలాంటి పేర్లను కూడా పెట్టకూడదనే నిబంధన సైతం రూల్ బుక్‌లో ఉందని చెబుతున్నారు. అలాంటి నేమ్ బోర్డు ఏదైనా పెట్టాల్సి వస్తే హెచ్‌సీఏ సర్వ సభ్య సమావేశంలో ఓ తీర్మానాన్ని ఆమోదించాల్సి ఉంటుందని, అలాంటిదేదీ జరగలేదని సోమ్నా మిశ్రా తన పిటీషన్‌లో పేర్కొన్నారు. అంబుడ్స్‌మన్ విచారణకు అజరుద్దీన్ కూడా హాజరయ్యారు. తన వాదనలను వినిపించారు. తన పేరు విషయంలో హెచ్‌సీఏ అధ్యక్షుడిగా అపెక్స్ కౌన్సిల్‌పై తాను ఎలాంటి ఒత్తిడినీ తీసుకుని రాలేదని అన్నారు. ఆ నిర్ణయం ఏకగ్రీవమని తెలిపారు. ఆ తరువాత జరిగిన సర్వసభ్యసమావేశాల్లోనూ ఎలాంటి అభ్యంతరాలు వ్యక్తం కాలేదని వివరణ ఇచ్చారు. పేరు పెట్టడం వల్ల వ్యక్తిగత ఎలాంటి లబ్ది పొందలేదని చెప్పారు. ఈ వాదోపవాదాలను విన్న అనంతరం ఎథిక్స్ ఆఫీసర్.. అజరుద్దీన్ పేరు తొలగించాలని ఆదేశించారు. మాజీ క్రికెటర్లు అర్షద్ అయూబ్, వెంకటపతి రాజు పేర్ల ప్రస్తావన కూడా ఎప్పుడూ రాకపోవడాన్ని ప్రస్తావించారు. రూల్ 38, రూల్ 41ను ఉల్లంఘించడం సరైనది కాదని తెలిపారు.

## ఆఫ్ఘన్‌లో భారీ భూకంపం

**(1వపేజీ తరువాయి)**నమోదయ్యాయి. భూకంపం సంభవించిన వెంటనే స్థానికులు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. ఇళ్లల్లో నుంచి బయటికి పరుగులు తీశారు. శ్రీనగర్‌లో స్థానికులు భయాందోళనలతో ఇళ్లు, కార్యాలయాలు, షాపుల నుంచి బయటికి పరుగెత్తారు. దీనికి సంబంధించిన కొన్ని వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ప్రధాన భూకంపం తరువాత కూడా స్వల్ప స్థాయిలో ప్రకంపనలు సంభవించడం వల్ల ఇళ్లల్లోకి వెళ్లడానికి వెనుకాడారు. చాలా సేపటి వరకు రోడ్ల మీదే గడిపారు. భూకంపం వల్ల ప్రాణ, ఆస్తినష్టం సంభవించినట్లు ఇప్పటివరకు సమాచారం అందలేదు. ఈ ప్రావిన్స్ రాజధాని ఫైజాబాద్‌లో పలు నివాసాలు బీటలు వారినట్లు సమాచారం. భూకంపాలు సంభవించే అవకాశం అత్యధికంగా ఉండే దేశాలతో కూడిన రింగ్ ఆఫ్ ఫైర్లో ఆఫ్ఘనిస్తాన్ లేదు.అయినప్పటికీ- ఈ మధ్యకాలంలో ఇక్కడ తరచూ భూమి ప్రకంపిస్తోండటం ప్రాధాన్యతను సంతరించుకుంది. పసిఫిక్ రింగ్ ఆఫ్ ఫైర్‌లో ఉంటుంది ఆఫ్ఘన్. కెనడా, అమెరికా, మెక్సికో, గ్వాటెమాలా, కోస్టారికా, చిలీ, పెరు, ఈక్వెడార్, కొలంబియా, రష్యా, జపాన్, ఫిలిప్పీన్స్, ఇండొనేసియా, పపువా న్యూగినియా, న్యూజిలాండ్.. రింగ్ ఆఫ్ ఫైర్ దేశాలు.

## చేజారిన విశాఖ

**(1వపేజీ తరువాయి)**కూటమి పార్టీలు తమ కార్పొరేటర్లను దేశ, విదేశాల్లోని క్యాంపులకు తరలించాయి. మరికొందరు వైసీపీ కార్పోరేటర్లు స్వచ్ఛంధంగానే పార్టీని వీడి కూటమి పార్టీలైన టీడీపీ, జనసేనలో చేరిపోయారు. దీంతో కూటమి బలం అంతకంతకూ పెరుగుతూ వచ్చింది. ఇవాళ అవిశ్వాస తీర్మానంపై విశాఖ కార్పొరేషన్ కౌన్సిల్ భేటీ ఏర్పాటు చేశారు. దీనికి కూటమి తరఫున ఏకంగా 72 మంది కార్పోరేటర్లు హాజరై అవిశ్వాస తీర్మానానికి అనుకూలంగా ఓటేశారు. దీంతో అవిశ్వాస తీర్మానం సునాయాసంగా నెగ్గింది. ఇదంతా ముందే ఊహించిన వైసీపీ ఓటింగ్ కు దూరంగా ఉండిపోయింది. ఇప్పటికే రాష్ట్రంలోని పలు స్థానిక సంస్థల్లో మేయర్లు, ఛైర్మన్లపై అవిశ్వాస తీర్మానాలు పెట్టించి గెలుస్తూ వస్తున్న కూటమి ఖాతాలో ఇప్పుడు గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ కూడా చేరిపోయింది. అయితే కూటమి తరఫున మేయర్ పదవి చేపట్టే వారికి కేవలం 8 నెలల పదవీకాలం మాత్రమే ఉండబోతోంది. ఆ తర్వాత ఎలాగో ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. దీంతో ఓ దశలో అవిశ్వాసం వద్దని కూటమి పార్టీల్లో కొందరు నేతలు సూచించారు. అయితే అధిష్టానాలు మాత్రం వేరే ఉద్దేశంతో ఉన్నాయి. జీవీఎంసీ మేయర్ పీఠం కైవసం చేసుకుంటే విశాఖలో తమకు మొగ్గు లభిస్తుందని భావించాయి.

# 'సాయిరెడ్డి బట్టే బాజ్'

డాక్యుమెంట్స్ తేవాలా అని అడిగినట్లు పేర్కొన్నారు. విచారణకు తాను సహకరిస్తానని చెప్పానని, ఈ మెస్సేజ్ పెట్టాక రెండో నోటీసు ఇచ్చారని తెలిపారు. కేసులో ప్రాథమిక సమాచారం ఇవ్వాలని కోరినట్లు రాజ్ తెలిపారు. మీడియాలో తనపై తప్పుడు ప్రచారం జరుగుతోందన్నారు. నేను లేని టైమ్‌లో తన తల్లికి నోటీసులు ఇచ్చారని వెల్లడించారు. సాక్షిగా తనకు నోటీసులు ఇచ్చి విచారణకు రమ్మన్నారు. సాక్షిగా విచారణకు పిలిచి అరెస్ట్ చేయాలని చూస్తున్నారని లాయర్లు చెప్పారు. తనకు వచ్చిన నోటీసులను హైకోర్టులో సవాల్ చేశానన్నారు. ముందస్తు బెయిల్ పిటిషన్ కూడా వేశానన్నారు. న్యాయ సలహా తీసుకున్నాక విచారణకు వస్తానని తెలిపారు. మరోవైపు మద్యం కుంభకోణంలో తన పేరు పదే పదే ప్రస్తావిస్తున్న వైసీపీ మాజీ ఎంపీ విజయసాయిరెడ్డిపై రాజ్ విమర్శలు గుప్పించారు. విజయసాయిరెడ్డి ఒక బట్టేబాజ్ మనిషి అన్నారు. విజయసాయి చరిత్రను అందరి ముందు పెడతానని హెచ్చరించారు. అప్పటివరకు తనపై ఏకపక్షంగా వార్తలు వేయకండని మీడియాను రాజ్ కసిరెడ్డి కోరారు.

## పగబట్టిన ట్రంప్

**(1వపేజీ తరువాయి)**దరఖాస్తులు రద్దయినట్లు స్టూడెంట్ అండ్ ఎక్స్ఛేంజ్ విజిటర్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ తెలిపింది. వీటిలో ఎక్కువ శాతం ఎఫ్1 కేటగిరీలో ఉన్నవే. డొనాల్డ్ ట్రంప్ ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం అమలులోకి వచ్చిన సెవిస్ టెర్మినేషన్ కొత్త నిబంధనలు, విధి విధానాలపై ప్రభుత్వం నుండి ముందస్తు సమాచారం ఉండట్లేదని, ఇది విద్యార్థులను ఆందోళనకు గురి చేస్తోందని అమెరికన్ ఇమ్మిగ్రేషన్ లాయర్స్ అసోసియేషన్ చెబుతోంది. స్టూడెంట్స్ విసా కోసం దరఖాస్తు చేసుకున్న మొత్తం విద్యార్థుల్లో 14 శాతం మంది మాత్రమే ఇమ్మిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ నుండి నోటీసు అందుకున్నారని, వారందరూ ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రైనింగ్‌పై ఉన్న వాళ్లేనని ఇమ్మిగ్రేషన్ లాయర్స్ అసోసియేషన్ వెల్లడించింది. వాళ్ల ట్రైనింగ్ కూడా రద్దయినట్లు వివరించింది.

## అభివృద్ధిని అడ్డుకుంటున్నది వారే

**(1వపేజీ తరువాయి)**అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నాయి. మరోవైపు, తోషిబా సంస్థ రుద్రారంలో కొత్త ఫ్యాక్టరీని ఏర్పాటు చేయడానికి సుముఖత వ్యక్తం చేసింది. 562 కోట్ల రూపాయల పెట్టుబడితో సర్జ్ అరెస్టర్స్ ఫ్యాక్టరీని నెలకొల్పడానికి ఒప్పందం కుదిరింది. టోక్యోలో జరిగిన ఉన్నత స్థాయి సమావేశంలో ఈ పెట్టుబడుల ఒప్పందాలు జరిగాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో %చీు% డేటా, నెయిసా నెట్‌వర్క్స్ ప్రతినిధులు ఈ ఒప్పందాలపై సంతకాలు చేశారు. ఈ డేటా సెంటర్ క్లస్టర్ దేశంలోనే అతిపెద్ద కంప్యూట్ మౌలిక సదుపాయంగా నిలవనుంది. 25,000 లతో దేశంలోనే అత్యంత శక్తివంతమైన సూపర్ కంప్యూటింగ్ మౌలిక సదుపాయాలను ఇది సమకూరుస్తుంది. తెలంగాణను ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రాజధానిగా మార్చాలనే ప్రభుత్వ లక్ష్యానికి ఈ ప్రాజెక్టు ఒక మైలురాయి కానుందని ధీమా వ్యక్తం చేశారు. " ఈ క్లస్టర్‌కు 500 మెగావాట్ల వరకు గ్రిడ్, పునరుత్పాదక విద్యుత్తును వినియోగించనున్నారు. లిక్విడ్ ఇమ్మర్షన్ వంటి అత్యాధునిక కూలింగ్ టెక్నాలజీలను ఉపయోగించనున్నారు. అత్యున్నత పర్యావరణ, సామాజిక, పాలన ప్రమాణాలతో ఈ ప్రాజెక్టును అభివృద్ధి చేస్తారు. ఈ క్యాంపస్ తెలంగాణలోని విద్యా సంస్థలతో భాగస్వామ్యం కలిగి ప్రతిభను పెంపొందిస్తుంది.

## ఎమ్మెల్సీ ఎన్నికల బహిష్కరణ

**(1వపేజీ తరువాయి)**కొనియాడారు. 2017 జీహెచ్ఎంసీ ఎన్నికల్లో 150కి 99 కార్పొరేట్ స్థానాలు గెలిచి బీఆర్ఎస్ చరిత్ర సృష్టించిం దని చెప్పారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో హైదరాబాద్‌లో క్లీన్ స్వీప్ చేశామన్నారు. 2023 అసెం బ్లీ ఎన్నికల్లోనూ ఓఆర్ఆర్ లోపల గులాబీ జెండానే ఎగిరిందని తెలిపారు. హైదరాబాద్ వాసుల ముందు కాంగ్రెస్, బీజేపీ మాయమాటలతో ఉపయోగం లేదన్నారు. %ూశ్రీంశీ =ఝు%% తెలంగాణ ఇంటర్ ఫలితాలు ఆ రోజే - ప్రభుత్వ ప్రకటన..!! ముఖ్యమంత్రి రేవంత్ పైన కేటీఆర్ కీలక వ్యాఖ్యలు చేసారు. హైడ్రా పేరుతో సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్రంలో అరాచకం సృష్టించారని కేటీఆర్ అన్నారు. తన అన్న ఇంటిని కూల్చలేదని విమర్శిం చారు. ధనవంతుల ఇళ్లను ముట్టుకోలేదని తెలిపారు. హైకోర్టు మొట్టికాయలు వేసినా హైడ్రా తన పనితీరు మార్చుకోలేదని అన్నారు. హైడ్రా దెబ్బ, రేవంత్ చేతగానితనానికి హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ పతనమైందని తెలిపారు. లక్ష మంది ఉపాధి కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. రెక్కాడితే గాని డొక్కాడని పేదల కడుపు కాంగ్రెస్ కొట్టిందని అన్నారు. ఆరు గ్యారంటీల అమలుకు డబ్బులు లేవని అంటున్న సీఎం రేవంత్ రెడ్డి.. లక్షన్నర కోట్లతో మూసీ సుందరీకరణ అంటున్నా రని మండిపడ్డారు. బీఆర్ఎస్ హయాంలో ఎస్టీపీలను కట్టి మూసీలోకి వ్యర్థాలు పోకుండా చేశామని గుర్తుచేశారు. మూసీ కోసం ఇండ్లను కోల్పోయినవారు బూతులు తిడితే కేసులు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## పూసపాటిరేగ పోలీస్ స్టేషన్‌లో శ్రీరెడ్డి విచారణ

**(1వపేజీ తరువాయి)** పోలీస్ స్టేషన్ లో విచారణకు హాజరయింది. విచారణకు హాజరు కావాలంటూ పోలీసులు నోటీసులు ఇచ్చిన నేపథ్యంలో ఆమె పోలీస్ స్టేషన్ కు వచ్చింది. పీఎస్ కు వచ్చిన ఆమెను పోలీసులు విచారిస్తున్నారు.
జగన్ సీఎంగా ఉన్న సమయంలో శ్రీరెడ్డి అడ్డూఅదుపు లేకుండా చెలరేగిపోయింది. మహిళ అనే విచక్షణ కూడా లేకుండా సోషల్ మీడియా వేదికగా బండ బూతులు మాట్లాడింది. అయితే ఎన్నికల్లో కూటమి గెలిచిన వెంటనే ఆమె స్వరం మార్చింది. తనను క్షమించాలని, ఇకపై రాజకీయాల గురించి మాట్లాడనని ఆమె వేడుకుంది.
'నారా లోకేశ్ అన్నయ్యా క్షమించండి' అంటూ బహిరంగంగా క్షమాపణలు కూడా చెప్పింది. అయితే ఆమెపై తీవ్ర ఆగ్రహంతో ఉన్న కూటమి కార్యకర్తలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో ఆమెపై కేసు నమోదు చేసిన పోలీసులు... విచారణకు హాజరు కావాలని నోటీసులు ఇచ్చారు. దీంతో ఆమె విచారణకు హాజరయ్యారు.

## రాజ్ ఎక్కడ?

**(1వపేజీ తరువాయి)**అయితే, ఈ వాదనల పట్ల పోలీసు వర్గాల నుంచి ఎలాంటి స్పందన లేదు. కసిరెడ్డి దేశం విడిచి వెళ్లలేదని, డిజిటల్ ఆధారాలు లభించకుండా ఉండేందుకు నిరంతరం ప్రాంతాలు మారుస్తూ ఇక్కడే రహస్య ప్రదేశంలో తలదాచుకున్నారని పోలీసులు భావిస్తున్నట్టు తెలుస్తోంది.

### సిట్ దర్యాప్తు ముమ్మరం.. సోదాలు, పత్రాల స్వాధీనం

మరోవైపు సిట్ అధికారులు దర్యాప్తు ముమ్మరం చేశారు. కసిరెడ్డి కోసం హైదరాబాద్‌లోని 15 ప్రాంతాల్లో ఆయన బంధువులు, స్నేహితుల ఇళ్లతో పాటు, ఆయన పెట్టుబడులు పెట్టినట్లు భావిస్తున్న అరిటా హాస్పిటల్స్, ఈడీ క్రియేషన్స్ వంటి సంస్థలపై దాడులు నిర్వహించారు. 2019 నుంచి 2024 మధ్య జరిగిన లావాదేవీలకు సంబంధించిన కీలక పత్రాలను స్వాధీనం చేసుకున్నారు.
విజయసాయి రెడ్డి ప్రస్తావించిన నలుగురు వ్యక్తులతో పాటు, ఆయా సంస్థల డైరెక్టర్లకు సోమవారం నుంచి నోటీసులు జారీ చేసి, పెట్టుబడుల మూలాలపై విచారించాలని సిట్ భావిస్తున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో కసిరెడ్డి ఆడియో సందేశం ఎక్కడి నుంచి వచ్చిందనే దానిపై కూడా సిట్ ఆరా తీస్తోంది.



## కార్మికులకు చిత్రహింసలు.. విద్యుత్ షాక్‌లు ఇచ్చిన యజమాని



**రాయ్‌పూర్-నవభూమి:** ఐస్‌క్రీమ్ ఫ్యాక్టరీలో పని చేసే ఇద్దరు కార్మికులను యజమాని, అతడి అనుచరుడు కలిసి చిత్రహింసలకు గురిచేశారు. దొంగతనం ఆరోపణలపై విద్యుత్ షాక్‌లు ఇచ్చారు. చేతి వేళ్ల గోళ్లు పీకడంతోపాటు వారిని కొట్టారు. అక్కడి నుంచి తప్పించుకుని పారిపోయిన ఇద్దరు కార్మికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఛత్తీస్‌గఢ్‌లోని కోర్బా జిల్లాలో ఈ సంఘటన జరిగింది. ఖప్రభట్టి ప్రాంతంలోని ఐస్‌క్రీం ఫ్యాక్టరీలో రాజస్థాన్‌లోని భిల్వారా జిల్లాకు చెందిన అభిషేక్ భంబీ, వినోద్ భంబీ పని చేస్తున్నారు. ఏప్రిల్ 14న వారిద్దరూ దొంగతనం చేసినట్లు యజమాని చోటూ గుర్జార్ ఆరోపించాడు. తన అనుచరుడు ముఖేష్ శర్మతో కలిసి కార్మికుల చొక్కాలు విప్పించి చిత్రహింసలకు గురిచేశాడు. కరెంట్ వైర్‌తో వారికి విద్యుత్ షాకులు ఇచ్చాడు. పటకారుతో గోళ్లు పీకడంతోపాటు కర్రతో వారిని కొట్టారు.కాగా, కార్మికులైన అభిషేక్, వినోద్ ఆ ఐస్‌క్రీం ఫ్యాక్టరీ నుంచి తప్పించుకున్నారు. రాజస్థాన్ భిల్వారాలోని సొంతూరుకు చేరుకున్నారు. యజమాని వేధింపుల గురించి గులాబురా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రూ.20,000 అడ్వాన్స్ అడిగినందుకు విద్యుత్ షాకులతో చిత్రహింసలకు గురి చేశారని వారు ఆరోపించారు. వేధింపులకు సంబంధించని వీడియో క్లిప్‌ను పోలీసులకు అందజేశారు.

## వాహనాలపైకి దూసుకెళ్లిన తెలుగు నటుడి కారు.. నలుగురికి తీవ్ర గాయాలు.. హీరో పరిస్థితేంటంటే?



**చెన్నై- నవభూమి:** తమిళనాడు చెన్నైలో విషాధకర ఘటన చోటు చేసుకుంది. తెలుగు నటుడు, జాతీయ అవార్డు గ్రహీత బాబీ సింహ కారు.. అనుకోకుండా ఆరు వాహనాలపైకి దూసుకు వెళ్లింది. ఈ ఘటనలో నలుగురు వ్యక్తులు తీవ్రంగా గాయపడగా.. పోలీసులు వారిని ఆస్పత్రికి తరలించారు. అలాగే బాబీ సింహ డ్రైవర్‌పై కేసు నమోదు చేసుకుని.. అతడిని అదుపులోకి తీసుకున్నారు. మద్యం సేవించి వాహనం నడపడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని.. ప్రస్తుతం దర్యాప్తు సాగుతోందని పోలీసులు వెల్లడించారు. ఆ పూర్తి వివరాలు మీకోసం.తమిళనాడు చెన్నైలోని ఎక్కడుతంగల్-చెన్నై ఎయిర్ పోర్ట్ రోడ్డుపై తెలుగు నటుడు, జాతీయ అవార్డు గ్రహీత బాబీ సింహ కారు విమానాశ్రయానికి వెళ్తోంది. అయితే అనుకోకుండా అలందూర్ మెట్రో స్టేషన్ వైపు ఉన్న కత్తిపార ఫ్లైఓవర్ దిగుతుండగా.. కారు అదుపుతప్పి ముందు వెళ్తున్న 6 వాహనాలపైకి దూసుకు వెళ్లింది. దీంతో ముందు వాహనాల్లో ఉన్న నలుగురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. విషయం గుర్తించిన స్థానికులు వెంటనే వచ్చి క్షతగాత్రులకు సాయం చేశారు. మరోవైపు పోలీసులకు, అంబులెన్సుకు ఫోన్ చేయగా.. వారంతా హుటాహుటిన రంగంలోకి దిగారు.

ఈక్రమంలోనే తీవ్ర గాయాలపాలైన నలుగురు వ్యక్తులను ఆస్పత్రికి తరలించారు. మరోవైపు పోలీసులు ప్రమాదానికి గురైన వాహనాలను పరిశీలించారు. ఈక్రమంలోనే బీభత్సం సృష్టించిన కారు నటుడు బాబీ సింహది అని తేల్చారు. ఆపై ఆ కారు నడిపిన డ్రైవర్ పుష్పరాజ్‌ను అదుపులోకి తీసుకున్నారు. ప్రమాద సమయంలో కారులో బాబీ సింహ లేరని పోలీసులు వెల్లడించారు. అలాగే డ్రైవర్ మద్యం సేవించి కారు నడిపాడని అందువల్లే ప్రమాదం జరిగిందని వివరించారు. అందుకే కారు డ్రైవర్ పుష్పరాజ్‌ను అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. కేసు దర్యాప్తు కొనసాగుతోందని స్పష్టం చేశారు.ప్రస్తుతం 41 ఏళ్ల వయసు కల్గిన బాబీ సింహ ప్రధానంగా తమిళ, తెలుగు చిత్రాల్లో నటించారు. కాదలిల్ సోదప్పువదు యెప్పడి, పిజ్జా చిత్రాల్లో కాసేపు మాత్రమే కనిపించిన ఈయన.. సూదు కవ్వుమ్, నేరం వంటి సినిమాలు చేశారు. ఇవి మాత్రమే కాకుండా చిరంజీవి హీరోగా చేసిన వాల్తేరు వీరయ్య, కమల్ హాసన్ నటించిన భారతీయుడు-2, రవితేజ నటించి డిస్కోరాజా, రజాకార్ వంటి చిత్రాల్లో కీలక పాత్రలు పోషించారు. ఉత్తమ విలన్‌గా విజయ్ అవార్డు, సహాయ పాత్రలో ఉత్తమ నటుడిగా జాతీయ చలనచిత్ర అవార్డు, తమిళంలో ఉత్తమ సహాయ నటుడిగా ఫిల్మ్ ఫేర్ అవార్డును అందుకున్నారు.

## ఖైదీల కోసం ఏకాంత గదుల ఏర్పాటు..



**న్యూఢిల్లీ-నవభూమి:** ఏవైనా కేసుల్లో నేరాలు చేసి ప్రస్తుతం జైల్లో ఉండి శిక్ష అనుభవిస్తున్న ఖైదీలు అంతా.. నిత్యం నరకం చూస్తుంటారు. జైల్లోనే వారి జీవితాలు మగ్గిపోతుండగా.. ఎప్పుడో ఒకసారి మాత్రమే వారి కుటుంబ సభ్యులను చూడొచ్చు. ముఖ్యంగా వీరు శృంగార జీవితానికి పూర్తిగా దూరం అవుతారు. స్త్రీ, పురుషులను వేర్వేరు జైల్లలో ఉంచి మరీ వారిని ప్రేమ, సాన్నిహిత్యానికి దూరం చేస్తుంటారు. కానీ మనం ఇప్పుడు చూడబోయే జైల్లు మాత్రం.. ఖైదీల కోసం ప్రత్యేకంగా ఏకాంత గదులను ఏర్పాటు చేయబోతున్నాయి. అందులో ఖైదీలు వారి భాగస్వాములను పిలిపించుకుని వారితో ఎంజాయ్ చేయొచ్చు. మరి ఇదెక్కడో మనం ఇప్పుడు తెలుసుకుందాం.ఇటలీలోని జైళ్లలో ఉండే ఖైదీలు ఎక్కువగా ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. మానసిక అనారోగ్యంతో కొందరు, జైల్లో ఉండి నరకం చూడలేక మరికొందరు బలవన్మరణానికి పాల్పడుతున్నట్లు నివేదికలు చెబుతున్నాయి. అయితే వీటిని అరికట్టేటందుకు అధికారులు అనేక చర్యలు తీసుకుంటున్నారు. ఈక్రమంలోనే ఖైదీలకు అనేక వసతులు కల్పిస్తున్నారు. ముఖ్యంగా ఖైదీలు తమ కుటుంబ సభ్యులకు ఎక్కువ సార్లు ఫోనే చేసుకునే వీలును కల్పించారు. ఇది మాత్రమే కాకుండా తాజాగా భాగస్వాములతో ఏకాంతంగా కలుసుకుని శృంగారం చేసుకునే వీలును కూడా కల్పించేందుకు రంగం సిద్ధం చేశారు.గతేడాది జనవరి నెలలో ఇటలీలోని కాన్‌స్టిట్యూషనల్ కోర్టు న్యాయస్థానం ఖైదీలకు సైతం తమ భాగస్వాములను ప్రైవేటుగా కలుసుకునే హక్కు ఉందని.. అందుకోసం వారికోసం ఏకాంత గదులు ఏర్పాటు చేయాలంటూ తీర్పు ఇచ్చింది. అలాగే ఖైదీల కోసం అక్కడకు వచ్చే వారిలో వారి భార్య లేదా భర్త.. ఎక్కువ కాలం సహజీవనం చేసిన భాగస్వాములు మాత్రమే ఉండాలని కూడా పేర్కొంది. అయితే వారు కలుసుకునే సమయంలో.. ఆ గదుల వద్ద జైలు గార్డులు ఉండకూడదని వివరించింది. దీనికి అనుగుణంగానే అధికారులు చర్యలు చేపట్టారు.దీంతో ఇటలీలోని అన్ని జైళ్లలో ప్రత్యేకంగా ఏకాంత గదులను ఏర్పాటు చేశారు. తొలిసారిగా సెంట్రల్ ఉంబ్రియా ప్రాంతంలోని జైల్లో ఈ ప్రత్యేక సదుపాయాన్ని శుక్రవారం రోజు నుంచే అందుబాటులోకి తీసుకు వచ్చారు. దీనిపై ఖైదీలు హక్కుల కార్యకర్తలు సహా ఖైదీల కుటుంబ సభ్యులు తెగ సంబుర పడిపోతున్నారు. అయితే ఏకాంత గదుల ఏర్పాటు చాలా మంచిదని.. అయితే దాన్ని వినియోగించుకునే ఖైదీల వ్యక్తిగత గోపత్యకు భంగం వాటిల్లకుండా చూసుకోవాలని కార్యకర్తలు వివరిస్తున్నారు. ఇలా చేస్తేనే వారు ఈ అవకాశాన్ని వాడుకోగల్గుతారని లేకపోతే.. సమస్యలు వస్తాయని దూరంగా ఉంటారని చెప్పుకొస్తున్నారు.అయితే ఇలాంటి సదుపాయం ఐరోపాలోని చాలా దేశాల్లో ఇప్పటికే అందుబాటులో ఉంది. ముఖ్యంగా ఫ్రాన్స్, నెదర్లాండ్స్, స్వీడన్‌లోని కొన్ని జైళ్లలో కూడా ఖైదీలకు ఏకాంత గదులు ఉన్నాయి. ఇప్పుడు ఇటలీలో కూడా ఏర్పాటు చేయగా.. అంతా హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఇటలీలోని జైళు కిక్కిరిసిపోయి ఉన్నాయి. మొత్తంగా ఈదేశంలో 62 వేల మంది ఖైదీలు ప్రస్తుతం శిక్షను అనుభవిస్తుండగా.. జైళ్ల గరిష్ఠ సామర్థ్యం కంటే ఈ సంఖ్య 21 శాతం ఎక్కువ కావడం గమనార్హం.

## బీజేపీకి ఓటు వేయకపోతే కుక్కలు, గొర్రెలుగా పుడతారు..: ఎమ్మెల్యే వివాదాస్పద వీడియో వైరల్



**మధ్యప్రదేశ్-నవభూమి:** మధ్య ప్రదేశ్‌కు చెందిన బీజేపీ ఎమ్మెల్యే ఉషా ఠాకూర్ మరోసారి వివాదాస్పద వ్యాఖ్యలు చేసి వార్తల్లో నిలిచారు. ముఖ్యంగా ఓ కార్యక్రమానికి వెళ్లిన ఆమె.. ఓటర్ల గురించి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. మద్యం, డబ్బు, బహుమతులు వంటి ప్రలోభాలకు లొంగి ఓట్లను అమ్మకునే వారంతా వచ్చే జన్మలో జంతువులుగా పుడతారని వ్యాఖ్యానించారు. తాను రోజూ దేవుడితో మాట్లాడతానని చెబుతూనే.. ప్రజాస్వామ్య హక్కును అమ్ముకున్నా, ప్రజలకు మంచి చేసే బీజేపీకి ఓటు వేయకపోయినా ఇదే జరుగుతుందంటూ వెల్లడించారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియో నెట్టింట తెగ వైరల్ అవుతోంది.మధ్య ప్రదేశ్‌లోని మోవ్ అసెంబ్లీ నియోజకవర్గంలోని హసల్ పూర్ గ్రామంలో ఏప్రిల్ 16వ తేదీన జరిగిన ఓ కార్యక్రమానికి.. బీజేపీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి ఉషా ఠాకూర్ వెళ్లారు. అక్కడే ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ.. షాకింగ్ కామెంట్లు చేశారు. బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న అనేక పథకాల ద్వారా ప్రతి లబ్ధిదారుల ఖాతాల్లోకి వేల రూపాయలు వెళ్తున్నాయని చెప్పుకొచ్చారు. ఇలా అన్ని రంగాల వారికి కమలం పార్టీ మంచి చేస్తోందని.. రాష్ట్రాభివృద్ధి కోసం వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తుందని వెల్లడించారు. అయితే ఇదంతా ప్రజలు అర్థం చేసుకుని వచ్చే ఎన్నికల్లో కూడా బీజేపీకే ఓటు వేయాలని సూచించారు.అలా కాదని మద్యం, డబ్బు, బహుమతులు వంటి ప్రలోభాలకు లొంగి ఓట్లు అమ్ముకుంటే.. రాష్ట్రాభివృద్ధి గంగలో కలుస్తుందని చెప్పారు. ప్రజంలతా ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని.. అందుకోసం బీజేపీకి మాత్రమే ఓటు వేయాలని ఎమ్మెల్యే ఉషా ఠాకూర్ వివరించారు. ఓటు వేసేటప్పుడు ప్రతీ ఓటర్ చిత్తశుద్ధిని కోల్పోవద్దని చెప్పారు. ముఖ్యంగా ప్రలోభాలకు లొంగి ఓటు వేసే వారు వచ్చే జన్మలో కచ్చితంగా ఒంటెలు, గొర్రెలు, మేకలు, కుక్కలు, పిల్లులు, పందులుగా పుడతారని తెలిపారు. ఇది మీ డైరీలో రాసిపెట్టుకోండని కూడా వివరించారు.ప్రజాస్వామ్యాన్ని అమ్ముకునే వారు మరు జన్మలో కచ్చితంగా జంతువులుగానే జన్మిస్తారని.. తాను ప్రతిరోజూ దేవుడితో మాట్లాడాతానని చెప్పుకొచ్చారు. దేశం, మతం, సంస్కృతికి సేవ చేసే బీజేపీకి మాత్రమే ఓటు వేయాలని పదే పదే వెల్లడించారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియో నెట్టింట వైరల్ అవుతుండగా.. పెద్ద ఎత్తున విమర్శలు వస్తున్నాయి. ఓటు ఎవరికి వేయాలనేది పూర్తిగా ఓటర్ల ఇష్టం అని... బీజేపికి ఓటు వేయకపోతే మరు జన్మలో ఎలా జంతువులుగా పుడతారని కామెంట్ల రూపంలో ప్రశ్నిస్తున్నారు. మరి ఈ వీడియో చూస్తే మీకేమనిపిస్తుందో కామెంట్ల

## బంగ్లాదేశ్‌లో హిందూ నేత కిడ్నాప్, దారుణ హత్య.. తీవ్రంగా స్పందించిన భారత్



**బంగ్లాదేశ్-నవభూమి:** బంగ్లాదేశ్‌లో మైనార్టీలపై హింస ఇంకా జరుగుతూనే ఉంది. తాజాగా హిందూ కమ్యూనిటీకి చెందిన ఓ నాయకుడిని గుర్తు తెలియని వ్యక్తులు కిడ్నాప్ చేశారు. ఆపై చిత్రహింసలు పెట్టి మరీ అత్యంత దారుణంగా హత్య చేశారు. గురువారం రోజే ఈ ఘటన జరగ్గా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అయితే తాజాగా దీనిపై భారత దేశం తీవ్రంగా స్పందించింది. మైనార్టీలపై చాలా రోజులుగా ఈ దాడులు సాగుతూనే ఉన్నాయని.. ఇకనైనా వాటిని ఆపాల్సిన బాధ్యతను తాత్కాలిక ప్రభుత్వం తీసుకోవాలని చెప్పింది. అలాగే మైనార్టీల రక్షణ కోసం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. ఉత్తర బంగ్లాదేశ్‌లోని దినాజ్ పుర్‌కు చెందిన 58 ఏళ్ల భబేష్ చంద్రరాయ్‌కు గురువారం రోజు గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేశారు. ఎక్కడున్నావని అడగ్గా.. ఇంట్లోనే ఉన్నానని ఆయన సమాధానం ఇచ్చారు. ఆ తర్వాత కాసేపటికే నలుగురు వ్యక్తులు అక్కడికి వచ్చి అతడిని బలంవంతగా తీసుకెళ్లారు. దీంతో భయపడిపోయిన కుటుంబ సభ్యులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. హుటాహుటిన రంగంలోకి దిగిన పోలీసులు కేసు నమోదు చేసుకుని.. భబేష్ చంద్రరాయ్ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఈక్రమంలోనే నరబరి గ్రామంలో భబేశ్ తీవ్రగాయలతో కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతూ కనిపించారు. దీంతో పోలీసులు వెంటనే అతడిని ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అతడు చనిపోయినట్లు ధ్రువీకరించారు. అయితే ఎవరో కావాలనే అతిడిపై దాడి చేసి హత్య చేశారని.. దర్యాప్తు సాగిస్తున్నామని పోలీసులు వెల్లడించారు. గురువారం రోజే కిడ్నాప్, హత్య రెండూ జరగ్గా.. ఆలస్యంగా ఈ విషయం వెలుగులోకి వచ్చింది. దీంతో భారత్ ఈ ఘటనపై తీవ్రంగా స్పందించింది. ముఖ్యంగా భారత విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్.. భబేష్ మృతి పట్ల తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. బంగ్లాదేశ్‌లో హిందూ మైనార్టీ నేత కిడ్నాప్, దారుణ హత్య గురించి తెలిసి తీవ్రంగా కలత చెందినట్లు వివరించారు. బంగ్లాదేశ్‌లో తాత్కాలిక ప్రభుత్వ పాలనలో కూడా హిందూ మైనార్టీలపై అనేక దాడులు జరుగుతున్నాయని రణధీర్ జైస్వాల్ వివరించారు. ఇప్పటి వరకు జరిగిన ఎన్నో దాడుల్లో ఇది కూడా ఒకటంటూనే... గతంలో ఇలాంటి దాడులకు పాల్పడిన వారంతా ఎలాంటి శిక్ష లేకుండా స్వేచ్ఛగా తిరుగుతున్నారని పేర్కొన్నారు. ఈ ఘటనను మేము తీవ్రంగా ఖండిస్తున్నా మంటూనే.. ఎలాంటి సాకులు, వివక్ష లేకుండా మైనార్టీలను రక్షించే బాధ్యతను తాత్కాలిక ప్రభుత్వం తీసుకోవాలని కోరారు. చూడాలి మరి దీనిపై బంగ్లాదేశ్ సర్కారు ఎప్పుడు స్పందిస్తుందనేది.

## రథోత్సవంలో అపశృతి.. కూలిన రథం పైభాగం



**బెంగళూరు - నవభూమి:** రథోత్సవంలో అపశృతి జరిగింది. తాడు తెగడంతో రథం పైభాగం కూలిపోయింది. దీంతో భక్తులు భయాందోళన చెందారు. దూరంగా పరుగెత్తారు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. కర్ణాటకలోని దక్షిణ కన్నడ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. ముల్కి పట్టణం సమీపంలోని బప్పనాడు గ్రామంలో శాంభవి నది ఒడ్డున దుర్గాపరమేశ్వరి ఆలయం ఉన్నది. ప్రతి ఏటా ఏప్రిల్‌లో ఆలయ వార్షికోత్సవంలో భాగంగా బ్రహ్మరథోత్సవం జరుపుతారు. ఇందులో భాగంగా శుక్రవారం రాత్రి రథోత్సవం నిర్వహించారు. దేవతతో పాటు పూజారులున్న రథాన్ని వేలాది మంది భక్తులు లాగారు.

కాగా, బ్రహ్మ రథోత్సవం సందర్భంగా అపశృతి జరిగింది. ఒక రథానికి కట్టిన తాడు తెగిపోయింది. దీంతో విద్యుత్ అలంకరణతో ఉన్న రథం పైభాగం కూలిపోయింది. అప్రమత్తమైన భక్తులు దూరంగా పరుగులు తీశారు. ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరుగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. అనంతరం మిగతా రథాలతో ఊరేగింపును కొనసాగించారు. అయితే రథం పైభాగం కూలిన వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.

## కూతురి మామగారితో కలిసి పారిపోయిన మహిళ.. భర్త ఫిర్యాదుతో వెతుకుతున్న పోలీసులు



**లక్నో-నవభూమి:** కూతురు మామగారితో కలిసి ఒక మహిళ పారిపోయింది. ఇంట్లోని నగలు, నగదు, ఇతర విలువైన వస్తువులను వెంట తీసుకెళ్లింది. భర్త ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. పారిపోయిన వియ్యంకుడు, వియ్యపురాలి కోసం వెతుకుతున్నారు. ఉత్తరప్రదేశ్‌లోని బుదౌన్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. 43 ఏళ్ల మమతకు నలుగురు పిల్లలు. ఆమె భర్త లారీ డ్రైవర్. దీంతో అతడు చాలా కాలం ఇంటికి దూరంగా ఉండేవాడు. ఈ నేపథ్యంలో కుమార్తె మామగారైన 46 ఏళ్ల శైలేంద్ర, మమత మధ్య ఏడాదిగా సంబంధం ఏర్పడింది. భర్త లేనప్పుడు వియ్యంకుడైన అతడ్ని తన ఇంటికి పిలిపించేది.కాగా, ఏప్రిల్ 11న వియ్యంకుడు శైలేంద్రకు మమత ఫోన్ చేసింది. ఆ తర్వాత ఇంట్లో ఉన్న డబ్బు, నగలు, విలువైన వస్తువులను తీసుకుని అతడితో కలిసి పారిపోయింది. ఈ విషయం తెలుసుకున్న మమత భర్త, శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పారిపోయిన వియ్యంకుడు, వియ్యపురాలి కోసం వెతుకుతున్నట్లు పోలీస్ అధికారి తెలిపారు. వారి ఆచూకీని గుర్తించిన తర్వాత తదుపరి చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

## వివాహేతర సంబంధం నేరం కాదు..: ఢిల్లీ హైకోర్టు సంచలన తీర్పు



**న్యూఢిల్లీ-నవభూమి:** పెళ్ల భర్త ఉండగానే.. ఆ భార్య మరో వ్యక్తితో ప్రేమలో పడింది. భర్తకు తెలియకుండా.. అతడితో కలిసి చాలా రోజులుగా వివాహేతర సంబంధం కొనసాగి స్తోంది. హెూటళ్లు, ఇతర ప్రాంతాలకు వెళ్తూ అతడితో ఎంజాయ్ చేసింది. అయితే ఈ విషయం తెలుసుకున్న భర్త.. భార్య ప్రియుడిపై కేసు పెట్టాడు. దీనిపై తాజాగా ఢిల్లీ హైకోర్టు విచారణ జరిపింది. ముఖ్యంగా భార్య ప్రియుడికి ఈ కేసు నుంచి విముక్తి కల్పిస్తూ.. వివాహేతర సంబంధం నేరం కిందకు రాదని వివరించింది. అలాగే భార్యను భర్త ఆస్తిగా పరిగణించే మహాభారత కాలంనాటి భావజాలానికి ఇప్పుడు కాలం చెల్లిందని కూడా చెప్పుకొచ్చింది. ఢిల్లీకి చెందిన ఓ మహిళ.. తనకు పెళ్లై భర్త ఉండగానే మరో వ్యక్తితో ప్రేమలో పడింది. చాలా కాలం నుంచి భర్తకు తెలియకుండా అతడితో వివాహేతర సంబంధం సాగిస్తోంది. అయితే ఇటీవలే వారిద్దరూ ఓ హెూటల్‌కు వెళ్లి ఎంజాయ్ చేయగా.. భర్తకు ఆ విషయం తెలిసింది. దీంతో అతడు కోర్టును ఆశ్రయించాడు. ముఖ్యంగా భార్య హద్దులు మీరి ప్రవర్తిస్తోందని, ప్రియుడితో కలిసి శారీరక సంబంధం కొనసాగిస్తోందని.. ఇది నేరమంటూ ఆరోపించాడు. ఇలా ఈ కేసుపై విచారణ జరిపిన మేజిస్ట్రేట్ కోర్టు ప్రియుడిని దోషిగా చేయడం సరికాదని తీర్పునిచ్చింది. దీంతో భర్త సెషన్స్ కోర్టును ఆశ్రయించాడు.ఈక్రమంలోనే విచారణ జరిపిన ఆ న్యాయస్థానం.. పెళ్లై భర్త ఉన్న మహిళతో వివాహేతర సంబంధం కొనసాగించడం తప్పంటూ ఆమె ప్రియుడికి నోటీసులు జారీ చేసింది. దీంతో భర్త హ్యాపీగా ఫీల్ అవ్వగా.. ప్రియుడు మాత్రం తనకు అన్యాయం జరుగుతోందంటూ.. సెషన్స్ కోర్టు తీర్పును ఢిల్లీ హైకోర్టులో సవాల్ చేశాడు. ఈక్రమంలోనే విచారణ జరిపిన ఢిల్లీ హైకోర్టు.. భార్యను భర్త తన ఆస్తిగా చూడడం వల్ల వినాశకరమైన పరిణామాలు ఉంటాయని జస్టిస్ నీనా బన్సల్ కృష్ణ పేర్కొన్నారు. మహాభారతంలోని ద్రౌపది ఎపిసోడ్ ద్వారా మనకు ఈ విషయం స్పష్టంగా అర్థం అవుతుందన్నారు. దీన్ని ఆధారంగా చేసుకునే స్త్రీని ఆస్తిగా ఆస్తిగా పరిగణించే మహాభారత కాలం నాటి భావజాలానికి కాలం ముగిసిందని చెప్పారు.వివాహేతర సంబంధం నేరమంటూ ఐపీసీ 497వ సెక్షన్ ఇచ్చిన నిర్వచనం రాజ్యాంగ బద్ధం కాదని గతంలో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును జస్టిస్ నీనా బన్సల్ కృష్ణ గుర్తు చేశారు. ఈ సందర్భంగానే వివాహేతర సంబంధం నైతికతకు సంబంధించిన అంశం అని.. దాన్ని నేరంగా చూపకూడదని సుప్రీం కోర్టు వ్యాఖ్యానించడాన్ని ఉటంకించారు. మహిళ భర్త చేసిన ఫిర్యాదు కేసును రద్దు చేశారు. దీంతో సదరు మహిళ భర్త తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తానుండగానే ప్రియుడితో వివాహేతర సంబంధం సాగిస్తున్న భార్య, ఆమె ప్రియుడిపై చర్యలు తీసుకునే అవకాశం లేకపోవడం దారుణం అన్నారు.

## ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్



**న్యూఢిల్లీ-నవభూమి:** ప్రస్తుతం ఎవరి నోట విన్నా ఇదే మాట. ఇప్పుడు ఇది సర్వాంతర్యామి అయిపో యింది. ఏఐ ద్వారా వింతలు వినోదాలు సృష్టిస్తున్నారు. 20 ఏళ్ల వయసు వారిని 80 ఏళ్ల వృద్ధులుగా, క్రికెటర్లను పండ్లు అమ్ముకునే వాళ్లుగా, బిలియనీర్లను మురికివాడల్లో నివసించేవాళ్లుగా.. ఇలా ఉన్నది లేనట్టు లేనిది ఉన్నట్టుగా సృష్టించిన సోషల్ మీడియాలో వైరల్ చేస్తున్నారు. అలాంటి వీడియోనే ఇప్పుడు మరొకటి వెలుగులోకి వచ్చింది.ఎప్పుడూ సీరియస్ లుక్స్, సంచలన నిర్ణయాలతో ప్రపంచ దేశాలకు వణుకుపుట్టించే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ .. భారత్‌లో రైతుగా మారితే ఎలా ఉంటుందో ఊహించుకోండి. ఆ ఊహకు రూపమిచ్చాడు ఓ నెటిజన్. ట్రంప్ పొలం గట్ల వెంబడి సైకిల్‌పై గడ్డిని మోస్తూ, ఆవులను తీసుకెళు న్నట్లు ఏఐ సాంకేతికతతో వీడియోని రూపొందించారు. అంతేకాదు.. గ్రామంలోని చెట్టుకింద స్నేహితులతో ముచ్చటిస్తున్నట్లు, దుకాణంలో చిన్నారులకు దీపావళి టపాసులు కొనిచ్చి సంప్రదాయ దుస్తుల్లో దివాళి వేడుకల్లో పాల్గొన్నట్లు ఈ వీడియో రూపొందించారు.

## విద్యార్థులతో మద్యం తాగించిన ఉపాధ్యాయుడు.. వీడియో చూసిన కలెక్టర్ ఎలాంటి యాక్షన్ తీసుకున్నారంటే?



**న్యూఢిల్లీ-నవభూమి:** విద్యాబుద్ధులతో పిల్లలు ఎలా ఉండాలి, ఏం చేస్తే జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవచ్చో చెప్పాల్సిన ఉపాధ్యాయుడి స్థానంలో ఉన్న ఓ వ్యక్తే దారి తప్పాడు. నిత్యం బడికి ఫుల్లుగా మద్యం సేవించి వస్తూ రచ్చ చేయడమే కాకుండా.. తన తరగతి గదిలోని విద్యార్థుల చేత కూడా మద్యం తాగించాడు. తన వెంట తెచ్చుకున్న ఓ బాటిల్లోంచి కొన్ని గ్లాసుల్లో మద్యం పోసి మరీ పిల్లలకు అందివ్వగా.. వారు హాయిగా తాగేశారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియో నెట్టింట తెగ వైరల్ అవుతుండగా.. పెద్ద ఎత్తున ఆగ్రహావేశాలు వ్యక్తం అవుతున్నాయి. ముఖ్యంగా ఈ వీడియో కలెక్టర్ కంట కూడా పడింది. మరి ఆయన ఎలాంటి చర్యలు తీసుకున్నారో మనం ఇప్పుడు తెలుసుకుందాం పదండి.మధ్య ప్రదేశ్‌లోని కర్నీ జిల్లా బార్వారా బ్లాక్‌లోని ఖిర్హానీ గ్రామానికి చెంది న ప్రభుత్వ పాఠశాలలో.. లాల్ నవీన్ ప్రతాప్ సింగ్ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నారు. అయితే శుక్రవారం రోజు విధుల నిమిత్తం బడికి వచ్చిన ఆయన.. కొందరు విద్యార్థులకు మద్యం తాగించాడు. ముఖ్యంగా తరగతి గదిలోనే కింద కూర్చుని.. తన వెంట తెచ్చుకున్న బాటిల్ తీసి పిల్లలను నీళ్లు తీసుకు రమ్మని చెప్పాడు. వారంతా ఓ మగ్గులో నీళ్లు తీసుకు రాగా.. చిన్న చిన్న టీ గ్లాసులు తీసి అందులో మద్యం పోశాడు. ఆపై వాటిలో కాస్త నీళ్లు కలిపి.. ఐదారుగురు విద్యార్థులకు అందించాడు. తాగమని చెప్పాడు.


ఉపాధ్యాయుడు చెప్పడంతో.. విద్యార్థులు కూడా మద్యం సేవించారు. అయితే అక్కడే ఉండే ఎవరో దీన్ని వీడియోగా తీసి సోషల్ మీడియాలో పెట్టారు. ఇలా ఈ వీడియో కాస్తా నెట్టింట వైరల్ అయింది. ముఖ్యంగా మద్యం సేవించిన విద్యార్థుల తల్లిదండ్రులతో పాటు గ్రామస్థులందరి కంట పడింది. దీంతో వారంతా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బడికి వెళ్లి మరీ సదరు ఉపాధ్యాయుడిని నిలదీశారు. చదువు నేర్చుకునేందుకు వచ్చిన వారికి మద్యం సేవించడం నేర్పిస్తారా అంటూ ఇష్టం వచ్చినట్లుగా తిట్టారు. మరోవైపు ఈ వీడియోను జిల్లా కెలక్టర్ దిలీప్ కుమార్ యాదవ్ కూడా చూశారు.దీంతో ఆయన కూడా రంగంలోకి దిగారు. ఇది నిజమేనా కాదా అని తెలుసుకునేందుకు గ్రామానికి చేరుకున్నారు. దీంతో గ్రామస్థులంతా వచ్చి నిజంగానే ఆయన మద్యం తాగించారని, ఎప్పుడూ మద్యం సేవించే ఆయన బడికి వస్తారని చెప్పారు. ఆయన పద్ధతి చాలా రోజులుగా బాగాలేదని, కానీ ఉపాధ్యాయ వృత్తిలో ఉండడంతో తామేమీ అనలేకపోయామని చెప్పుకొచ్చారు. దీంతో తీవ్ర ఆగ్రహానికి గురైన కలెక్టర్.. ఉపాధ్యాయుడు లాల్ నవీన్ ప్రతాప్ సింగ్‌పై చర్యలు తీసుకోవాలంటూ జిల్లా విద్యాశాఖాధికారి ఓపీ సింగ్‌ను ఆదేశించారు. దీంతో ఆయన ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేశారు.

## భర్త టీలో ఎలుకల మందు కలిపి, ప్రియుడితో కలిసి హత్య.. ఆత్మహత్యగా చిత్రీకరించేందుకు యత్నం

**లక్నో-నవభూమి:** ఒక మహిళ టీలో ఎలుకల మందు కలిపి భర్తకు ఇచ్చింది. ఆ తర్వాత ప్రియుడితో కలిసి అతడి గొంతునొక్కి హత్య చేసింది. మృతదేహాన్ని సీలింగ్‌కు వేలాడదీసి ఆత్మహత్య చేసుకున్నట్లుగా నమ్మించేందుకు ప్రయత్నించింది. పోస్ట్‌మార్టం రిపోర్ట్‌లో అసలు విషయం తెలియడంతో మహిళ, ఆమె ప్రియుడ్ని పోలీసులు అరెస్ట్ చేశారు. ఉత్తరప్రదేశ్‌లోని బరేలీ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. ఫతేగంజ్‌లో నివసిస్తున్న కేహర్ సింగ్ కాంట్రాక్ట్ పారిశుద్ధ్య కార్మికుడిగా పనిచేస్తున్నాడు. 25 ఏళ్ల రేఖతో 16 ఏళ్ల కిందట అతడికి వివాహం జరిగింది. వారికి నలుగురు పిల్లలున్నారు.కాగా, రేఖకు పింటూ అనే వ్యక్తితో వివాహేతర సంబంధం ఏర్పడింది. కేహర్ సింగ్‌కు ఇది తెలియడంతో ఏడాదిగా భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
4 హైదరాబాద్
ఆదివారం
20 । ఏప్రిల్ । 2025





## పెళ్లికి ముందు.. రైలు ముందు దూకి వరుడు ఆత్మహత్య

**లక్నో-నవభూమి:** కొన్ని గంటల్లో పెళ్లి జరుగాల్సి ఉంది. ఊరేగింపుగా వెళ్తున్న వరుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రైలు ముందు దూకి మరణించాడు. దీంతో పెళ్లికొడుకు ఇంట్లో విషాదం నెలకొన్నది. ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఉత్తరప్రదేశ్‌లోని అమేథీ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. రాయ్‌బరేలీ జిల్లా సలోన్‌కు చెందిన 30 ఏళ్ల రవికి శుక్రవారం రాత్రి అజంగఢ్‌లో పెళ్లి జరుగాల్సి ఉన్నది. దీంతో తన కుటుంబ సభ్యులు, బంధువులతో కలిసి ఊరేగింపుగా పెళ్లి జరిగే ప్రాంతానికి



బయలుదేరాడు. కాగా, మార్గమధ్యలో గౌరీగంజ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బని రైల్వే స్టేషన్ సమీపంలో వరుడు రవి గూడ్స్ రైలు ముందు దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సమాచారం తెలుసుకున్న రైల్వే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. వరుడు మృతదేహాన్ని పోస్ట్‌మార్టం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాడు. పెళ్లి ఇష్టం లేక అతడు ఆత్మహత్య చేసుకున్నాడా? లేక ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా? అన్నది పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## ఆదివాసీల ఆత్మబంధువుకు ఓ నూలుపోగు

ఏడు పదుల జీవితం. 50 సంవత్సరాల రాజకీయ జీవితం. అయితేనేం ఉండేందుకు ఇల్లు లేని సగటు మనిషి ఆయన. తన- ప్రజలున్న ఇల్లెందే ఆయన ఇల్లు. ఐదుసార్లు అసెంబ్లీ సభ్యత్వం, అవినీతి మకిలీ అంటని అరుదైన వ్యక్తిత్వం... వెరసి ఆయన పేరు గుమ్మడి నరసయ్య.

70 సంవత్సరాల క్రితం ఖమ్మం జిల్లా ఇల్లెందు తాలూకా టేకులగూడెంలోని పేద ఆదివాసీ (కోయ) కుటుంబంలో చుక్కమ్మ-లక్ష్మయ్య దంపతులకు నరసయ్య జన్మించారు. ఐదవ తరగతిలోనే ఆయన చదువు ఆగిపోయింది. తర్వాత తల్లిదండ్రుల వెంట కొంతకాలం వ్యవసాయం చేసిన ఆయన 1973లో వామపక్ష రాజకీయాల్లోకి వచ్చారు. ఆదివాసీల సమస్యలపై పోరాడుతున్న సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ పట్ల ప్రభావితులై, ఆ పార్టీ కార్యకలాపాలలో చురుకుగా పాల్గొన్నారు. ఆదివాసీల హక్కులు, పంటలకు గిట్టుబాటు ధరలు, తునికాకు రేట్లు, కూలి రేట్లు, జీతగాండ్ల జీతాలు పెంపుదలకై పోరాడి, సాధించారు. అటవీ భూములను సాగు చేయడానికి ప్రజలందరినీ సమాయత్తం చేసి ముందుకు కదిలారు. రైతు సమస్యలపై పోరాటాలు చేశారు.

1981లో జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికలలో ఉసిరికాయలపల్లి నుంచి గుమ్మడి నరసయ్య సర్పంచ్‌గా విజయం సాధించారు. 1983లో జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ పార్టీ తరపున ఇల్లెందు నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి గెలిచారు. 1985 ఆగస్టు సంక్షోభం తర్వాత, 1989లో జరిగిన ఎన్నికలలో గెలిచి, హ్యాట్రిక్ విజయాన్ని సాధించారు. సైకిల్ పైనే తిరుగుతూ ఆయన ప్రజలను ఓట్లు అడుగుతారు. సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ ఎన్నికల సంఘం గుర్తింపు ఉన్న పార్టీ కాదు. కనుక ఆయన ప్రతిసారి స్వతంత్ర అభ్యర్థిగానే ఎన్నికల బరిలో దిగేవారు. అంటే ప్రతిసారి ఆయన ఎన్నికల గుర్తు మారుతూ ఉండేది. గుమ్మడి నరసయ్య ప్రజలకు అభ్యర్థిగా కంటే ఆదివాసీగా గుర్తుంటాడు. అందుకే ఆయన ప్రతిసారి గెలుస్తూనే ఉంటాడు.

ఖమ్మం జిల్లాలో ఇల్లెందు మొదటి నుంచి కమ్యూనిస్టు పార్టీలకు గట్టి పట్టున్న ప్రాంతం. సమస్యల పరిష్కారంతో ప్రజలకు చేరువై సీపీఐ, సీపీఎంల ఆధిపత్యానికి సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ పార్టీ గండి కొట్టింది. దాని ఫలితమే గుమ్మడి నరసయ్య వరుస విజయాలు. 1994 అసెంబ్లీ ఎన్నికలలో కొద్దిపాటి తేడాతో సీపీఐ అభ్యర్థి ఊకే అబ్బయ్య చేతిలో ఓడిపోయిన నరసయ్య, తిరిగి 1999 ఎన్నికలలో కాంగ్రెస్ అభ్యర్థిపై గెలుపొందారు. ఆ తర్వాత 2004లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థిపై గెలుపొంది, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ చరిత్రలో ఐదుసార్లు అసెంబ్లీకి ఎన్నికైన రికార్డును సొంతం చేసుకున్నారు.

గడచిన 50 ఏళ్లలో తెలంగాణను ప్రభావితం చేసిన కాంగ్రెస్, ఉభయ కమ్యూనిస్టు పార్టీలు, తెలుగుదేశం, తెలంగాణ రాష్ట్ర సమితి ఇలా ఎన్ని రాజకీయ పార్టీలు వచ్చినా గుమ్మడి నరసయ్య ఇల్లెందులో ఒక ఆదివాసీ నాయకుడుగా, ప్రజానాయకుడిగా, ప్రజల మనిషిగా నిలదొక్కుకున్నారు. అందుకు కారణం నీతి%-%నిజాయితీలతో అవినీతికి అందనంత దూరంలో ఆయన నడుచుకోవడమే. అయితే 2009 నుంచి ఆయనకు ఎన్నికల రాజకీయాల్లో ఎదురుదెబ్బలు మొదలయ్యాయి. ఇందుకు వ్యాపార రాజకీయాల పార్టీల కుట్రలే కారణం అంటారాయన. వరుస గెలుపులతో సాగిపోతున్న గుమ్మడి నరసయ్యను నిలువరించడానికి బూర్జువా రాజకీయ పార్టీలు ఇల్లెందు నియోజకవర్గాన్ని మూడు ముక్కలు చేసి కుట్ర పన్నారంటారు. ఇల్లెందులోని సీపీఐ(ఎంఎల్) పార్టీకి పట్టున్న రెండు మండలాలను వైరా, పినపాక నియోజకవర్గాలకు మార్చి ఆ పార్టీని బలహీనపరిచారు. ఇందుకు బూర్జువా పార్టీలతో ఉభయ కమ్యూనిస్టు పార్టీలు కూడా చేతులు కలిపాయి. దీంతో గుమ్మడి నరసయ్య 2009, 2014, 2018 ఎన్నికలలో వరుసగా ఓటమిని చవిచూశారు. అయితే ఆయన ప్రజా జీవితానికి మాత్రం దూరం కాలేదు. ప్రజా వ్యతిరేక కార్యక్రమాలకు ఏడు పదుల వయసులో కూడా ఎదురునిలిచి పోరాటాలు చేస్తున్నారు. సింగరేణి బొగ్గు గనుల భూ నిర్వాసితుల కోసం, ఆదివాసీల హక్కుల కోసం, తెందు ఆకు సేకరించే వారికి మద్దతుగా ఆయన చేసిన కృషి ఎనలేనిది. ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో కూడా ఆయన తనదైన పాత్ర పోషించారు. నిరంతరం ఇల్లెందు ప్రజల గొంతుకగా నిస్వార్థ సేవ చేస్తూ గుమ్మడి నరసయ్య విస్తృతమైన ఖ్యాతి పొందారు. హైదరాబాద్ మహానగరంలో ఎమ్మెల్యే కోటా కింద తనకు ప్రభుత్వం మంజూరు చేసిన ఇంటి స్థలాన్ని పార్టీ కార్యాలయ నిర్మాణం కోసం విరాళంగా ఇచ్చారు. తన కోసం నివసించడానికి నీడైనా లేకుండా అతి సాధారణంగా జీవిస్తున్నారు గుమ్మడి నరసయ్య. గుమ్మడి నరసయ్య జీవితంపై పరమేశ్వర్ హివ్రాలే అనే దర్శకుడు బయోపిక్‌ను రూపొందిస్తున్నారు. ఆదివాసీల ఆత్మబంధువు, నిరంతరం ప్రజల కోసం తన జీవితాన్ని అంకితం చేసిన నిరాడంబరుడు నరసయ్య. వర్తమాన కాలంలో ఆదర్శాలను ఆచరణలో చూపిన నిక్కమైన మనిషి. సమకాలీన రాజకీయ నాయకులకే కాదు రేపటి తరాలకు కూడా ఆయన ఆదర్శప్రాయుడు.

# పశ్చిమబెంగాల్లో ఆర్ఎస్ఎస్- భాజపా కుట్రలు



వచ్చే ఏడాది జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో పశ్చిమ బెంగాల్‌లో అధికారాన్ని చేజిక్కించుకోవాలని ఫాసిస్ట్ ఆర్ఎస్ఎస్, బిజెపి ఇప్పటికే కుట్రలు పన్నుతున్నాయి. వారు 'హిందూ- హిందూ భాయి భాయి', 'అన్ని హిందూ ఓట్లు బిజెపికే' వంటి నినాదాలు చేస్తున్నారు. వారు హిందూ-ముస్లిం విభజనను(ధ్రువణతను) కోరుకుంటున్నారు. ఈ ప్రయోజనం కోసం, వారు ఇప్పుడు రాష్ట్రంలో అల్లర్లు సృష్టించడానికి ప్రయత్నిస్తున్నారు. శ్రీరామనవమి రోజున అశాంతి సృష్టించడానికి వారు సిద్ధమయ్యారు. కానీ వారు ఆ పని చేయలేకపోయారు. అప్పుడు వారికి వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా నిరసనను ఉపయోగించుకునే అవకాశం లభించింది. వక్ఫ్ (సవరణ) చట్టం కేంద్రంలోని ఫాసిస్ట్ బిజెపి ప్రభుత్వం చేసిన దారుణమైన కుట్ర. వక్ఫ్ ఆస్తిని సాధారణ ముస్లింలకు ఉపయోగించాలనే గొప్ప లక్ష్యంతో తాము ఈ బిల్లును తీసుకువచ్చామని వారు చెబుతున్నారు. ప్రభుత్వ సంస్థలు మరియు వివిధ కాషాయ గూండాల సంస్థలచే రోజువారీ దాడులకు గురవుతున్న ముస్లింల సంక్షేమం కోసం వక్ఫ్ బిల్లును తీసుకువచ్చారని పిల్లలు కూడా నమ్మరు. ముస్లింల ఇళ్ళు ఎటువంటి కారణం లేకుండా లేదా చిన్న కారణంతో కూల్చివేయబడుతున్నాయి. ముస్లింలను వారిచే కొట్టి చంపబడుతున్నారు, వారిని పాకిస్తాన్‌కు వెళ్లమని చెబుతున్నారు. దృశ్య కాలుష్యం ఆరోపణలపై వారి ప్రార్థనా స్థలాలను వస్త్రంలో చుట్టి "జై శ్రీరామ్" అని నినాదాలు చేస్తున్నారు. సహజంగానే, ఈ



అప్రజాస్వామిక వక్ఫ్ బిల్లును, ప్రస్తుత వక్ఫ్ (సవరణ) చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేయబడింది! వక్ఫ్ చట్టం రాజ్యాంగ విరుద్ధమని మరియు ముస్లిం వ్యతిరేకమని సిపిఐ( ఎం.ఎల్) రెడ్ స్టార్ కేంద్ర కమిటీ ఇప్పటికే ఒక వైఖరిని తీసుకుంది.

ఏప్రిల్ 8 నుండి పశ్చిమ బెంగాల్‌లో వక్ఫ్ చట్టానికి వ్యతిరేకంగా కొన్ని శాంతియుత నిరసనలు ప్రారంభమయ్యాయి. కానీ ముర్షిదాబాద్ జిల్లాలోని కొన్ని ప్రదేశాలలో, భాజపా నిరసనకారులలో తన సొంత ప్రజలను నింపి నిరసనలను గందరగోళంగా మార్చింది. వక్ఫ్ చట్టంపై పశ్చిమ బెంగాల్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా మిలిటెంట్ ఉద్యమం జరగడానికి ఎటువంటి కారణం లేదని ఇంగితజ్ఞానం మనకు చెబుతుంది. పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం ఈ చట్టాన్ని రూపొందించలేదు. బదులుగా ఈ చట్టాన్ని పశ్చిమ బెంగాల్‌లో కూడా అమలు చేయబోమని ముఖ్యమంత్రి స్పష్టంగా ప్రకటించారు. ఈ విషయంలో, కర్ణాటక, జార?ండ్, తమిళనాడు మరియు పశ్చిమ బెంగాల్‌తో సహా భారతదేశంలోని అనేక రాష్ట్రాలు ఈ చట్టాన్ని ఆయా రాష్ట్రాల్లో అమలు చేయబోమని ప్రకటించాయి. అయితే, ఇది ఉన్నప్పటికీ, ఉగ్రవాద ఉద్యమం ఎందుకు? దీని వెనుక ఎవరున్నారు? దీని వెనుక బిజెపి మరియు ఆర్ఎస్ఎస్ యొక్క నిర్దిష్ట ప్రణాళిక మరియు కుట్ర ఉందని స్పష్టంగా తెలుస్తుంది. రాష్ట్రంలోని తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వం పనికిరానిది. వారు ఈ కుట్రను ఆపడంలో విఫలమయ్యారు. వాస్తవానికి, బిజెపి మరియు ఆర్ఎస్ఎస్‌కు చెందిన చాలా మంది రహస్య కుట్రదారులు తృణమూల్ పార్టీలోనే నిశ్శబ్దంగా పనిచేస్తున్నారు. వాస్తవానికి, ఆర్ఎస్ఎస్ యొక్క ఈ రహస్య వర్గీకరణ పని ప్రస్తుతం అతివాద లేదా మితవాదంతో సంబంధం లేకుండా అన్ని ప్రధాన స్రవంతి పార్టీలలో చాలా బలంగా ఉంది. ఫలితంగా, వారు తమ కుట్రలను సులభంగా విజయవంతం చేసుకోగలుగుతున్నారు. అలాగే, ఉపాధ్యాయ నియామక అవినీతిపై కలత చెందిన తృణమూల్ కాంగ్రెస్, వక్ఫ్ గురించి కొంత గందరగోళం ఉంటే, ప్రస్తుతానికి ప్రజల దృష్టిని మళ్లించడానికి ఇది ఒక అవకాశంగా ఉంటుందని భావించి ఉండవచ్చు. ఫలితంగా, వారు మొదట్లో వక్ఫ్ గొడవ పెరగడానికి అనుమతించారు. కానీ పరిస్థితి వారి నియంత్రణకు మించిపోయింది. రాష్ట్రంలోని అన్ని శాఖలు కూడా ప్రస్తుతం ఫాసిస్టుల నియంత్రణలో ఉన్నాయి. బిజెపి నాయకుడు శువేందు అధికారి దరఖాస్తు ఆధారంగా, కోర్టు కేంద్ర బలగాలను వెంటనే పంపాలని ఆదేశించింది. కేంద్ర బలగాలలో అనుమానాస్పద వ్యక్తులు ఉండటం పరిస్థితిని మరింత క్లిష్టతరం చేసింది. ఆందోళనకారుల నుండి రాష్ట్ర సంస్థలు మరియు భద్రతా దళాల వరకు ప్రతిచోటా బిజెపి తన ప్రణాళికలను సులభంగా అమలు చేయగలదు. బాధితులు హిందువులు లేదా ముస్లింలతో సంబంధం లేకుండా సాధారణ శ్రామిక ప్రజలు. ఇప్పటికే ముగ్గురు మరణించారు. చాలా మంది నిరాశ్రయులయ్యారు. ఈ పరిస్థితికి కేంద్ర మరియు రాష్ట్ర పరిపాలనలు బాధ్యత వహించాలి. రాష్ట్రంలో శాంతిని వెంటనే పునరుద్ధరించాలి. ఈ పరిస్థితిలో, పరిస్థితిని ఎదుర్కోవడానికి రాష్ట్రంలోని ప్రజాస్వామ్య మరియు లౌకిక ప్రజలకు సిపిఐ(ఎం-ఎల్) రెడ్ స్టార్ పిలుపునిచ్చింది. మతంతో సంబంధం లేకుండా, బిజెపి కుట్ర మరియు రాష్ట్ర పరిపాలన యొక్క అసమర్థతకు వ్యతిరేకంగా తమ స్వరాలను వినిపించాలని మేము అన్ని శ్రామిక ప్రజలను పిలుస్తున్నాము.

**- శంకర్ సిపిఐ (ఎం.ఎల్) పొలిట్ బ్యూరో సభ్యుడుబీ మరియు పశ్చిమ బెంగాల్ ఆర్గనైజింగ్ కమిటీ కార్యదర్శి.**

# తెలుగు బొమ్మలో తెలంగాణ శోభ

'నా పల్లె నా కాన్వాసు, నా ప్రజలే నా వస్తువు, వాళ్ల జీవనమే నా ప్రేరణ, ఈ ప్రకృతే నాకు గురువు, నా సమాజాన్ని, సంస్కృతిని, దేశాన్ని, విశ్వయవనిక మీద ఆవిష్కరించడమే నా లక్ష్యం'- 1945లో హైదరాబాద్‌లో ఒక చిత్రకళా ప్రదర్శనలో...

తెలుగు బొమ్మలో తెలంగాణ శోభ

'నా పల్లె నా కాన్వాసు, నా ప్రజలే నా వస్తువు, వాళ్ల జీవనమే నా ప్రేరణ, ఈ ప్రకృతే నాకు గురువు, నా సమాజాన్ని, సంస్కృతిని, దేశాన్ని, విశ్వయవనిక మీద ఆవిష్కరించడమే నా లక్ష్యం'- 1945లో హైదరాబాద్‌లో ఒక చిత్రకళా ప్రదర్శనలో యువ రాజయ్య వ్యక్తం చేసిన మనోరథమది. ఆ మాటలను ఆయన తదనంతర జీవితమంతా నిజం చేసి చూపించారు. తెలంగాణ సంస్కృతి అన్నా, జీవనశైలి అన్నా, సంప్రదాయం అన్నా, బోనాలన్నా, బతుకమ్మ అన్నా ముందుగా గుర్తుకు వచ్చేది రాజయ్య జానపద చిత్ర రాజాలే.

జానపద చిత్రాలను సాధారణంగా పురాణాలు, ఇతిహాసాలతో చిత్రిస్తారు. రాజయ్య మాత్రం అందుకు పూర్తి భిన్నంగా తెలంగాణ తెలుగు సంస్కృతిని, కాన్వాస్‌పై ప్రాథమిక రంగుల్లో ఆవిష్కరించారు. స్వస్థలమైన సిద్దిపేట గ్రామీణులు, వారి వృత్తులు, ఉత్సవాలు, పండుగలకు సమకాలీనతను తన చిత్రాల్లో చూపించారు. తెలంగాణ సంస్కృతిని తన చిత్రాలతో విశ్వవ్యాప్తం చేశారు. రాజయ్య అంటే తెలంగాణ చిత్రం, తెలంగాణ అంటే రాజయ్య అనే విధంగా ఆయన సృజన వర్ధిల్లింది.

సిద్దిపేటలో ఒక నిరుపేద కుటుంబంలో 1925, ఏప్రిల్ 7న జన్మించిన రాజయ్య చిన్నతనంలో మట్టి ముద్దలతో బాతులు, ఎద్దులు వంటి బొమ్మలు చేసేవారు. పాఠశాలలో 7వ తరగతి చదివేటప్పుడు రాజయ్యను ఒక టీచర్ బాంబే ప్రభుత్వం నిర్వహించే ఇంటర్మీడియట్ డ్రాయింగ్ పరీక్షలకు పంపించారు. తర్వాత కుబేరుడు అనే డ్రాయింగ్ టీచర్ హైదరాబాద్‌లో ఉన్న సెంట్రల్ స్కూల్ అఫ్ ఆర్ట్, క్రాఫ్టలలో ఐదేళ్ల పెయింటింగ్ డిప్లొమాలో చేర్పించారు.

సంగారెడ్డి మిడిల్ పాఠశాలలో 1947లో రాజయ్య



డ్రాయింగ్ టీచర్‌గా ఉద్యోగ జీవితం ప్రారంభించారు. చిత్రకళ పట్ల ఆసక్తి చూపిన వారిని డ్రాయింగ్ పరీక్షలకు పంపి వారిని చిత్రకారులుగా, చిత్రకళోపాధ్యాయులుగా తీర్చిదిద్దారు. ఆయన చిత్రరచన ప్రధానంగా మూడు దశలుగా జరిగింది. ప్రారంభంలో చిత్రకళ నేర్చుకున్నప్పుడు అందరిలా కాగితాలపై వాష్ టెక్నిక్‌లో చిత్రాలు గీశారు. 1960 నుంచి టెంపరరీ రంగులు అలవాటు చేసుకున్నారు. 1970 నుంచి అంతర్జాతీయ మీడియం అయిన నూనె రంగులు వాడకం ప్రారంభించారు. రాజయ్య చిత్రరచన ఏ మీడియంలో కొనసాగినా తన సంస్కృతిని, మూలాల్ని మర్చిపోలేదు. పేపర్లు, రంగులు మార్చారు గాని భావం, చిత్రీకరణలను, తనదైన జానపదాన్ని వీడలేదు. అదేవిధంగా నీటి రంగుల నుంచి నూనె రంగులకు మారినా ప్రాథమిక రంగులే కొనసాగించారు. రంగుల శోభ, లావణ్యం, మృదుత్వం, సహజత్వం ఆయన ప్రత్యేకత. వెలుగు నీడలు ఆయన చిత్రాల్లో ఉండవు.


తెలంగాణ గ్రామీణ ప్రాంతాలలో విరివిగా సంచరించడం, పల్లె ప్రజల జీవనశైలిని సన్నిహితంగా పరిశీలించడం వల్ల రాజయ్య చిత్రాల్లో సహజత్వం కనబడుతుంది. ఆయన చిత్రాలు చూస్తే తెలంగాణ పల్లెలో ఉన్న అనుభూతి కలుగుతుంది. పెళ్ళి వేడుకలకు సంబంధించిన చిత్రాలు ఆయన సూక్ష్మ పరిశీలనకు నిలువెత్తు నిదర్శనం. 'నా చిత్రకళకు పట చిత్రకళే ప్రేరణ' అని ఆయన తరచు చెప్పేవారు.. రాజయ్య సృజించిన 'బోనాలు' ముఖచిత్రంగా ప్రతిష్ఠాత్మక బ్రిటిష్ మ్యాగజైన్ 'స్టూడియో లండన్' ఒకసారి వెలువడింది. ఆ సంచికలో ప్రముఖ చిత్రకళా విమర్శకులు ఎ.ఎస్. రామన్ రాజయ్య చిత్రకళ విశిష్టత గురించి ఒక విపుల వ్యాసం రాశారు. 'దేశ కాలాపేక్ష లేని, శాశ్వతమైన, సార్వజనీనమైన, లోకంలో ఏ శక్తి అంతరింప చేయలేని, నిత్య నూతన సౌందర్యం కోసం అన్వేషిస్తున్న రాజయ్యకు తన చుట్టూవున్న జానపద రూపాల్లోనూ, జాతీయాల్లోనూ అలాంటి శాశ్వత సౌందర్యం సాక్షాత్కరించింది' అని రామన్ ప్రశంసించారు.

రాజయ్య చిత్రించిన చిత్రాల్లో బతుకమ్మ, పంటపొలాలు, శ్రమజీవులు, రిస్కీలైఫ్, ముస్తాబు, నీలి భాగవతం, అంపశయ్యపై భీష్ముడు, జీవాత్మ పరమాత్మ వైపు తదితరాలు ఆయనకు అత్యంత ఇష్టమైనవిగా చెప్పుకున్నారు. వేంకటేశ్వర స్వామిపై ఆయన పాతికకు పైగా చిత్రాలు సృజించారు. రిస్కీలైఫ్ చిత్రానికి జాతీయ అవార్డు లభించింది. సిద్దిపేటలోనే ఆయన మూడున్నర దశాబ్దాల పాటు చిత్రకళోపాధ్యాయుడుగా పనిచేశారు. 1963లో లలితకళా సమితిని ఏర్పాటు చేసి రాష్ట్ర, జాతీయ స్థాయిలో చిత్రకళా పోటీలు, ప్రదర్శనలు నిర్వహించి, ఔత్సాహికుల్ని విరివిగా ప్రోత్సహించారు. 1956%-%88 సంవత్సరాల మధ్య హంగేరీ, బల్గేరియా, రొమేనియా, చెక్‌స్లోవేకియా, ఆస్ట్రేలియా, క్యూబా, మెక్సికో, రష్యా, ఇటలీ, బ్రిటన్ తదితర దేశాలలో నిర్వహించిన ఆయన చిత్రకళా ప్రదర్శనలు కళాభిమానులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

రాజయ్య సృజన జీవన వ్యాసంగాలు తెలంగాణాకు మాత్రమే పరిమితం కాలేదు. విశాఖ, అనకాపల్లి, రాజమండ్రి, విజయవాడ, వెల్లటూరు తదితర ప్రాంతాలలో జరిగే చిత్రకళా ప్రదర్శనలకు హాజరై యువ, బాల చిత్రకారులను ప్రోత్సహించేవారు. కేంద్ర లలితకళా అకాడమీ జనరల్ కౌన్సిల్ సభ్యులుగా రాజయ్య మా విశాఖ చిత్రకళా పరిషత్‌కు సహాయ సహకారాలు అందించారు. పరిషత్ పునరుద్ధరణకు, ఇంకా చిత్రకళా రత్నాలు, చిత్రకళా చరిత్ర, వడ్డాది పాపయ్య, దామెర్ల రామారావు తదితర గ్రంథాల ముద్రణకు, సింహాచలం, భీమిలి, కోణార్క్ తదితర ప్రాంతాలలో వర్కుషాపుల నిర్వహణకు లలితకళా అకాడమీ గ్రాంట్లు ఇప్పించడానికి సహకరించారు. 'కుంచెపదాలు' కవిగా ఆయన కవిలోకంలో కూడా ప్రసిద్ధులు. 2013లో 9వ తరగతి తెలుగు ఉపవాచకంలో స్ఫూర్తిదాతలు పేరిట ఆయన జీవిత చరిత్రను పాఠ్యాంశంగా ప్రవేశపెట్టారు. 1978లో ఆంధ్రప్రదేశ్ లలితకళా అకాడమీ వీరి కళాజీవితాన్ని మోనోగ్రాఫ్‌గా ప్రచురించింది.. సిద్దిపేట ప్రజలు 2019లో తమ ఊరికి గర్వకారణమైన రాజయ్య విగ్రహాన్ని ప్రతిష్ఠించి ఆయన పట్ల తమ గౌరవాదరాలు చాటుకున్నారు. రాజయ్య 2012, ఆగస్టు 20న తన 87వ ఏట మరణించారు. ఆయన కళాకృతులు జాతి ఆస్తులు. వాటిని సేకరించి భద్రపరచాలి.

# సారిపుత్రుని గురుభక్తి

భక్తి



గౌతమ బుద్ధుని శిష్యుల్లో సారిపుత్రుడు ముఖ్యుడు. అతను బుద్ధుడి సూచనలకు అనుగుణంగా జీవిస్తూ, సాధన చేస్తూ జ్ఞానోదయాన్ని పొందాడు. అది జరిగిన కొంతకాలానికి సారిపుత్రునితో బుద్ధుడు "సారిపుత్రా! ఇక నీవు ఇక్కడే ఉండాల్సిన అవసరం లేదు. వెళ్ళు, గ్రామగ్రామానికి తిరుగు. ధర్మాన్ని బోధించు. ఇక్కడ నీకు బదులు మరొకరికి స్థానం కల్పించు" అని చెప్పాడు. ఆ మాటలు వినగానే సారిపుత్రుని కళ్ళలో నీళ్ళు ఉప్పొంగాయి. బుద్ధుని పాదాలను పట్టుకొని "అలా అనకండి, నన్ను మీకు దూరంగా పంపకండి. మీతోనే ఉండనివ్వండి. నేను ఇంకా తెలుసుకోవాల్సింది ఎంతో ఉంది. మీలా నేను పూర్ణ జ్ఞానిని కాలేదు" అని విలపించాడు. అప్పుడు బుద్ధుడు ..నన్ను నీవు మోసగించలేవు సారిపుత్రా! ఇటువంటివి నా దగ్గర చెల్లవు. నీవు పొందవలసినదంతా పొందావు. నీకు జ్ఞానోదయం అయింది. అయినా ఇలా దుఃఖించడం సిగ్గుచేటు. నీవు విలపించినా, గుండెలు బాదుకున్నా ప్రయోజనం లేదు. నీవు వెళ్ళవలసిందే. ఇతరులను ఉద్ధరించవలసిందే. ఇలా నన్నే అంటిపెట్టుకొని ఎంతకాలం ఉండదలిచావు? అది కుదరదు. వెంటనే బయలుదేరు" అన్నాడు.

ఇక తప్పదని తెలిసిన సారిపుత్రుడి హృదయం బరువెక్కింది. బుద్ధుడికి నమస్కరించాడు. కళ్ళు ఆర్పకుండా, తనివితీరా బుద్ధుని రూపాన్ని సందర్శించాడు. ఆయన ఆశీస్సులను తీసుకొని అక్కడి నుంచి వెళ్ళిపోయాడు.


ఆ తరువాత సారిపుత్రుడు తను ఎక్కడ ఉన్నప్పటికీ... ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం బుద్ధుడు ఉండే దిశకు తిరిగి, తలవంచి నమస్కరించేవాడు. కృతజ్ఞతాపూర్వకంగా కన్నీరు కార్చేవాడు. ఇది చూసిన అతని శిష్యులు ..గురువుగారూ! మీరు కూడా జ్ఞాని అయ్యారు కదా! దాన్ని సాక్షాత్తూ గౌతమ బుద్ధుడే ధ్రువీకరించారు కదా! అయినా మీరు ఆయనకు నమస్కరించాలా?" అని ప్రశ్నించారు.

"నేను ఈ రోజు ఇలా ఉండడానికి కారణం ఆ దయామయుడి అనంతమైన ప్రేమే. నా శరీరంలోని ప్రతి అణువు ఆయనపట్ల కృతజ్ఞతతో నిండిపోయింది. ఆయన కాశీలో ఉన్నా, గయలో ఉన్నా... నా శరీరం తనకుతానుగా, దానంతట అదే బుద్ధుడు ఉన్న దిశకు తిరుగుతుంది. ఉదయం, సాయంత్రం ఆయనకు నమస్కరిస్తుంది" అని చెప్పాడు.

ఒక వ్యక్తితో పని ఉన్నంతకాలం నమస్కారాలు పెట్టి... ఆ పని అయిపోగానే అతణ్ణి మరచిపోవడం సామాన్యుల లక్షణం. సహాయం చేసినవారి పట్ల కృతజ్ఞతాభావం కలిగి ఉండడం సజ్జనుల లక్షణం. జ్ఞానామృతాన్ని పంచిన గురువు పట్ల ఎలా స్పందించాలి? 'గురుర్బ్రహ్మ...' అంటూ శ్లోకాలు చెబితే సరిపోదు... సారిపుత్రునిలా కజ్ఞతజ్ఞతా భావంతో మనసా వాచా, కర్మణా జీవితాన్ని గురువుకే అంకితం చేయాలి.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
9
హైదరాబాద్
ఆదివారం
20 ఏప్రిల్ 2025

## ఎండల్లో చూడచక్కగా...




ఎండ వేడి, ఉక్కపోత పెరుగుతున్నాయి. కాబట్టి పాత మేకప్ సాధనాలకు స్వస్తి చెప్పి, వేసవికి తగిన వాటిని ఎంచుకోవాలి.అందుకోసం...ప్రైమర్: గాల్లోని తేమ వల్ల చర్మరంధ్రాలు అవసరానికి మించి పనిచేస్తూ స్వేదాన్నీ, చర్మపు సహజనూనె...సీబమ్‌నూ స్రవిస్తూ ఉంటాయి. దాంతో వేసవి మేకప్‌తో ముఖం జిడ్డుగా మారిపోతుంది. ఇలా జరగకుండా ఉండాలంటే, ముఖానికి ప్రైమర్ పూసుకోవాలి. మరీ ముఖ్యంగా ముక్కు, నుదురు, చుబుకాలకు ప్రైమర్ అప్లై చేసుకోవాలి.

పౌడర్: మేకప్ చెక్కుచెదరకుండా ఉండాలంటే చివర్లో పౌడర్‌తో సెట్ చేసుకోవాలి. ఫౌండేషన్ లేదా కన్‌సీలర్ పూసుకున్న తర్వాత, ముఖం మీద ముడతలు పడే వీలున్న ప్రదేశాల్లో తప్పనిసరిగా లూజ్ పౌడర్ ఉపయోగించాలి. బేకింగ్ అనే ఈ ప్రక్రియ వల్ల బేస్ మేకప్ ముఖానికి అంటుకుపోయి, ఎక్కువ కాలం చెదిరిపోకుండా నిలుస్తుంది.ఫౌండేషన్: వేడికి మేకప్ కరిగిపోకుండా ఉండాలంటే, తేలికపాటి ఫౌండేషన్‌ను ఎంచుకోవాలి. ఫేస్ టింట్ కూడా వాడుకోవచ్చు. లైట్‌వెయిట్ ఆకృతి కలిగి ఉండే ఫౌండేషన్ ఎంచుకున్నా, ఫేస్ టింట్‌ను ఎంచుకున్నా వీలైనంత పరిమితంగానే వాడుకోవాలి.

మస్కారా: ఈ కాలంలో వాటర్‌ప్రూఫ్ మస్కారా వాడుకోవాలి. అలాగే కనురెప్పల కోసం సింగిల్ మెటాలిక్ ఐషాడోలనే ఎంచుకోవాలి. ఎండలో, ఉక్కపోతలో ఎక్కువ సమయం గడపవలసిన సందర్భాల్లో కారిపోకుండా ఉండే వాటర్‌ప్రూఫ్ ఉత్పత్తులనే ఎంచుకోవాలి.

# నైట్‌షిఫ్ట్.. టెర్రర్!



కార్పొరేట్ ప్రపంచంలో నైట్‌షిఫ్ట్ కామన్ అయిపోయింది. రాత్రంతా విధులు నిర్వహించడం వల్ల ఉద్యోగుల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం పడుతున్నది. నిద్రలేమితోపాటు మానసిక ఒత్తిడి కూడా పెరుగుతున్నది. ఇక వారంవారం షిఫ్ట్‌లు మారడం వల్ల.. శరీరం అనేక మార్పులకు లోనవుతున్నది. ఇలాగే కొనసాగితే.. దీర్ఘకాలంలో తీవ్రమైన ఆరోగ్య సమస్యలు చుట్టుముట్టే అవకాశం ఉన్నది.

నైట్ షిఫ్ట్‌లలో ఉండే ప్రధాన సమస్య.. నిద్రలేమి. పగటిపూట ఎంతసేపు పడుకున్నా రాత్రినిద్రకు సాటిరాదు. నిద్రలేమితో బీపీ, షుగర్, గుండెపోటు, బ్రెయిన్ స్ట్రోక్ లాంటి ఆరోగ్య సమస్యలు వచ్చే ప్రమాదం ఉన్నదని పలు అధ్యయనాలు హెచ్చరిస్తున్నాయి. ఇక స్లీప్ అప్నియాతో శరీరంలో ఆక్సిజన్ స్థాయులు తగ్గుతాయి కూడా!

రాత్రిపూట విధులు నిర్వహించే క్రమంలో భోజన సమయం క్రమం తప్పుతుంది. దాంతో జీర్ణవ్యవస్థ ఆరోగ్యంపై ప్రభావం పడుతుంది. నైట్‌షిఫ్ట్‌ల్లో ఉండేవారు జంక్ ఫుడ్‌కు అలవాటు పడతారు. రెగ్యులర్‌గా తింటే.. ఊబకాయం, ఇతర ఆరోగ్య సమస్యలూ పలకరిస్తాయి.

రాత్రి షిఫ్ట్‌లు చేసే మహిళల్లో నెలసరి సమస్యలు, ఎండోమెట్రియోసిస్ వంటి సమస్యలు ఎక్కువగా ఉంటాయని ఇటీవలి అధ్యయనాలు చెబుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా 10% మంది మహిళలు ఇలాంటి సమస్యతో బాధపడుతున్నారట. జీవక్రియలో మార్పులు వచ్చి.. హార్మోన్ల అసమతౌల్యతకు దారితీస్తుంది.

నైట్‌షిఫ్ట్‌ల వల్ల సూర్యోదయంతోపాటు పగటిపూట వెలుగుకీ దూరంగా ఉండాల్సి వస్తుంది. దీనివల్ల శరీరానికి సహజంగా అందాల్సిన విటమిన్ డి అందకుండా పోతుంది. ఫలితంగా, మరిన్ని అనారోగ్య సమస్యలు చుట్టుముట్టే అవకాశం ఉన్నది.

**జాగ్రత్తలు**

నైట్ డ్యూటీలతో శరీరం నిస్తేజంగా మారుతుంది. కాబట్టి, రోజంతా ఉత్సాహంగా ఉండాలంటే.. వ్యాయామం, సూర్య నమస్కారాలు చేయడం మంచిది. ధ్యానం, యోగా వల్ల ఒత్తిడి కూడా తగ్గుతుంది.

నిద్ర రాకుండా ఉండేందుకు చాలామంది కాఫీలు, టీలు లాగించేస్తుంటారు. దీనివల్ల అసిడిటీ, వికారం, చిరాకు కలుగుతాయి. కాఫీ, టీలకు బదులుగా.. మజ్జిగ, షర్బత్ వంటివి తాగడం అలవాటు చేసుకోవాలి.

రాత్రిపూట విధులు నిర్వహించేవారు మితాహారం తీసుకోవడం మంచిది. కూల్‌డ్రింక్స్, జంక్‌ఫుడ్‌కు దూరంగా ఉండాలి.

# పాత వాటికి కొత్త కళ



ఎప్పటికీ కొత్త కొత్త ఫ్యాషన్ పోకడలు పుట్టుకొస్తూనే ఉంటాయి. దాంతో పాత దుస్తులను బీరువాలకే పరిమితం చేసేస్తూ ఉంటాం. కానీ పాతబడిపోయిన పట్టు చీరలు, కుర్తాలకు కొత్త రూపాన్ని ఎందుకు ఇవ్వకూడదు? అని ప్రశ్నిస్తోంది బాలీవుడ్ తార, రచయిత్రి, ఇంటీరియర్ డెకార్ ఔత్సాహికవేత్త, ట్వింకిల్ ఖన్నా! పాత వస్త్రాలకు కొత్త హంగులు జోడిస్తూ, వాటికి ఇంటి అలంకరణలో చోటు కల్పిస్తున్న ట్వింకిల్ ఇంకా ఏమంటోందో తెలుసుకుందాం!

'ఇంటికి పండుగ శోభ తీసుకురావడం కోసం అలంకరణ వస్తువుల మీద డబ్బును వృథా చేయవలసిన అవసరం ఏమాత్రం లేదు. దుకాణంలో కొనే ఖరీదైన అలంకరణ వస్తువులకు బదులుగా, ఇంట్లో ఉపయోగించకుండా భద్రపరిచిన వస్త్రాలను పునర్వినియోగించుకునే మార్గాల మీద దృష్టి పెట్టండి. పాత చీరలు, కుర్తాలు, దుపట్టాలతో ఒక గ్యాలరీని రూపొందించుకోండి. మన ఇంట్లో గోడలకు పెయింటింగ్‌లు, ఫొటోలను వేలాడదీస్తూ ఉంటాం. ఆకట్టుకునే వాల్ హ్యాంగింగ్స్‌ను తగిలిస్తూ ఉంటాం. ఇవన్నీ అందరి ఇళ్లలో ఉండేవే! కానీ వినూత్నంగా కనిపించడం కోసం కొంత సృజనాత్మకంగా ఆలోచించాలి.

**పాత జ్ఞాపకాలు పదిలంగా...**

మన పెళ్లి నాటి పట్టుచీరలు, బహుమతులుగా అందుకున్న పట్టు కుర్తాలు, సెక్విన్ వర్క్‌తో కూడిన లెహంగాలు, దుపట్టాలు లాంటివి మన బీరువాల్లో ఏళ్ల తరబడి మగ్గుతూ ఉంటాయి. పాతబడేకొద్దీ అవన్నీ పిగిలిపోయి, వాడుకోడానికి వీల్లేకుండా పాడైపోతూ ఉంటాయి. ఎన్నో మధురమైన జ్ఞాపకాలు ఆ వస్త్రాలతో ముడిపడి ఉంటాయి కాబట్టి వాటిని పారేయలేం. అలాగని వాడుకోలేం! ఇలాంటి మీమాంసకు చెక్ పెట్టి, వాటితో ఆకర్షణీయమైన వాల్ డెకార్ తయారు చేసుకోండి.

**అంతులేనన్ని ప్రత్యామ్నాయాలు**

పాత చీరలు, స్కార్ఫ్‌లు, కుషన్ కవర్లు, పాత దుపట్టాలను బయటకు తీసి, వాటికి మన పాత ఆర్ట్‌వర్క్ జోడించి కొత్త రూపాన్ని అందించాలి. అలాగే పాత వస్త్రాలను లెక్కలేనన్ని అవసరాలకు కూడా వాడుకోవచ్చు. వాటితో కుషన్ కవర్లు కుట్టుకోవచ్చు. టేబుల్ రన్నర్స్, ల్యాంప్‌షేడ్స్, కర్టెన్లు తయారుచేసుకోవచ్చు. ఫ్యాబ్రిక్ పెయింటింగ్, ఎంబ్రాయిడరీలను జోడించి, ఫ్రేమ్ కట్టించి గోడలకు తగిలించుకోవచ్చు. ఇలా పాత వస్త్రాలు, దుస్తులకు కొత్త కళను జోడించి వాడుకోవడం వల్ల పాత జ్ఞాపకాలను సజీవంగా ఉంచుకోవచ్చు. అలాగే దాంతోపాటు, ఇంటి అలంకరణ కూడా వినూత్నంగా మార్చుకోవచ్చు. మీరూ ప్రయత్నించి చూడండి."





## వేసవిలో కొన్ని డ్రింక్స్ తాగితే

# బరువు తగ్గుతారు

అధిక బరువు వల్ల శారీరక రూపం ప్రభావితం అవ్వడమే కాకుండా అధిక రక్తపోటు, గుండె జబ్బులు, మధుమేహం, అధిక కొలెస్ట్రాల్ వంటి సమస్యలు రావచ్చు. బరువు తగ్గడం కోసం ప్రతి ఒక్కరూ కఠినమైన వ్యాయామాలు చేయకపోయినా సరైన ఆహారపు అలవాట్లు, జీవనశైలిలో చిన్న మార్పులు చేసుకోవడం ద్వారా అధిక బరువును నియంత్రించుకోవచ్చు. ఇక, వేసవిలో శరీరాన్ని హైడ్రేటెడ్‌గా ఉంచుకోవడం చాలా ముఖ్యం. కొన్ని డ్రింక్స్ ఈ సీజన్‌లో తాగితే రిఫ్రెష్‌గా ఉండటమే కాకుండా బరువు కూడా తగ్గవచ్చు. ఈ డ్రింక్స్‌లో జీవక్రియను వేగవంతం చేసే అంశాలు చాలు ఉన్నాయి. బరువు తగ్గడంతో పాటు వేసవిలో మిమ్మల్ని రిఫ్రెష్‌గా ఉంచే డ్రింక్స్ ఏంటి, వాటిని ఎలా తాగాలో తెలుసుకుందాం.

నిమ్మకాయ, తేనె డీటాక్స్ వాటర్

కావాల్సిన పదార్థాలు

- 1 గ్లాసు గోరువెచ్చని నీరు
- 1 నిమ్మకాయ రసం
- 1 టీస్పూన్ తేనె

ప్రయోజనాలుజి

-నిమ్మకాయలో విటమిన్ సి, యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి కొవ్వునువేగంగా బర్న్ చేస్తా యి.

-తేనె జీవక్రియను పెంచుతుంది. అంతేకా కుండా చక్కెర కోరికలను నియంత్రిస్తుంది.

-గోరువెచ్చని నీరు జీర్ణవ్యవస్థను శు భ్రపరుస్తుంది. శరీరం నుంచి టాక్సిన్లను బయటకు పంపిస్తుంది.

**ఎలా తాగాలి?**

ముందుగా గ్లాస్ గోరువెచ్చని నీరు తీసుకుని అందులో నిమ్మకాయ రసం కలండి. ఆ తర్వాత తేనె కలిపి బాగా కలపండి. ఈ పానీయాన్ని ఉదయం ఖాళీ కడుపుతో త్రాగాలి. ఇది శరీరాన్ని డీటాక్స్ చేస్తుంది. శరీరంలో పేరుకుపోయిన కొవ్వును బర్న్ చేసే ప్రక్రియను వేగవంతం చేస్తుంది. దీంతో బరువు తగ్గవచ్చని నిపుణులు అంటున్నారు.

**కీరదోస, పుదీనా కూలింగ్ డ్రింక్**

కావాల్సిన పదార్థాలు

- 1 గ్లాసు నీరు
- దోసకాయ (తరిగిన)
- 5-6 పుదీనా ఆకులు
- 1 నిమ్మకాయ రసం
- రుచికి తగినంత నల్ల ఉప్పు

**ప్రయోజనాలు**

- దోసకాయలో 95% నీరు ఉంటుంది. ఇది శరీరాన్ని హైడ్రేటెడ్‌గా ఉంచుతుంది.
- పుదీనా జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. దీంతో పాటు జీవక్రియను పెంచుతుంది .
- ఈ పానీయం శరీర వేడిని చల్లబరుస్తుంది. కేలరీలను బర్న్ చేయడంలో సహాయపడుతుంది.

**ఎలా తాగాలి?**



ముందుగా దోసకాయ ముక్కల్ని ఒక్క బ్లెండర్‌లో బ్లెండ్ చేయండి. ఆ తర్వాత పుదీనా ఆకులు, నిమ్మరసం, వాటర్ కలిపి బాగా బ్లెండ్ చేయండి. ఆ తర్వాత వడకట్టి, రుచికి తగినంత బ్లాక్ సాల్ట్ యాడ్ చేసుకుని తాగండి. ఈ పానీయాన్ని రోజులో ఎప్పుడైనా తాగవచ్చు. ఇది ఒక రిఫ్రెషింగ్. తక్కువ కేలరీల డ్రింక్. దీంతో బరువు తగ్గవచ్చు.

**పుదీనాతో గ్రీన్ టీ**

**కావాల్సిన పదార్థాలు**

- 1 కప్పు గ్రీన్ టీ
- 5-6 పుదీనా ఆకులు
- 1 టీస్పూన్ నిమ్మరసం

**ప్రయోజనాలు**

- గ్రీన్ టీలో కాటెచిన్ యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి కొవ్వును బర్న్‌ని చేయడంలో ప్రోత్సహిస్తాయి.
- పుదీనా జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. ఆకలిని నియంత్రిస్తుంది.
- ఈ పానీయం శక్తి స్థాయిలను పెంచుతుంది. బరువు తగ్గడానికి సహాయపడుతుంది .

**ఎలా తాగాలి?**

ఈ గ్రీన్ టీని ఉదయం లేదా సాయంత్రం తాగండి. రోజుకు 2 కప్పుల కంటే ఎక్కువ తాగకూడదు. గ్రీన్ టీలో పుదీనా ఆకులు, నిమ్మరసం యాడ్ చేసుకుని తాగితే సరిపోతుంది. ఈ గ్రీన్ టీ తాగడం వల్ల జీవక్రియ వేగవంతం అవుతుంది. దీంతో కేలరీలు వేగంగా బర్న్ అవుతాయి.

**పుచ్చకాయ, అల్లం స్మూతీ**

**కావాల్సిన పదార్థాలు**

- 1 కప్పు పుచ్చకాయ ముక్కలు
-అంగుళం అల్లం
- 1 టీస్పూన్ నిమ్మరసం
- కొద్దిగా పుదీనా

**ప్రయోజనాలు**

- పుచ్చకాయలో 90% నీరు ఉంటుంది. ఇది తక్కువ కేలరీల పండు.
- అల్లం జీవక్రియను పెంచుతుంది. కొవ్వును బర్న్ చేయడానికి సాయపడుతుంది.
-ఈ పానీయం శరీరాన్ని చల్లబరచడమే కాకుండా, బరువు తగ్గడానికి కూడా సహాయపడుతుంది.

**ఎలా తాగాలి?**

అల్పాహారం తర్వాత లేదా మధ్యాహ్నం ఈ డ్రింక్ తాగాలి. ఇది రుచికరమైన, ఆరోగ్యకరమైన ఎంపిక. ఇందుకోసం మిక్సీలో పుచ్చకాయలు ముక్కలు, అల్లం, నిమ్మరసం, పుదీనా వేసి స్మూతీలా చేసుకోండి. ఆ తర్వాత ఫిల్టర్ చేసి ఈ జ్యూస్‌ని తాగండి.

జీలకర్ర, ధనియాల డీటాక్స్ వాటర్

కావాల్సిన పదార్థాలు

- 1 గ్లాసు నీరు
- 1 స్పూన్ జీలకర్ర
- 1 స్పూన్ ధనియాలు
- 1 నిమ్మకాయ రసం

**ప్రయోజనాలు**

- జీలకర్ర, ధనియాలు జీర్ణక్రియను మెరుగుపరుస్తాయి. అంతేకాకుండా కడుపు ఉబ్బరాన్ని తగ్గిస్తాయి.
- ఈ డ్రింక్ శరీరం నుండి టాక్సిన్లను, మురికిని తొలగించడం ద్వారా జీవక్రియను పెంచుతుంది.
- ఈ డ్రింక్ నీటి నిలుపుదల సమస్యను తొలగిస్తుంది. బరువు తగ్గడానికి సహాయ పడుతుంది.

**ఎలా తాగాలి?**

జీలకర్ర, ధనియాల్ని రాత్రంతా నీటిలో నానబెట్టండి. ఆ తర్వాత ఉదయం ఈ మిశ్రమాన్ని వడకట్టండి. రుచి కోసం కాస్త నిమ్మరసం కలిపి తాగండి. ఈ డ్రింక్ తాగడం వల్ల జీవక్రియ వేగవంతం అవుతుంది. బరువు తగ్గడం ఈజీ అవుతుంది.

# చెవిలో పురుగు దూరితే..!



ఒక్కోసారి చెవిలోకి చీమలు, బొద్దింకలు లాంటి చిన్న చిన్న పురుగులు దూరి ఇబ్బంది పెడుతూ ఉంటాయి. లోపలికి వెళ్లినంత సులువుగా అవి బయటికి రావు. వీటిని బయటికి రప్పించడానికి నిపుణులు చెబుతున్న చిట్కాలివి...చెవిలోకి ఏదైనా పురుగు ప్రవేశిస్తే వెంటనే చీకటి గదిలోకి వెళ్లి టార్చ్ లేదా మొబైల్ లైట్‌ను చెవిలో చూపించాలి. వెలుగును చూసిన వెంటనే కొన్ని రకాల పురుగులు బయటికి వచ్చేస్తాయి.చెవిలో ఆలివ్ నూనె లేదంటే బేబీ ఆయిల్ చుక్కలు వేస్తే ఆ నూనెతోపాటే పురుగు బయటికి వస్తుంది.గోరువెచ్చని నీటిలో కొద్దిగా ఉప్పు వేసి బాగా కలపాలి. ఈ నీటిని చుక్కలుగా చెవిలో వేస్తే లోపలికి వెళ్లిన పురుగు బయటికి వచ్చేస్తుంది.ఆల్కహాల్‌లో చిన్న దూది వుండను ముంచి దాన్ని చెవి రంధ్రం దగ్గర పెడితే ఆ ఘాటుకి పురుగు బయటికి వచ్చేస్తుంది. ఆలా రాని పక్షంలో ఒక చుక్క ఆల్కహాల్‌ని వేలితో తీసుకుని చెవిలోపల రాస్తే ఫలితం కనిపిస్తుంది.చెవిలోకి పురుగు దూరినప్పుడు బడ్స్, పిన్నీసు, అగ్గిపుల్ల, సూది లాంటి వాటితో దాన్ని బయటికి తీసే ప్రయత్నం చేయకూడదు. ఇలా చేస్తే చెవి నొప్పి పెరుగుతుంది.ఇన్ని ప్రయత్నాలు చేసినప్పటికీ పురుగు బయటికి రాకపోతే వెంటనే వైద్యుని సంప్రదించాలి.

# ఎండల్లో ఏంచక్కా ఐస్‌క్రీమ్స్ తినాలనుకుంటున్నారా?



ఎండాకాలం వచ్చిందంటే చాలు.. ఎక్కువగా ఐస్‌క్రీమ్స్ తింటారు. వీటి రుచికి చిన్నపిల్లలే కాదు. పెద్దవారు కూడా అడిక్ట్ అయిపోతారు. ఇంతగా ఆస్వాదించే ఈ ఐస్‌క్రీమ్స్ తిన్న వెంటనే కొన్ని ఫుడ్స్, డ్రింక్స్ తీసుకోవద్దని నిపుణులు చెబుతున్నారు. అవేంటంటేఐస్‌క్రీమ్స్.. ఈ పేరు వినగానే చిన్నపిల్లల నోరూరుతుంది. పెద్దవారు కూడా ఏం తక్కువకాదులెండి. ఐస్‌క్రీమ్స్‌ని చూడగానే చిన్నపిల్లల్లా మారతారు. కప్‌ల కొద్దీ లాగించేస్తూ క్రేవింగ్స్‌ని సాటిస్‌ఫై చేస్తారు. కొన్ని ఫుడ్స్‌కి ఎండాకాలంలో గిరాకీ ఎక్కువ. అందులో ఐస్‌క్రీమ్స్ ఉంటాయి. అయితే, ఈ ఐస్‌క్రీమ్స్‌కి ఏ కాలమైనా ఒకటే. చలికాలంలోనూ చిల్‌గా ఐస్‌క్రీమ్స్‌ని ఎంజాయ్ చేసేవారుంటారు. ఇక ఎండాకాలంలో ఊరుకుంటారా.. రోజుకొకటైనా కడుపులో పడాల్సిందే. అంత ఇష్టం చాలా మందికి. ఈ ఐస్‌క్రీమ్స్‌ని ఎంజాయ్ చేసేవారు వీటిని తిన్న తర్వాత కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలని చెబుతున్నారు నిపుణులు. కొన్ని ఫుడ్స్, డ్రింక్స్ జోలికి అసలే పోవద్దొని సూచిస్తున్నారు. దీని వల్ల కడుపులో గందరగోళమేర్పడి జీర్ణ సమస్యలొస్తాయట. మరి అవేంటో తెలుసుకోండి.

**ఎక్కువగా తినడం**

సాధారణంగా ఎక్కువగా తిన్న తర్వాత చాలా మంది లాస్ట్‌లో ఐస్ క్రీమ్ తింటారు. కానీ, ముందుగానే ఐస్ క్రీమ్ తిని ఆ తర్వాత ఎక్కువగా తినడం మంచిది కాదు. దీని వల్ల చాలా సమస్యలొస్తాయి. ఈ కారణంగా జీర్ణ వ్యవస్థపై ఓవర్‌లోడ్ పడుతుంది. జీర్ణ సమస్యలు కూడా వస్తాయి.

**వేడి సూప్, వేడి పదార్థాలు**

ఐస్ క్రీమ్ తిన్న వెంటనే వేడి వేడి పదార్థాలు, వేడి సూప్ వంటివి తీసుకోవడం కూడా మంచిది కాదు. ఇవే కాదు, వేడిగా ఉండే ఏ ఫుడ్స్ కూడా తీసుకోవద్దు. ఒకేసారి, వేడి పదార్థాలు, చల్లని పదార్థాలు కడుపులోకి చేరితే కడుపులో గందరగోళం ఏర్పడుతుంది. దీని వల్ల కూడా జలుబు, దగ్గు వంటి సమస్యలొస్తాయి. కాబట్టి, వీటికి దూరంగా ఉండడమే మంచిది.

సిట్రస్ ఫ్రూట్స్

ఐస్ క్రీమ్ తిన్న వెంటనే పాలు, సిట్రస్ ఫ్రూట్స్ తీసుకోవడం వల్ల వాటిలోని ఆమ్లత కారణంగా జీర్ణక్రియలో ఆటంకం ఏర్పడుతుంది. మంట, వాంతులు, ఇతర సమస్యలకి కారణమవుతుంది. కాబట్టి, ఐస్‌క్రీమ్స్ తిన్న వెంటనే నిమ్మ, ఆరెంజ్ వంటి ఫ్రూట్స్ అసలే తినకూడదు.

**ఫ్రైడ్ ఫుడ్స్**

మనం ఐస్‌క్రీమ్ తిన్న వెంటనే ఫ్రైడ్ చిప్స్, ఫ్రైస్, ఇలా నూనెలో ఫ్రై అయిన ఫుడ్స్ తీసుకోవడం కూడా అస్సలు మంచిది కాదు. దీని వల్ల కూడా జీర్ణ సమస్యలొచ్చే అవకాశం ఉంది. కాబట్టి, ఎంత జాగ్రత్తగా ఉంటే అంత మంచిది. దీని వల్ల చాలా ఆరోగ్య సమస్యల్ని దూరం చేసుకోవచ్చు.

స్పైసీ ఫుడ్స్

?స్పైసీ, మసాలా ఫుడ్స్ తినకపోవడమే మంచిది. దీని వల్ల కడుపు, ఛాతీలో మంట వస్తుంది. అజీర్ణం, అసిడిటీ వంటి సమస్యలొస్తాయి. ఐస్‌క్రీమ్‌లోని డెయిరీ ప్రోడక్ట్స్ స్పైసీ ఫుడ్ సరైన కాంబినేషన్ కాదు. దీని వల్ల కడుపులో ఇబ్బందిగా ఉండి అజీర్ణం, ఇతర సమస్యలకి దారి తీస్తుంది. కావాలనుకుంటే స్పైసీ ఫుడ్ తిన్న తర్వాత కాసేపు ఆగి ఐస్‌క్రీమ్ తినొచ్చు. దీంతో కడుపులో చల్లగా ఉంటుంది.

**కాఫీ, టీలు**

ఐస్ క్రీమ్ తిన్న వెంటనే కాఫీ, టీ వంటి కెఫైన్ ఉండే డ్రింక్స్ తీసుకోవడం సరికాదు. వీటి వల్ల కడుపులో యాసిడ్ ప్రొడక్షన్స్ స్టిమ్యులేట్ అవుతాయి. ఈ కారణంగా గ్యాస్, అసిడిటీ వంటి జీర్ణ సంబంధిత సమస్యలొస్తాయి.

**సోడా, కార్బోనేటెడ్ డ్రింక్స్**

సాధారణంగా ఈ కాంబినేషన్‌ని ఎక్కువగా ఇష్టపడరు. కానీ కొంతమంది తెలియకుండా ఐస్‌క్రీమ్‌తో లేదా తిన్న తర్వాతైన సోడా, కూల్ డ్రింక్స్, కార్బోనేటెడ్ డ్రింక్స్ తీసుకుంటారు. ఇలా చేయడం వల్ల గ్యాస్, బ్లోటింగ్ వంటి సమస్యలు ఫేస్ చేస్తారు. దీంతో కడుపులో గడబిడగా ఉంటుంది.


**ఎప్పుడు తీసుకోవాలి**

ఐస్ క్రీమ్ తీసుకున్న వెంటనే కాకుండా కనీసం 30 నిమిషాల వరకూ వేడి ఆహారం, సిట్రస్ ఫ్రూట్స్, టీ, కాఫీ, డ్రింక్స్ వంటి తీసుకోవద్దు. దీని వల్ల చాలా ఆరోగ్య సమస్యల్ని దూరం చేసుకోవచ్చు. అదే విధంగా, ఐస్‌క్రీమ్స్ కూడా మరీ ఎక్కువగా తినకూడదు. మితంగానే తీసుకోవాలి. దీనికోసం మీరు మీ డైటీషియన్ సలహా తీసుకోవచ్చు.

?గమనిక :ఇది సాధారణ సమాచారం కోసం మాత్రమే. ఇది ఏ విధంగానూ ఏ మెడిసిన్ లేదా చికిత్సకు ప్రత్యామ్నాయం కాదు. వీటిని పాటించేముందు మరింత సమాచారం కోసం ఎల్లప్పుడూ మీ వైద్యుడిని సంప్రదించండి. తెలుగు సమయం ఈ విషయాల్ని ధృవీకరించడం లేదు. ఖచ్చితత్వం, ప్రభావానికి తెలుగు సమయం బాధ్యత వహించదు.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
10 | హైదరాబాద్ ఆదివారం 20 । ఏప్రిల్ । 2025





# టీసీఎస్, వియనై కీలక ఒప్పందం




**ముంబై- నవభూమి:** టాటా గ్రూప్ సంస్థలైన టాటా స్టీల్, టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) కీలక మైలురాయిలను సాధించాయి. టాటా స్టీల్ ట్యూబ్స్ విభాగం %FY%25లో ఒక మిలియన్ టన్నుల ఉత్పత్తి, విక్రయాలను దాటి దేశంలో అత్యంత వైవిధ్యమైన ట్యూబ్స్ తయారీ సంస్థగా నిలిచింది.
టాటా స్టీల్...ఒక మిలియన్ టన్నుల మైలురాయిటాటా స్టీల్ ట్యూబ్స్ విభాగం పెద్ద ఎత్తున నిర్మాణాలు, మెట్రోలు, విమానాశ్రయాలు, రైల్వేలతో సహా మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల నుండి గిడ్డంగుల వంటి పారిశ్రామిక కార్యకలాపాల వరకు విస్తృత అనువర్తనాలను కలిగి ఉంది. ఈ ఉత్పత్తులు వాహన, చమురు, గ్యాస్ రంగాలతో పాటు రూఫ్ షెడ్స్, గేట్ల వంటి రిటైల్ అవసరాలకు సేవలందిస్తాయి.
టీసీఎస్..ఎంటర్‌ప్రైజ్-గ్రేడ్ జనరేటివ్ ఏఐ కంపెనీలలో ఒకటిగా ఉన్న వియనై సిస్టమ్స్‌తో భాగస్వామ్యం ద్వారా, కస్టమర్లకు వియనై హిలా ప్లాట్‌ఫారమ్ ద్వారా డేటాతో సంభాషించే అవకాశాన్ని టీసీఎస్ కల్పిస్తోంది. ఈ ప్లాట్‌ఫారమ్ సహజ భాషా సంభాషణలను అధునాతన డేటా విశ్లేషణలతో కలపడం ద్వారా, ఫైనాన్స్, సరఫరా గొలుసు, విక్రయాల రంగాలలో నిర్ణయాధికారులకు సాంకేతిక నైపుణ్యం అవసరం లేకుండానే తక్షణ సమాధానాలను అందిస్తుంది. టీసీఎస్ సీఈవో, ఎండీ, కృతివాసన్ మాట్లాడుతూ.. "డేటాను సహజంగా, సులభంగా అర్థమయ్యేలా మార్చడం ఈ ఒప్పందం ఉద్దేశం. వియనైతో మా భాగస్వామ్యం ఈ కలను సాకారం చేస్తుంది. సీఎక్స్ఓలు తమ డేటాతో, వేగవంతమైన సమాధానాలు పొందగలరు. జనరేటివ్ ఏఐ వినియోగం ద్వారా, సంక్లిష్టతను తగ్గించి, మానవ కేంద్రీకృత విధానంతో వృద్ధి సాధించగలం" అని అన్నారు.

# వరుసగా ఆరోవారం పెరిగిన భారత్ ఫారెక్స్ నిల్వలు..!



**న్యూఢిల్లీ-నవభూమి:** ఈ నెల 11వ తేదీతో ముగిసిన వారంలో భారత విదేశీ మారక ద్రవ్య నిల్వలు 1.567 బిలియన్లు పెరిగి 677.835 బిలియన్లకు చేరుకున్నాయి. వరుసగా ఆరోవారం విదేశీ మారక ద్రవ్యం నిల్వలు పెరిగినట్లుగా ఆర్‌బీఐ డేటా పేర్కొంది. ఏప్రిల్ 4తో ముగిసిన గతవారంలో ఫారెక్స్ నిల్వలు 10.872 బిలియన్లు పెరిగి 676.268 బిలియన్లకు చేరాయి. సెప్టెంబర్ 2024లో విదేశీ మారక ద్రవ్య నిల్వలు 704.885 బిలియన్లతో గరిష్ఠ స్థాయికి పెరిగాయి.
ఆర్‌బీఐ విడుదల చేసిన డేటా ప్రకారం.. ఫారెక్స్ నిల్వల్లో ప్రధాన భాగమైన విదేశీ కరెన్సీ ఆస్తులు ఏప్రిల్ 11తో ముగిసిన వారంలో 892 మిలియన్లు పెరిగి 574.98 బిలియన్ డాలర్లకు చేరాయి. విదేశీ కరెన్సీ ఆస్తుల్లో విదేశీ మారక ద్రవ్య నిల్వల్లో.. ఉన్న యూరో, పౌండ్, యెన్ వంటి యూఎస్‌యేతర యూనిట్ల పెరుగుదల, తరుగుదల ప్రభావం ఉంటుందని పేర్కొంది. ఈ వారంలో బంగారు నిల్వలు 638 మిలియన్లు పెరిగి 79.997 బిలియన్ల చేరుకున్నాయని ఆర్‌బీఐ తెలిపింది. స్పెషల్ డ్రాయింగ్ రైట్స్ 60 మిలియన్లు తగ్గి 18.356 బిలియన్లకు చేరుకున్నాయని సెంట్రల్ బ్యాంక్ పేర్కొంది. ఐఎంఎఫ్ వద్ద భారతదేశ రిజర్వ్ స్థానం 43 మిలియన్లు పెరిగి 4.502 బిలియన్ల డాలరకు చేరుకున్నాయని డేటా వివరించింది.

# రూ.6.83 లక్షల కోట్లు..ఆర్‌బీఐ వద్ద ఉన్న బంగారం విలువ ఇది



ముంబై: భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) వద్ద ఎంత బంగారం ఉందో తెలుసా..? ఈ ఫిబ్రవరి నాటికి ఆర్‌బీఐ 879 టన్నులు పోగేసింది. ఆర్‌బీఐ తాజా డేటా ప్రకారం.. ఈ నిల్వల ప్రస్తుత విలువ 7,999 కోట్ల డాలర్లు. అంటే, మన కరెన్సీలో దాదాపు రూ.6.83 లక్షల కోట్లు. అంతర్జాతీయ ఆర్థిక అనిశ్చితులు, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల నేపథ్యంలో విదేశీ మారక (ఫారెక్స్) నిల్వలను వివిధీకరించడంతో పాటు మారకం రేటు హెచ్చుతగ్గుల కారణంగా నిల్వల విలువ తగ్గకుండా ఉండేందుకు ఆర్‌బీఐ గడిచిన కొన్నేళ్లుగా పసిడి నిల్వలను వేగంగా పెంచుకుంటూ వస్తోంది. గత ఏడాది చివరి నాటికి మన ఫారెక్స్ నిల్వల్లో బంగారం వాటా 11.4 శాతానికి పెరిగింది. 2019లో ఇది కేవలం 6.7 శాతంగా ఉంది.

**2024లో 72.6 టన్నులు కొనుగోలు**

ప్రపంచ స్వర్ణ మండలి (డబ్ల్యూజీసీ) డేటా ప్రకారం.. గత సంవత్సరంలో ఆర్‌బీఐ 72.6 టన్నుల బంగారం కొనుగోలు చేసింది. తద్వారా వీటి నిల్వలను మరో 9 శాతం పెంచుకుంది. ప్రపంచ దేశాల సెంట్రల్ బ్యాంక్‌లు 2024లో మొత్తం 1,045 టన్నుల బంగారాన్ని పోగేయగా.. అందులో ఆర్‌బీఐదే రెండో అత్యధిక కొనుగోలు. గత ఏడాదిలోని 12 నెలల్లో 11 నెలలు ఆర్‌బీఐ ఈ నిల్వలను పెంచుకుంటూ వచ్చింది. 2023లో పోగేసిన 16 టన్నులతో పోలిస్తే, 2024లో ఆర్‌బీఐ నాలుగు రెట్లకు పైగా బంగారం కొనుగోలు చేసింది.ఇంతక్రితం 2021లోనూ ఇదే స్థాయిలో కొనుగోళ్లు జరిపింది. ఆ ఏడాది నిల్వలను 77.5 టన్నుల మేర పెంచింది.
ఈ ఏడాదిలోనూ మొదటి రెండు నెలల్లో (జనవరి, ఫిబ్రవరి) 2.8 టన్నులు కొనుగోలు చేసింది.
ఆర్‌బీఐ సహా ప్రపంచ దేశాల సెంట్రల్ బ్యాంక్‌లన్నీ పసిడి నిల్వలను భారీగా పెంచుకుంటున్నాయి. గత మూడేళ్లుగా ఏటా 1,000 టన్నులకు పైగా కొనుగోళు జరిపాయి.

**పసిడి కొనుగోళ్లు (టన్నులు)**

| ఏడాది | ఆర్‌బీఐ | ప్రపంచ దేశాల సెంట్రల్ బ్యాంక్‌లు |
|---|---|---|
| 2021 | 77.5 | |
| 2022 | 33.3 | 1,082 |
| 2023 | 16.2 | 1,037 |
| 2024 | 72.6 | 1,045 |
| 2025 | 2.8 | 44 |

(ఫిబ్రవరి వరకు)

**3,300 డాలర్లు దాటిన ఔన్స్ గోల్డ్**

అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ (31.10 గ్రాములు) గోల్డ్ రేటు 3,300 డాలర్లు దాటేసింది. గురువారం ఒక దశలో ఔన్స్ ధర 3,371 డాలర్ల వద్ద సరికొత్త ఆల్‌టైం రికార్డును నమోదు చేసింది. ట్రంప్ సుంకాలు, వాణిజ్య యుద్ధం, మాంద్యం భయాలు పసిడిని రోజుకో రికార్డు స్థాయికి చేరుస్తున్నాయి. ఈ ఏడాదిలో ఇప్పటివరకు గోల్డ్ రేటు 25 శాతం పెరిగింది. 2024లోనూ 28 శాతం ఎగబాకింది. 2023లో 15 శాతం వృద్ధి నమోదైంది. గడిచిన ఏడాది కాలంలో ఔన్స్ గోల్డ్ 1,000 డాలర్ల మేర పెరిగింది. పసిడి చరిత్రలో ఇదే అత్యంత వేగవంతమైన వార్షిక ధర పెరుగుదల. మాంద్యం భయాలు, డాలర్ బలహీనపడుతుండటం, సెంట్రల్ బ్యాంక్‌ల కొనుగోళ్లతో ముమ్మందు బంగారం ధర మరింత ఎగబాకేందుకే అవకాశాలెక్కువని బులియన్ విశ్లేషకులు అంటున్నారు. సుంకాల విధ్వంసం తీవ్రతరమైతే ఈ ఏడాది చివరినాటికి ఔన్స్ గోల్డ్ 4,500 డాలర్ల వరకు పెరిగినా ఆశ్చర్యపోనక్కర్లేదని అంతర్జాతీయ ఆర్థిక సలహాల సంస్థ డెవేర్ గ్రూప్ అంటోంది.

**సంవత్సరాల వారీగా**

ఈ నెలలో ఔన్స్ గోల్డ్ ధర

| ఏప్రిల్ | డాలర్లు |
|---|---|
| 2021 | 1,725 |
| 2022 | 1,920 |
| 2023 | 2,000 |
| 2024 | 2,350 |
| 2025 | 3,300 |

**67,783 కోట్ల డాలర్లకు ఫారెక్స్ నిల్వలు**

ఈ నెల 11తో ముగిసిన వారంలో మన విదేశీ మారక నిల్వలు మరో 156.7 కోట్ల డాలర్ల మేర పెరిగి మొత్తం 67,783.50 కోట్ల డాలర్లకు చేరాయని ఆర్‌బీఐ వెల్లడించింది. ఫారెక్స్ నిల్వలు పెరగడం వరుసగా ఇది ఆరో వారం. కాగా, గత సెప్టెంబరులో నిల్వలు ఆల్‌టైం గరిష్ఠ స్థాయి 70,488.5 కోట్ల డాలర్లకు పెరిగాయి. ఆ తర్వాత కాలంలో మళ్లీ తగ్గుతూ వచ్చిన నిల్వలు గత నెల నుంచి కాస్త పుంజుకున్నాయి.

**బంగారం దిగుమతులు 19% అప్**

గత నెలలో దేశంలోకి బంగారం దిగుమతులు వార్షిక ప్రాతిపదికన 192.13 శాతం పెరిగి 447 కోట్లకు డాలర్లకు చేరాయని కేంద్ర వాణిజ్య శాఖ శుక్రవారం వెల్లడించింది. ఈ మధ్యకాలంలో బంగారం ధరలు వేగంగా పెరగడం దిగుమతుల విలువ పెరుగుదలకు కారణమని మంత్రిత్వ శాఖ పేర్కొంది. ఈ ఏడాది తొలి త్రైమాసికం (జనవరి-మార్చి)లో పసిడి దిగుమతులు 27.27 శాతం పెరిగి 5,800 కోట్ల డాలర్లకు చేరాయి. గత ఏడాదిలో ఇదే కాలానికి దిగుమతులు 4,554 కోట్ల డాలర్లుగా నమోదయ్యాయి. ట్రంప్ సుంకాల నేపథ్యంలో అంతర్జాతీయంగా ఆర్థిక అనిశ్చితులు పెరిగాయి. ఈ సమయంలో భద్రమైన పెట్టుబడి సాధనంగా పేరుండటంతో మదుపరులు పసిడిలో పెట్టుబడులు పెంచుకుంటున్నారు.
మార్చిలో 447 కోట్ల డాలర్లకు చేరిక

# అంతర్జాతీయ ఫార్మా కంపెనీతో దివీస్ ఒప్పందం

Divi's Laboratories Limited

**హైదరాబాద్-నవభూమి:** అంతర్జాతీయంగా పేరొందిన ఫార్మా కంపెనీతో దీర్ఘకాలిక సరఫరా ఒప్పందం కుదుర్చుకున్నట్లు దివీస్ లేబొరేటరీస్ ప్రకటించింది. అయితే ఆ కంపెనీ పేరును మాత్రం దివీస్ వెల్లడించలేదు. ఈ ఒప్పందం అమలులో భాగంగా తమ తయారీ కేంద్రాల్లో అదనపు సామర్థ్యాల జోడింపుపై రూ.650-700 కోట్లు ఇన్వెస్ట్ చేయనున్నట్టు ప్రకటించింది. ఈ సొమ్మును అంతర్గల వనరుల ద్వారానే సమీకరించుకోనున్నట్లు దివీస్ తెలిపింది. రెండు కంపెనీల మధ్య కుదిరిన వాణిజ్య నిబంధనావళి ప్రకారం దివీస్.. అడ్వాన్స్‌డ్ ఇంటర్మీడియేటరీలు తయారుచేసి, సరఫరా చేస్తుంది.

# రోజు రోజుకు పెరుగుతున్న బంగారం ధరలు



**న్యూఢిల్లీ-నవభూమి:** భారతీయ సంస్కృతిలో బంగారం ఓ భాగం. ఏ శుభకార్యం జరిగినా బంగారం ఓ ప్రధాన పాత్ర పోషిస్తుంది. పెళ్లిళ్ల సమయంలో బంగారం స్థాయి ఏంటో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. ఆడపిల్ల తల్లిదండ్రులకు బంగారం కొనడమే పెద్ద సవాలు. 'అమ్మాయికి ఎంత బంగారం పెడుతున్నారు' అని అందరూ అడుగుతారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో బంగారం కొనడం అంటే.. ఆస్తుల్ని అమ్మకానికి పెట్టాల్సి వస్తోంది. ' ఒక్కసారి కమిట్ అయితే.. నా మాట నేనే వినను' అన్నట్లు బంగారం ధరలు రోజు రోజుకు పెరుగుతూనే పోతున్నాయి. వారం క్రితం తగ్గుతూ వచ్చిన బంగారం అందరిలో ఆసక్తి పెంచింది. ఇంకా కొంచెం తగ్గితే బంగారం కొనేద్దాం అని కొంతమంది అనుకున్నారు. వాళ్ల ఆశల మీద నీళ్లు చల్లుతూ బంగారం మళ్లీ పెరగటం మొదలైంది. ఈ రోజు కూడా బంగారం స్వల్పంగా పెరిగింది.
నిన్న హైదరాబాద్ నగరంలో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర 97,580 దగ్గర ట్రేడ్ అయింది. 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధర 89,450 దగ్గర ట్రేడ్ అయింది..10 గ్రాముల 18 క్యారెట్ల బంగారం ధర .. 73,190 రూపాయల దగ్గర ట్రేడ్ అయింది. నిన్నటితో పోల్చుకుంటే ఈ రోజు బంగారం ప్రతీ గ్రాముపై రూపాయి చొప్పున పెరిగింది. ఈ రోజు 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర 97,590 దగ్గర ట్రేడ్ అవుతోంది. 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధర 89,460 దగ్గర ట్రేడ్ అవుతోంది..10 గ్రాముల 18 క్యారెట్ల బంగారం ధర .. 73,200 రూపాయల దగ్గర ట్రేడ్ అవుతోంది.

**వెండి ధరలు ఇలా**

గుడ్డిలో మెల్ల అన్నట్లు ఇన్ని రోజులు పెరుగుతూ పోయిన వెండి ధరలు నిన్న మాత్రం తగ్గాయి. ఒక గ్రాము వెండి ధర నిన్న 100 రూపాయల దగ్గర ట్రేడ్ అయింది. 10 గ్రాముల వెండి 1000 రూపాయల దగ్గర ట్రేడ్ అయింది. ఈ రోజు ఒక గ్రాము వెండిపై పది పైసలు తగ్గి.. 99.90 రూపాయల దగ్గర ట్రేడ్ అవుతోంది. 10 గ్రాము వెండి 999 దగ్గర ట్రేడ్ అవుతోంది. కేజీ వెండి ధర నిన్న లక్ష రూపాయల దగ్గర ట్రేడ్ అయింది. ఈ రోజు 99,900 దగ్గర ట్రేడ్ అవుతోంది. భవిష్యత్తులో వెండి మరింత పెరిగే అవకాశం ఉంది.

# మళ్లీ ట్రూజెట్ విమాన సర్వీసులు!




**హైదరాబాద్-నవభూమి:** హైదరాబాద్ కేంద్రంగా ఉన్న ప్రాంతీయ విమానయాన సంస్థ 'ట్రూజెట్' మళ్లీ తన విమాన సర్వీసులు ప్రారంభించేందుకు సిద్ధమవుతోంది. ఇందు కోసం తన నిరభ్యంతర పత్రాన్ని (ఎన్ఓసీ) పునరుద్ధరించాలని కేంద్ర పౌర విమానయాన మంత్రిత్వ శాఖ (ఎంఓసీఏ)కు ట్రూజెట్ దరఖాస్తు చేసినట్లు తెలిసింది. ఎంఓసీఏ ఇందుకు ఆమోదం తెలిపితే పౌర విమానయాన శాఖ డైరెక్టర్ జనరల్ (డీజీసీఏ) నుంచి కంపెనీ తన పాత ఎయిర్ ఆపరేషన్స్ పర్మిట్ (ఏఓపీ)ను పునరుద్ధరించుకోవాల్సి ఉంటుంది. వీటికి తోడు కంపెనీ బోర్డులోని సభ్యుల నియామకాలకూ కేంద్ర హోం మంత్రిత్వ శాఖ అనుమతి అవసరం. ఈ అనుమతులన్నీ పూర్తి చేసి ఈ ఏడాది ఆగస్టు లేదా సెప్టెంబరు మధ్య కాలంలో హైదరాబాద్ నుంచి మళ్లీ కొద్దిపాటి ఏటీఆర్ టర్బో విమానాలతో ప్రాంతీయ విమాన సర్వీసులు ప్రారంభించాలని ట్రూజెట్ భావిస్తోంది. ,రూ.100 కోట్ల పెట్టుబడి: విమాన సర్వీసుల పునరుద్ధరణ కోసం ట్రూజెట్ యాజమాన్యం రూ.100 కోట్ల వరకు పెట్టుబడులు పెట్టబోతున్నట్టు సమాచారం. దీంతో ఐదు ఏటీఆర్ విమానాలతో పాటు దేశంలోని కొన్ని ప్రధాన నగరాల మధ్య ఎయిర్‌బస్ ఏ-320 విమాన సర్వీసులూ ప్రారంభించాలని యోచిస్తోంది. ఖర్చులు తగ్గించుకునేందుకు ఏ-320 పాత విమానాలను ఆఫ్రికా లేదా ఇతర దేశాల నుంచి కొనాలని కంపెనీ యోచిస్తున్నట్టు తెలుస్తోంది. ఈ సంవత్సరాంతం నాటికి లేదా వచ్చే ఏడాది ఆరంభంలో ఈ విమానాలను అందుబాటులోకి తీసుకురావాలని ట్రూజెట్ చూస్తోంది. ఈ ఎయిర్‌బస్ విమానాలకు విశాఖ విమానాశ్రయం, ఏటీఆర్ విమానాలకు హైదరాబాద్‌ను కేంద్రంగా ఎంచుకోవాలని ట్రూజెట్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. హైదరాబాద్‌లోని రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం కేంద్రంగా 2015 నుంచి 2022 వరకు ట్రూజెట్ కార్యకలాపాలు సాగించింది. అయితే కొవిడ్ కారణంగా పరిస్థితులు తలకిందులు కావటంతో 2022 ఫిబ్రవరిలో తన కార్యకలాపాలను పూర్తిగా నిలిపివేసింది.

# జీవిత కాల గరిష్టానికి బంగారం ధర..



**న్యూఢిల్లీ-నవభూమి:** అంతర్జాతీయ సానుకూల పరిస్థితుల నేపథ్యంలో దేశీయ బులియన్ మార్కెట్‌లో బంగారం ధరలు ధగధగమని మెరుస్తున్నాయి. గురువారం 99.9శాతం స్వచ్ఛత గల బంగారం తులం ధర రూ. 17 వృద్ధితో రూ.82,900లకు చేరుకుని తాజాగా మరో జీవిత కాల గరిష్టాన్ని తాకింది. బుధవారం తులం బంగారం ధర రూ. 82,730 వద్ద ముగిసింది. గతేడాది ఫిబ్రవరి 23న రూ.62,720 పలికిన పది గ్రాముల బంగారం ధర గురువారం (2025 జనవరి 23) రూ.82,900 పలికింది. అంటే 11 నెలల్లోనే బంగారం బంగారం తులం ధర రూ. 20,180 (32.17 శాతం) పెరిగింది. వరుసగా ఏడో సెషన్‌లోనూ 99.5 శాతం స్వచ్ఛత గల బంగారం తులం ధర రూ.170 పెరిగి రూ.82,500లతో తాజా జీవిత కాల గరిష్టాన్ని తాకింది. బుధవారం ఇదే బంగారం తులం ధర రూ.82,330 స్థిర పడింది. గత ఏడు సెషన్లలో 99.9 శాతం, 99.5 శాతం స్వచ్ఛత గల బంగారం తులం ధర రూ.2,320 చొప్పున వృద్ధి చెందింది.ఇదిలా ఉంటే గురువారం కిలో వెండి ధర రూ.500 తగ్గి రూ.93,500 పలికింది. బుధవారం కిలో వెండి ధర రూ.94,000 వద్ద స్థిర పడింది.
అంతర్జాతీయ మార్కెట్లోనూ గిరాకీ గల బంగారానికి దేశీయ బులియన్ మార్కెట్లో రిటైలర్లు, జ్యువెల్లర్ల నుంచి డిమాండ్ పుంజుకోవడంతో బంగారం ధరలు పెరుగుతున్నాయని బులియన్ విశ్లేషకులు చెబుతున్నారు.మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ (ఎంసీఎక్స్)లో గురువారం గోల్డ్ కాంట్రాక్ట్స్ ఫిబ్రవరి డెలివరీ తులం బంగారం ధర రూ.19 (0.02 శాతం) పెరిగి రూ.79,583లకు చేరుకుంది. మరోవైపు కిలో వెండి ఫ్యూచర్స్ ధర రూ.422 (0.46 శాతం) తగ్గి రూ.91,522 లకు చేరుకుంది. బుధవారం కిలో వెండి ధర రూ.91,944 వద్ద స్థిర పడింది.అంతర్జాతీయ మార్కెట్లలో కామెక్స్ గోల్డ్ ఫ్యూచర్స్‌లో ఔన్స్ బంగారం ధర 13.20 డాలర్లు (0.48 శాతం) తగ్గి 2,757.70 డాలర్లకు చేరుకుంది. యూఎస్ డాలర్, యూఎస్ ట్రెజరీ బాండ్ల ధరల్లో రికవరీతో బంగారం ధరలు ఫ్లాట్ నుంచి నెగెటివ్‌గా మారాయని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ కమొడిటీస్ సీనియర్ అనలిస్ట్ సౌమిల్ గాంధీ చెప్పారు. బుధవారం యూఎస్ డాలర్ ఇండెక్స్, ట్రెజరీ బాండ్లు పాజిటివ్‌గా ముగిశాయి. దీనివల్ల గురువారం బంగారం ధర పెరిగిందని సౌమిల్ గాంధీ తెలిపారు. వచ్చే ఒకటి, రెండు రోజుల్లో బంగారం రికార్డు గరిష్టాలకు చేరుతుందని అగుమెంట్ రీసెర్చ్ హెడ్ రెనిషా చైనానీ చెప్పారు.వివిధ దేశాల నుంచి దిగుమతులపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలు కూడా బులియన్ మార్కెట్‌లో బంగారం ధరలు పుంజుకోవడానికి కారణమయ్యాయి. సిల్వర్ కామెక్స్‌లో ఔన్స్ వెండి ధర 1.03 శాతం పతనంతో 31.10 డాలర్లు పలికింది. కెనడా, మెక్సికోలపై 25 శాతం సుంకాలు విధిస్తామని ట్రంప్ ప్రకటించారని రెనిషా చైనానీ తెలిపారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రతిపాదించే విధానాలతో ద్రవ్యోల్బణం పెరిగిపోయే అవకాశం ఉందని, యూఎస్ ఫెడ్ రిజర్వ్ వడ్డీరేట్లు తగ్గించకపోవచ్చునని చెప్పారు. ప్రపంచంలోనే కెనడాలోనే ఎక్కువగా వెండి తయారవుతుంది. మెక్సికో నుంచి దిగుమతి చేసుకునే వెండిపై ట్రంప్ సుంకాలు విధిస్తారా..? లేదా..? అన్న విషయమై స్పష్టత రావాల్సి ఉంది.

# 'బేర్'మంటున్న డాలర్




**న్యూఢిల్లీ-నవభూమి:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాల యుద్ధంతో అమెరికా కరెన్సీ డాలర్ కూడా 'బేర్'మంటోంది. కీలకమైన ఆరు ప్రధాన కరెన్సీలతో డాలర్ మారకం రేటు ఇప్పటికే మూడేళ్ల కనిష్ఠ స్థాయికి చేరింది...
'బేర్'మంటున్న డాలర్
న్యూయార్క్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాల యుద్ధంతో అమెరికా కరెన్సీ డాలర్ కూడా 'బేర్'మంటోంది. కీలకమైన ఆరు ప్రధాన కరెన్సీలతో డాలర్ మారకం రేటు ఇప్పటికే మూడేళ్ల కనిష్ఠ స్థాయికి చేరింది. ఈ ఏడాది జనవరి 15 నుంచి ఇప్పటి వరకు చూసినా ఈ కరెన్సీలతో డాలర్ మారకం రేటు 9 శాతం నష్టపోయింది. ఇక ఈ నెల ప్రారంభం నుంచి చూసినా యూరో, బ్రిటిష్ పౌండ్, జపాన్ యెన్‌లతో డాలర్ మారకం రేటు 5 నుంచి 6 శాతం పడిపోయింది. ట్రంప్ దుందుడుకు ఆర్థిక విధానాలతో డాలర్ మారకం రేటు మరింత తగ్గిపోయే ప్రమాదం ఉందని ఆర్థికవేత్తలు హెచ్చరిస్తున్నారు.డాలర్ ఆధిపత్యానికి గండి: డాలర్ మారకం రేటు పడిపోవడం అమెరికా ఆర్థికవేత్తలను కలవరపరుస్తోంది. ఈ పతనానికి వెంటనే తెరపడకపోతే ప్రపంచ రిజర్వ్ కరెన్సీగా డాలర్ తన స్థానా న్ని కోల్పోయే ప్రమాదం పొంచి ఉందని హెచ్చరిస్తున్నారు. ప్రస్తుతం అంతర్జాతీయ చెల్లింపుల్లో డాలర్‌దే అగ్రస్థానం. డాలర్ మారకం రేటు మరింత క్షీణిస్తే ఆ ఆధిపత్యానికీ తెరపడినట్టే.

# బాధితుల జాబితాలో ధోనీ, దీపికా పదుకొనే, ఇంకా..

**న్యూఢిల్లీ-నవభూమి:** మహేంద్ర సింగ్ ధోనీ అంటే ఎంతమందికో ఒక పిచ్చి. బాలీవుడ్ స్టార్ యాక్ట్రస్ దీపికా పదుకునేకి కూడా ఎంతో మంది ఫ్యాన్స్. అయితే, ఈ సెలబ్రెటీలిద్దరూ ఇప్పుడు బాధితుల జాబితాలో ఉన్నారంటే ఆశ్చర్యమే కదా.. స్టాక్ మార్కెట్లో పెట్టుబడులు రిస్క్‌తో కూడిన వ్యవహారమని చాలా మంది అంటుంటారు. అయితే, జాగ్రత్తగా కంపెనీ గురించి అధ్యయనం చేసి బ్యాలెన్స్ షీట్స్, పీఈ లెవెల్స్ చెక్ చేసి స్టాక్స్ ఎంచుకోవాలని చెబుతుంటారు. అయితే, చిన్నా చితకా రిటైల్ ఇన్వెస్టర్లకు పెద్దగా అవగాహనా లేకపోయినా కోట్లలో పెట్టుబడులు పెట్టే బడా పెట్టుబడిదార్లకు మాత్రం ఒక టీం దీని మీద అధ్యయనం చేసి మరీ పెట్టుబడులు పెట్టిస్తుంది. అయితే, వాళ్లు కూడా కొన్ని సందర్భాల్లో బురిడీ కొట్టేస్తుంటారు. తాజాగా ఇలాంటి సందర్భమే వచ్చింది. అదీ.. ఎందరికో అభిమానపాత్రుడైన క్రికెట్ దిగ్గజం మహేంద్ర సింగ్ ధోనీకి.. క్రికెటర్ ధోనీ ఒక్కడే కాదు, బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దీపికా పదుకొనే కూడా ఈ బాధిత జాబితాలో ఉంది. అసలు ఏంటి ఈ షేర్ మార్కెట్ వ్యవహారం అనేది చూద్దాం.దేశంలో లీడింగ్ క్యాబ్ సర్వీస్ ప్రొవైడర్స్ అయిన ఉబర్, ఓలా సంస్థలకు సవాలుగా 2018 లో బెంగళూరు కేంద్రంగా ఏర్పాటైంది బ్లూస్మార్ట్ అనే కంపెనీ. ఈ సంస్థ కో ఫౌండర్ జెన్సోల్ ఇంజనీరింగ్ వ్యవస్థాపకుడు అన్మోల్ జగ్గీ. ఈ సంస్థ పెట్టుబడిదారుల నుండి రూ.4,100 కోట్లకు పైగా సేకరించింది. అయితే ఇప్పుడు అనిశ్చిత భవిష్యత్తు వైపు చూస్తోంది. ఈ కంపెనీలో పెట్టుబడి పెట్టిన ప్రముఖ పెట్టుబడిదారుల జాబితాలో మహేంద్ర సింగ్ ధోని, దీపికా పదుకొనే, సంజీవ్ బజాజ్ ఇంకా అష్నీర్ గ్రోవర్ తదితరులున్నారు.బాలీవుడ్ నటి దీపికా పదుకొనే ఈ సంస్థ తొలి పెట్టుబడిదారులలో ఒకరు. 2019లో మిలియన్లు పెట్టుబడి పెట్టడానికి ఏంజెల్ ఫండింగ్ రౌండ్‌లో దీపిక కుటుంబ కార్యాలయం పాల్గొంది. 2019లో అదే రౌండ్‌లో, బజాజ్ క్యాపిటల్ మేనేజింగ్ డైరెక్టర్ సంజీవ్ బజాజ్, %JITO% ఏంజెల్ నెట్‌వాక్, రజత్ గుప్తాతో కలిసి %వి%3 మిలియన్ల పెట్టుబడితో స్టార్టప్‌కు మద్దతు ఇచ్చారు. ఇక, గతేడాది కంపెనీ ప్రీ-సిరీస్ %B% ఫండింగ్‌లో $%24 మిలియన్లను సేకరించింది. ఇందులో క్రికెటర్ మహేంద్ర సింగ్ ధోని కుటుంబ కార్యాలయం పెట్టుబడులు పెట్టింది. అటు, భారత్‌పే సహ వ్యవస్థాపకుడు అష్నీర్ గ్రోవర్ కూడా పెట్టుబడులు పెట్టిన వారిలో ఉన్నారు.ఇలా ఉంటే, "బ్లూస్మార్ట్ యాప్‌లో బుకింగ్‌లను తాత్కాలికంగా మూసివేయాలని మేము నిర్ణయించుకున్నాము" అని బ్లూస్మార్ట్ కంపెనీ ఏప్రిల్ 17న కస్టమర్లకు పంపిన ఇమెయిల్‌లో తెలిపింది. అయితే, ఈ మెయిల్.. సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబీ) రెండు రోజుల ముందు చేసిన ఒక కీలక మైన ప్రకటన తర్వాత వచ్చింది. ఇంతకీ సెబీ ఏమందంటే.. బ్లూస్మార్ట్ స్టార్టప్ ప్రమోటర్లైన జెన్సోల్ ఇంజనీరింగ్ అధిపతులు అన్మోల్, పునీత్ సింగ్ జగ్గీ బ్లూస్మార్ట్ కోసం కార్లు కొనడానికి ఉద్దేశించిన రుణాలను గురుగ్రామ్‌లోని ది కామెలియాస్‌లోని లగ్జరీ అపార్ట్‌మెంట్ కోసం, ఇంకా రూ. 26 లక్షల విలువైన హై-ఎండ్ గోల్ఫ్ పరికరాలు కొనుక్కొనేందుకు మళ్లించారని కనుగొన్నట్లు చెప్పింది. అంతేకాదు, మధ్యంతర ఉత్తర్వులో, జగ్గీ సోదరులు సంస్థలో డైరెక్టర్ పదవులను నిర్వహించకుండా ఇంకా మార్కెట్‌లోకి ప్రవేశించకుండా సెబీ నిషేధించింది.కాగా జెన్సోల్ ఇంజనీరింగ్ సంస్థ ఐఆర్ఈడీఏ, పీఎఫ్‌సీ నుంచి మొత్తంగా రూ.977.75 కోట్ల మేర రుణం తీసుకుంది. ఇందులో రూ.663.89 కోట్లను ప్రత్యేకంగా 6,400 విద్యుత్తు వాహనాల కొనుగోలుకు కంపెనీ వెచ్చించాలి. కొన్నవాటిని బ్లూస్మార్ట్‌కు లీజ్‌కు ఇవ్వాలి. అయితే, ఇప్పటివరకు 4,704 ఈవీలను రూ.567.74 కోట్లతో కొనుగోలు చేశామని ఫిబ్రవరిలో సెబీకి జెన్సోల్ చెప్పింది. జెన్సోల్‌కు ఆ వాహనాలు సరఫరా చేసినట్లు కూడా గో-ఆటో ప్రైవేట్ లిమిటెడ్ ధ్రువీకరించింది. ఇందులో జెన్సోల్ కంపెనీ తన వాటా కింద మరో 20% చెల్లించాలి కనుక, రుణాలతో కలిపి ఈవీల కొనుగోలుకు కేటాయించాల్సిన మొత్తం రూ.829.86 కోట్లు అయింది. ఇందులో 4,704 ఈవీ వాహనాలకు వెచ్చించిన రూ.567.74 కోట్లు తీసివేస్తే, మిగిలిన రూ.262.13 కోట్లకు లెక్క తేలలేదు.
దీంతో రూ.262.13 కోట్ల రూపాయల నిధులు ఏమయ్యాయో తెలుసుకునేందుకు జెన్సోల్, గో-ఆటోల బ్యాంకు స్టేట్‌మెంట్‌లను సెబీ విశ్లేషించింది.

# ఎలాన్ మస్క్‌తో టెక్ సహకారంపై మాట్లాడిన ప్రధాని మోదీ

**న్యూఢిల్లీ-నవభూమి:** ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ శుక్రవారం టెస్లా, స్పేస్ ఎక్స్ అధినేత, బిలియనీర్ ఎలాన్ మస్క్‌తో మాట్లాడారు. టెక్నాలజీ, ఆవిష్కరణ రంగాలలో సహకారం గురించి చర్చించారు. దీనికి సంబంధించి పీఎం మోదీ తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశారు. "ఈ ఏడాది ఆరంభంలో వాషింగ్టన్ డిసిలో జరిగిన మా సమావేశంలో చర్చించిన అంశాలతో సహా వివిధ సమస్యలు, అంశాల గురించి ఎలాన్ మస్క్‌తో మాట్లాడాను. టెక్నాలజీ, ఇన్నోవేషన్స్ రంగాలలో సహకారానికి ఉన్న అపారమైన అవకాశాలపై మేము చర్చించాం" అని మస్క్ యాజమాన్యంలోనే ఉన్న సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ %శ%లో పీఎం మోదీ పోస్ట్ చేశారు. టెక్నాలజీలో అమెరికాతో ద్వైపాక్షిక భాగస్వామ్యాన్ని ముందుకు తీసుకెళ్లడానికి భారతదేశం కట్టుబడి ఉందని మోదీ అన్నారు.కాగా, 2030 నాటికి 00 బిలియన్ల వాణిజ్యాన్ని చేరుకోవాలనే లక్ష్యంతో భారత్ - అమెరికా ప్రతిష్టాత్మక ఒప్పందంపై చర్చలు జరుపుతున్నాయి. ఎలాన్ మస్క్ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు ప్రముఖ సలహాదారన్న విషయం తెలిసిందే. ఫిబ్రవరిలో భారత ప్రధాని నరేంద్ర మోదీ అమెరికా పర్యటన సందర్భంగా, వాషింగ్టన్‌లో టెస్లా చీఫ్‌ను కలుసుకుని ఇండియాలో టెస్లా స్థాపనకు సంబంధించిన అంశాలతోపాటు సాంకేతికత, నూతన ఆవిష్కరణలకు సంబంధించి వివిధ అంశాలపై చర్చించారు.



# తండ్రి మృతదేహం ఎదుటే కుమారుడి పెళ్లి..



**కడలూర్-నవభూమి:** ప్రేమించిన అమ్మాయిని పెళ్లి చేసుకోవాలని ఓ యువకుడు ఆశ పడ్డాడు. ఈ క్రమంలోనే ఇరు కుటుంబాల్లో ఒప్పించి వివాహానికి అంగీకారం పొందాడు. కానీ ఈలోపు అతనికి ఊహించని షాక్ తగిలింది. వీధి ఆడిన ఆ వింత నాటకంలో బాధను దిగమింగుకొని కూడా ఎవరూ చేయని ఓ పని చేయాలని నిశ్చయించుకున్నాడు. తండ్రి మృతదేహం ఎదుటే కుమారుడు పెళ్లి చేసుకున్న హృదయవిదారక సంఘటన తమిళనాడులోని కడలూర్ జిల్లాలో చోటుచేసుకుంది. విరుధాచలం సమీపంలోని కావణై గ్రామానికి చెందిన సెల్వరాజ్ అనే మాజీ రైల్వే ఉద్యోగికి ఇద్దరు కుమారులు. ఆయన రెండో కుమారుడు అప్పు. అతడు న్యాయ విద్యను అభ్యసిస్తున్నాడు. అప్పు కొంతకాలంగా విజయశాంతి అనే యువతిని ప్రేమిస్తున్నాడు. అయితే ఇద్దరూ ఇరు కుటుంబాల అంగీకారంతో వివాహ బంధంతో ఒక్కటవ్వాలని నిర్ణయం తీసుకున్నారు. ఈలోగా అనుకోని విషాదం చోటుచేసుకుంది. అప్పు తండ్రి సెల్వరాజ్ అనారోగ్యంతో బుధవారం రాత్రి కన్నుమూశారు. తండ్రి చివరి చూపు తన పెళ్లిపై ఉండాలని, ఆయన ఆశీస్సులతో జీవితాన్ని ప్రారంభించాలని భావించిన అప్పు.. తండ్రి మృతదేహం ఎదుటే తన ప్రేయసిని వివాహమాడాలని అనుకున్నాడు. కుటుంబ సభ్యులకు విషయం చెప్పి వారి అంగీకారంతో తన తండ్రి పార్థివ దేహం ఎదుటే అమ్మాయి మెడలో తాళికట్టి పెళ్లి చేసుకున్నాడు.

## మే 2న కేదార్‌నాథ్, మే 4న బద్రీనాథ్ ఆలయాలు ఓపెన్ : టెంపుల్ కమిటీ



**న్యూఢిల్లీ-నవభూమి:**జ్యోతిర్లింగ క్షేత్రమైన కేదార్‌నాథ్ ఆలయాన్ని మే2వ తేదీన ఓపెన్ చేయనున్నారు. ఈ విషయాన్ని బద్రీనాథ్ - కేదార్‌నాథ్ ఆలయ కమిటీ వెల్లడించింది. చార్‌ధామ్ యాత్ర లో భాగంగా కేదార్‌నాథ్ ఆలయ ద్వారాలను మే 2 ఉదయం తెరవనున్నట్లు వెల్లడించారు. ఇక బద్రీనాథ్ ఆలయాన్ని మే 4 నుంచి భక్తుల కోసం తెరవనున్నట్లు వెల్లడించారు.పరమేశ్వరుడి పవిత్ర ఆలయాలైన 12 జ్యోతిర్లింగాల్లో కేదార్‌నాథ్, బద్రీనాథ్ ఆలయాలు కూడా ఉన్నాయి. చార్‌ధామ్ యాత్రలో ఈ దేవాలయాలు సందర్శన భాగంగా ఉంటాయి. ఏటా దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి లక్షల మంది భక్తులు కేదార్‌నాథ్, బద్రీనాథ్ ఆలయాలను సందర్శించి పరమేశ్వరుడ్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేస్తుంటారు. అయితే ఏటా శీతాకాలం ప్రారంభం కాగానే ఈ ఆలయాలను మూసివేస్తారు. ఆ సమయంలో ఆలయాలు మొత్తం మంచుతో కప్పుకుపోయి ఉంటాయి. తిరిగి వేసవిలో ఈ ఆలయాల తలుపులు తెరుస్తారు. ఇక చార్‌ధామ్ యాత్ర ఈ నెల 30 నుంచి ప్రారంభమవుతుంది. భక్తులు యమునోత్రి, గంగోత్రి, కేదార్‌నాథ్, బద్రీనాథ్‌లను సందర్శిస్తారు. ఈ యాత్ర నేపథ్యంలో గంగోత్రి, యమునోత్రి ఆలయాలను ఈ నెల 30 నుంచి తెరవనున్నారు.

## ఖైదీలకు గుడ్ న్యూస్..జైళ్లలో ప్రత్యేక 'సెక్స్ రూమ్స్'

**న్యూఢిల్లీ-నవభూమి:** శృంగారం అనే పదం వినగానే మనకు ఎన్నో రకాల భావాలు కలుగుతాయి. ప్రేమ, అనుబంధం, ఆకర్షణ, సంతోషం, మరియు అనేక ఇతర భావాలు మన మనసుల్లో ఉద్భవిస్తాయి. శృంగారం అనేది కేవలం శారీరక ఆకర్షణ మాత్రమే కాదు, ఇది మానసిక, భావోద్వేగ సంబంధమైన ఒక అనుభూతి. శృంగారం ఒక సహజమైన ప్రక్రియ. ఇది అందరి జీవితాల్లో సర్వసాధారణంగా జరిగేదే. అయితే జైల్లో ఖైదీలు సంవత్సరాలు తరబడి ఈ శృంగారానికి దూరంగా ఉండాల్సిన పరిస్థితి. అయితే కొన్ని దేశాలు ఈ సమస్యకు పరిష్కారం చూపిస్తున్నాయి. జైళ్లో ఖైదీలుగా ఉన్న వారు తమ జీవిత భాగస్వామిని ఏకాంతంగా కలుసుకోవడానికి ప్రత్యేక గదులను ఏర్పాటు చేస్తున్నారు. %ూణ% కొన్ని దేశాల్లో జైళ్లలో ఖైదీల కోసం ప్రత్యేకంగా 'సెక్స్ రూమ్స్' సౌకర్యం ఉంది. దీని ద్వారా ఖైదీలకు వారి జీవిత భాగస్వాములతో వ్యక్తిగతంగా సమయం గడపడానికి అవకాశం దొరికినట్టు అవుతుంది.ఇటలీ తన మొట్టమొదటి అధికారిక "సెక్స్ రూమ్"ను ఉంబ్రియా ప్రాంతంలోని ఒక జైలులో ప్రారంభించింది.

ఖైదీల యొక్క "సన్నిహిత సమావేశాల" హక్కును రాజ్యాంగ న్యాయస్థానం గుర్తించిన తర్వాత ఈ నిర్ణయం తీసుకున్నారు.ఈ గదిలో ఒక మంచంతో పాటు టాయిలెట్ ఉంటాయి. గార్డుల పర్యవేక్షణ లేకుండా ఖైదీలు తమ భాగస్వాములతో గరిష్టంగా రెండు గంటల వరకు గడపవచ్చు.

ఇటలీలో ఈ విధానం కొత్తగా ప్రారంభమైనప్పటికీ, ఇతర యూరోపియన్ దేశాలైన స్పెయిన్, ఫ్రాన్స్, స్వీడన్, డెన్మార్క్ మరియు నెదర్లాండ్స్‌లో ఇదివరకే ఇలాంటి ఏర్పాట్లు ఉన్నాయి. ఖైదీల యొక్క మానసిక ఆరోగ్యం , కుటుంబ సంబంధాలను కాపాడటానికి ఇటువంటి సౌకర్యాలు సహాయపడతాయని భావిస్తారు.ఇది ఖైదీల మానసిక ఆరోగ్యం, ప్రవర్తన మెరుగుదల మరియు కుటుంబ సంబంధాలను నిలబెట్టుకోవడానికి సహాయపడుతుందని భావిస్తారు.అయితే, ఈ విధానం అన్ని దేశాల్లో లేదు మరియు దీనిపై భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. భద్రతా కారణాలు, ఖర్చుతో పాటు నైతిక సమస్యల దృష్ట్యా చాలా దేశాలు దీనిని అమలు చేయడం లేదు.

## వసంత, నార్నే..! అక్రమ నిర్మాణాలపై హైడ్రా పంజా, 39 ఎకరాలకు విముక్తి

**హైదరాబాద్-నవభూమి:** అక్రమ నిర్మాణాపై హైడ్రా మరోసారి విరుచుకుపడింది. హైదరాబాద్ మియాపూర్‌లోని హాఫీజ్‌పేట్ సర్వే నెంబర్ 79లో ఉన్న 39 ఎకరాల భూమిలో హైడ్రా కూల్చివేతలు చేపట్టింది. ప్రభుత్వ భూములలో ఆక్రమణలను తొలగించింది. దీంతో అఫీజ్‌పేట, రాయదుర్గంలో రూ. వందల కోట్ల విలువైన భూమికి విముక్తి లభించింది. %ూణ% ప్రభుత్వ భూముల ఆక్రమణలకు సంబంధించి వివిధ కోర్టులలో కేసులున్నప్పటికీ చుట్టూ ప్రహరీ నిర్మించి సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసి ఆక్రమణలకు పాల్పడ్డాయి బడా నిర్మాణ సంస్థలు. శేరిలింగంపల్లి మున్సిపాలిటీ, కొండపూర్లోని ఆఫీజపేట సర్వే నంబర్ 79లో మొత్తం 39.2 ఎకరాలు ఉండగా ఇప్పటికే సగానికి పైగా నిర్మాణాలు జరిగాయి. %ూశ్రీంశీ =ఝఃం% "%=ఝఱఅ ఖశ్రీవతీ%: తెలంగాణలోని ఈ జిల్లాలకు భారీ వర్ష సూచన " సర్వే నంబరు 79 ప్రభుత్వ భూమి, నిషేధిత జాబితాగా రెవెన్యూ రికార్డులలో నమోదై ఉంది. ఆ సర్వే నంబరు 79/1 గా సృష్టించి ప్రభుత్వ వ్యవస్థలను తప్పుదోవ పట్టించి అక్రమ నిర్మాణాలు చేపట్టింది వసంత హోమ్స్ సంస్థ. అంతేగాక, ఇప్పటికే 19 ఎకరాలను కాజేసి ఇళ్లు నిర్మించి అమ్మేసి.. ఇంకా ఖాళీగా ఉన్న 20 ఎకరాల ప్రభుత్వ భూమిలో ఆఫీసు కార్యాలయంతో పాటు.. పలు షెడ్డులు ఏర్పాటు చేసి వివిధ సంస్థలకు అద్దెకు ఇచ్చింది వసంత హౌస్ నిర్మాణ సంస్థ. %ూణ% ఈ భూములపై సుప్రీం కోర్టులో చాలా కాలంగా సి.ఎస్.14/58 అనే వాజ్యం పెండింగ్‌లో ఉండగా కోర్టు ఆదేశాలను ధిక్కరిస్తూ అక్రమంగా నిర్మాణాలు చేపట్టి వివిధ సంస్థలకు అద్దెకు ఇచ్చింది. ఈ ప్రభుత్వ భూమిపై కోర్టులో కేసులుండగా, ఎలాంటి నిర్మాణాలు చేపట్టకూడదనే నిబంధనలున్నా పట్టించుకాకుండా నిర్మాణాలు చేసింది. ఫైనల్ డిక్రీ రాకుండానే ఈ భూములలో నిర్మాణాలు ఎలా చేపడుతున్నారని పై వ్యాజ్యాన్ని విచారిస్తున్న సందర్భంగా విస్మయం వ్యక్తం చేసింది సుప్రీం కోర్టు. ప్రహరీతో పాటు లోపల చేపట్టిన నిర్మాణాల తొలగించి ప్రభుత్వ భూమిగా పేర్కొంటూ బోర్డులు ఏర్పాటు చేసింది హైడ్రా.




# పనిచేయని మొబైల్, టీవీ, ఏసీ ఏదైనా పర్లేదు ప్రభుత్వం కొనేస్తుంది..!



**న్యూఢిల్లీ-నవభూమి:**మీ పాత మొబైల్ పనిచేయడం లేదని ఇంట్లో వదిలేశారా? పాడైపోయిన టీవీ ఇంట్లో అడ్డంగా ఉండిపోయిందా? వాషింగ్ మెషిన్, ఫ్రిడ్జ్ ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు పనిచేయపోతే ఏం చేస్తారు..? పాత సామాన్లు, పాడైపోయిన వస్తువులను కొనుగోలు చేసే వ్యాపారులు కూడా వాటిని తీసుకోవడం లేదని పారేస్తున్నారా? ఇకపై మీకు ఆ అవసరం ఉండదు. చెత్త నుంచి సంపద సృష్టించడం ద్వారా సర్క్యులర్ ఎకానమీకి ప్లాన్ చేస్తున్న ఏపీ ప్రభుత్వం ఈ-వేస్ట్ ను కొనుగోలు చేయాలని నిర్ణయించింది. ఇందుకోసం రాష్ట్రవ్యాప్తంగా 222 ఈ-వ్యర్థాల సేకరణ కేంద్రాలను ఏర్పాటు చేసి వాటిని స్వయం సహాయక సంఘాలకు అప్పగించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ విషయాన్ని మంత్రి నారాయణ స్వయంగా ప్రకటించారు. రాజ్ కసిరెడ్డి సంచలన ఆడియో స్వర్ణాంధ్ర-2047 సంకల్పంలో భాగంగా ప్రభుత్వం ప్రతి నెలా మూడో శనివారం స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా ఈ శనివారం ఇ-థీమ్ ను ఏపీ ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఇళ్లల్లో పేరుకుపోయిన ఆరు బయట పారేస్తున్న ఎలక్ట్రానిక్ వ్యర్థాలను రీ సైకిల్ చేయడం ద్వారా పర్యావరణాన్ని కాపాడటంతోపాటు రీ సైకలింగ్ ద్వారా పెద్ద ఎత్తున ఉద్యోగాలు కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడికక్కడ ఈ-వ్యర్థాల సేకరణ కేంద్రాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. రెడ్యూస్, రీయూజ్, రీసైకిల్ అనే నినాదంతో ఈ-వ్యర్థాల సేకరణ కేంద్రాలు పనిచేస్తాయి. స్వయం సహాయక సంఘాల మహిళల ద్వారా ఎలక్ట్రానిక్ వ్యర్థాలను సేకరించి వాటికి డబ్బు కూడా చెల్లించనున్నారు. ఈ వ్యర్థాలను శాస్త్రీయ పద్ధతిలో రీసైకిల్ చేసి పునర్వినియోగించేలా చేస్తామంటున్నారు. ఈ-వ్యర్థాలు ఆరు బయట పారేయడం వల్ల పర్యావరణానికి తీవ్ర హాని జరుగుతోంది. అదే శాస్త్రీయ పద్ధతిలో వాటిని డిస్పోజ్ చేయడం ద్వారా విలువైన లోహాలను సేకరించేందుకు అవకాశం ఉందంటున్నారు. బంగారం, వెండి, ఇత్తడి వంటి లోహాలు కూడా ఈ-వేస్ట్ లో ఉన్నట్లు ప్రభుత్వం చెబుతోంది. కేంద్ర ప్రభుత్వం కూడా ఈ-వేస్ట్ నిర్వహణపై ఫోకస్ చేయడం.. స్వచ్ఛ భారత్ అభియాన్ కింద ఎలక్ట్రానిక్ వ్యర్థాలను తగ్గించేలా భారీగా నిధులు కేటాయిస్తుండటంతో రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర నిధులను సద్వినియోగం చేసుకోవాలని నిర్ణయించింది. రాష్ట్రవ్యాప్తంగా మున్సిపాలిటీలు, గ్రామీణ ప్రాంతాల్లో 222 కేంద్రాలను ఏర్పాటు చేసి ఇ-చెక్ అనే పేరుతో ఎలక్ట్రానిక్ వ్యర్థాలను సేకరిస్తారు. పాత, పనికి రాని ఎలక్ట్రానిక్ వస్తువులకు ప్రభుత్వం డబ్బు ఇచ్చి కొనుగోలు చేస్తామని చెప్పడంతో ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన వస్తుందని ఆశిస్తున్నారు. ఇదే సమయంలో ఎలక్ట్రానిక్ వ్యర్థాలు భారీగా తగ్గే అవకాశం ఉంటుందని చెబుతున్నారు.

## నటి ఫిర్యాదు, సీపీటీవీ దృశ్యాలు.. మొత్తానికి దసరా మూవీ విలన్ అరెస్ట్



**న్యూఢిల్లీ-నవభూమి:**మలయాళ నటుడు, దేవర మూవీలో నటుడిగా, నాని హీరోగా నటించిన దసరా మూవీలో విలన్‌గా షైన్ టామ్ చాకో తెలుగు ప్రేక్షకులకు కూడా బాగా పరిచయం. చాకోను ఇవాళ (శనివారం) మాదకద్రవ్యాల వాడకం ఆరోపణలకు సంబంధించి కేరళ పోలీసులు అరెస్టు చేశారు. అధికారులు చెబుతున్న వివరాల ప్రకారం, చాకోపై నార్కోటిక్ డ్రగ్స్, సైకోట్రోపిక్ సబ్‌స్టాన్సెస్ చట్టంలోని సెక్షన్లు 27 (మాదకద్రవ్యాలు లేదా సైకోట్రోపిక్ పదార్థాల వినియోగం) మరియు సెక్షన్ 29 (ప్రేరణ మరియు నేరపూరిత కుట్ర) కింద కేసు నమోదు చేశారు. తదుపరి చట్టపరమైన చర్యలతో పాటు త్వరలో వైద్య పరీక్ష నిర్వహిస్తామని అధికారులు తెలిపారు. అయితే, ఈ కేసులో చాకో బెయిల్ పొందే అవకాశం ఉంది.ఇలా ఉండగా, కొచ్చి నగర పోలీసులు సమన్లు ??జారీ చేసిన నేపథ్యంలో చాకో ఈ ఉదయం నార్త్ పోలీస్ స్టేషన్‌లో దర్యాప్తు బృందం ముందు హాజరయ్యారు. ఆయన తన న్యాయవాదులతో కలిసి ఉదయం 10 గంటల ప్రాంతంలో స్టేషన్‌కు చేరుకు న్నారు. బుధవారం జిల్లా యాంటీ-నార్కోటిక్ స్పెషల్ యాక్షన్ టాస్క్ ఫోర్స్ (డాన్సాఫ్) నిర్వహించిన దాడిలో హోటల్ నుండి పారిపోయినట్లు టామ్ చాకో ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. దీనికి సంబంధించే ప్రధానంగా పోలీసులు టామ్ ను ప్రశ్నలు సంధించినట్టు సమాచారం.వినోద పరిశ్రమలో మాదకద్రవ్యాల వాడకాన్ని నిరోధించడానికి ఎలాంటి చర్యలు తీసుకో వాలి? దీనిపై అవగా హనా కార్యక్రమాలు, కఠినమైన నిబంధనలు, తనిఖీలకు సంబం ధించి కూడా పోలీసులు చాకోను ప్రశ్నించినట్టు తెలుస్తోంది. ముఖ్యంగా హోటల్‌లో లభ్యమైన సీసీ టీవీ ఫుటేజ్ ఆధారంగా పోలీసులు టామ్ చాకోను ప్రశ్నించారు. బుధవారం రాత్రి, పోలీసులు వచ్చారని గ్రహించిన చాకో తన హోటల్ గది మూడవ అంతస్తు కిటికీ నుండి రెండవ అంతస్తు టెర్రస్‌కు దూకినట్లు దృశ్యాలు ఉన్నాయి. అక్కడి నుండి, అతను స్విమ్మింగ్ పూల్ లోకి దూకి పారిపోయాడు. ఈ రహస్యాలన్నీ పోలీసులు సీసీ టీవీ కెమెరా ఫుటేజ్ ఆధారంగా నిర్ధారణకు వచ్చారు.అయితే, విచారణ సమయంలో టామ్ చాకో వివరణ మరో విధంగా ఉంది. హోటల్ తలుపు వద్ద పోలీసు అధికారులు ఉన్నారని తాను అనుకోలేదని, వచ్చిన వారు తనపై దాడి చేయడానికి ప్రయత్నిస్తున్న దుండగులు అని భావించానని చాకో చెప్పాడని పోలీసులు అంటున్నారు. అందుకోసమే తాను హోటల్ నుంచి తప్పించుకున్నానని టామ్ అంటున్నాడు.పోలీస్ దర్యాప్తులో భాగంగా, పోలీసులు టామ్ చాకో కాల్ డేటా రికార్డులు, టెక్స్టింగ్(అతని మెసేజెస్) హిస్టరీని సేకరించినట్లు చెబుతున్నారు. ఎర్నాకులం సెంట్రల్ అసిస్టెంట్ కమిషనర్ సి జయకుమార్, నార్కోటిక్ సెల్ అసిస్టెంట్ కమిషనర్ కె ఎ అబ్దుల్ సలాం నేతృత్వంలోని బృందం అతన్ని విచారించింది.ఇక, దాడులు జరిపిన హోటల్ నుండి మాత్రం పోలీసులు ఎటువంటి మాదకద్రవ్యాలు స్వాధీనం చేసుకోలేకపోయారు. దీంతో సదరు హోటల్ మీద పోలీసులు ఎలాంటి కేసు నమోదు చేయలేదు.ఇదిలా ఉంటే, మలయాళ ప్రముఖ నటి విన్సీ అలోషియస్ ఇటీవలే ఫిల్మ్ ఛాంబర్‌లో టామ్ చాకో మీద ఫిర్యాదు చేసింది. మాదకద్రవ్యాల ప్రభావంతో చాకో "అనుచిత ప్రవర్తన" చేశాడని ఆరోపించింది. ఈ విషయాన్ని నటి.. మలయాళ మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ కి కూడా నివేదించింది. అయితే ఆమె పోలీసులకు ఫిర్యాదు చేయలేదు. కాగా, వీరిద్దరి మధ్య జరిగిన ఈ ఘటన ఇంకా రిలీజ్ కాని "సూత్రవాక్యం" అనే సినిమా సెట్స్‌లో జరిగిందని తెలుస్తోంది.

## ఉక్రెయిన్‌లో భారత ఫార్మా సంస్థపై క్షిపణి దాడి.. రష్యా పనే..?



**న్యూఢిల్లీ-నవభూమి:**షెడ్యూల్ ఖరారైతే సరిగ్గా నెల రోజుల్లో భారత ప్రధాని మోదీ రష్యాలో పర్యటించనున్నారు. ఆ దేశ విక్టరీ డే పరేడ్ కు హాజరవనున్నారు. సహజంగా మోదీ ఏ దేశానికి వెళ్లినా భారత సంతతి ప్రజలు ఆయనకు స్వాగతం పలుకుతుంటారు. కాగా, రష్యా మూడేళ్ల రెండు నెలలుగా ఉక్రెయిన్ పై యుద్ధం చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ఆ దేశ మౌలిక వసతులను కూడా ధ్వంసం చేస్తోంది. ఉక్రెయిన్ రాజధాని కీవ్ ను కూడా వదలడం లేదు. తాజాగా కీవ్ లోని భారత ఫార్మా సంస్థ గోదాంపై క్షిపణి దాడి జరిగింది. ఇది ఎవరు చేశారనేది మాత్రం బయటపడడం లేదు. ఉక్రెయిన్ ఏమో రష్యా పనే అని ఆరోపిస్తోంది. రష్యన్ రాయబార కార్యాలయం మాత్రం.. ఉక్రెయిన్ వైమానిక దళం చేసిందని చెబుతోంది. బట్టేబాజ్ విజయసాయిరెడ్డి.. రాజ్ కసిరెడ్డి సంచలన ఆడియో కీవ్ లో కుసుమ్ హెల్త్ కేర్ అని ఓ ఫార్మా సంస్థ ఉంది. యజమాని రాజీవ్ గుప్తా. దీని 'గ్లాడ్ ఫార్మ్' యూనిట్ పై ఈ నెల 12న కుసుమ్ హెల్త్ కేర్ గోదాంపై క్షిపణి దాడి జరిగింది. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ సంఘటన వివరాలు చూస్తే.. ఓ క్షిపణి నేరుగా గోదాంను ఢీకొట్టింది. అది రష్యాదే అని ఉక్రెయిన్, కాదు ఉక్రెయిన్ దే అని రష్యా ఆరోపిస్తోంది. తమ సైన్యం ఎప్పుడూ భారత ఫార్మా సంస్థలను టార్గెట్ చేసుకోలేదని రష్యా చెబుతోంది. భారత్ లోని రష్యా రాయబార కార్యాలయం కూడా ఇది ఉక్రెయిన్ పనే అని పేర్కొంది. కుసుమ్ హెల్త్ కేర్ పై క్షిపణి దాడిలో ఆ సంస్థ భారీగా నష్టపోయింది. ఉక్రెయిన్ లోని అతిపెద్ద ఫార్మా సంస్థల్లో ఇది ఒకటి. ప్రాథమిక ఔషధాలను సరఫరా చేయడంలో ఇది కీలక పాత్ర పోషిస్తుంది. 12న కుసుమ్ ప్లాంట్ లో భారీగా మంటలు చెలరేగాయి. కంపెనీకి దాదాపు 25 మిలియన్ డాలర్ల నష్టం వాటిల్లింది. రష్యా ఔషధ యూనిట్లను, మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకుంటోందని ఉక్రెయిన్ ఆరోపించింది. అయితే, రష్యా మాత్రం ఉక్రెయిన్ క్షిపణి లక్ష్యాన్ని ఛేధించడంలో విఫలమై జనావాస ప్రాంతంలో పడిపోయిందని చెబుతోంది. తాము ఎప్పుడూ పౌర సౌకర్యాలను లక్ష్యంగా చేసుకోలేదని స్పష్టం చేసింది. ఉక్రెయిన్ పట్టణాల్లో వైమానిక రక్షణ వ్యవస్థలను మోహరిస్తున్నదని, దీంతో పౌరుల ప్రాణాలకు ముప్పు వాటిల్లుతోందని తెలిపింది. కాగా, యుద్ధంలో కుసుమ్ గ్రూప్ తమకు ఎంతో సాయం అందించిందని, అందుకే రష్యా దానిని లక్ష్యంగా చేసుకుందని ఉక్రెయిన్‌లోని భారత రాయబారి ఒలెక్సాండర్ పోలిష్‌చుక్ పేర్కొన్నారు.

## మహా కుంభ్‌మేళాకు టెంట్లు సప్లై చేసిన కంపెనీ వేర్‌హౌస్‌లో అగ్ని ప్రమాదం



**న్యూఢిల్లీ-నవభూమి:**అగ్ని ప్రమాదం జరగడానికి గ్యాస్ సిలిండర్ ప్రమాదమే కారణంగా తెలుస్తోంది. గోడౌన్‌లో పని చేసే రాహుల్ అనే వ్యక్తి తాను గ్యాస్ సిలిండర్ పేలిన శబ్దం విన్నట్లు తెలిపాడు. అయితే, ప్రమాదం ఎందుకు జరిగిందన్న దానిపై క్లారిటీ లేదు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. ప్రయాగ్‌రాజ్‌లో భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. మహా కుంభ్‌మేళాకు వివిధ రకాల టెంట్లు సరఫరా చేసిన ప్రముఖ కంపెనీ వేర్ హౌస్లో మంటలు చెలరేగాయి. ప్రయాగ్‌రాజ్లోని పెరేడ్ గ్రౌండ్‌లో శనివారం ఉదయం ఈ ప్రమాదం జరిగింది. పెద్ద మొత్తంలో టెంటింగ్ సామాన్లు మంటల్లో కాలిపోయాయి. మంటల్ని గమనించిన వేర్ హౌస్ సిబ్బంది వెంటనే అగ్నిమాపక దళానికి సమాచారం ఇచ్చారు. కొన్ని నిమిషాల్లోనే ఆరు ఫైర్ ఇంజిన్లు సంఘటనా స్థలానికి చేరుకున్నాయి. మంటల్ని అదుపు చేయటం మొదలెట్టాయి.కొద్దిసేపటి తర్వాత మరికొన్ని ఫైర్ ఇంజిన్లు అక్కడకు వచ్చాయి. మంటల్ని అతి కష్టం మీద అదుపులోకి తీసుకువచ్చాయి. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. పరిస్థితి సమీక్షించారు. ఈ అగ్ని ప్రమాదంలో ప్రాణ నష్టం జరగలేదు. ఎవరికీ గాయాలు కూడా కాలేదు. అగ్ని ప్రమాదం జరగడానికి గ్యాస్ సిలిండర్ పేలడమే కారణంగా తెలుస్తోంది. వేర్ హౌస్ దగ్గరలో ఉండే గోడౌన్‌లో పని చేసే రాహుల్ అనే వ్యక్తి ప్రమాదం గురించి మాట్లాడాడు. తాను గ్యాస్ సిలిండర్ పేలిన శబ్ధం విన్నట్లు తెలిపాడు.ఇక, ప్రయాగ్‌రాజ్ చీఫ్ ఫైర్ ఆఫీసర్ రాజీవ్ కుమార్ పాండే ఘటనపై మాట్లాడుతూ.. ' కర్రలు, టెంట్లు భద్ర పరిచిన చోటే ప్రమాదం జరిగింది. సమాచారం అందగానే ఆరు ఫైర్ ఇంజిన్లను పంపాం. ఆ తర్వాత మరికొన్ని ఫైర్ ఇంజిన్ల సహాయంతో మంటలు ఆర్పాము' అని అన్నారు. అయితే, ప్రమాదం ఎందుకు జరిగిందన్న దానిపై క్లారిటీ లేదు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. ప్రమాదం జరగడానికి గల అసలు కారణాల కోసం అన్వేషిస్తున్నారు. వేర్‌హౌస్‌లో పని చేసే సిబ్బందిని విచారిస్తున్నారు.

## ఇదేం బుద్ధి తల్లి.. అన్న వరుసయ్యే వ్యక్తితో మహిళ జంప్





**న్యూఢిల్లీ-నవభూమి:**సునీల్ కుమార్ లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. డ్యూటీకి వెళితే.. రెండు నెలలు ఇంటికి వచ్చే వాడే కాదు. ఇంటి ఖర్చుల కోసం డబ్బు పంపేవాడు. ఈ నేపథ్యంలోనే కూతురి మామ శైలేంద్రతో మమతకు సంబంధం ఏర్పడింది. ఇద్దరూ ఫోన్‌లో తరచుగా మాట్లాడుకునే వారు. తరచుగా ఏకాంతంగా కలిసేవారు.

కూతురి మామ( కూతురి భర్త తండ్రి)తో ఓ మహిళ సంబంధం పెట్టుకుంది. భర్తను, కుటుంబాన్ని కాదని అతడితో పారిపోయింది. ఈ సంఘటన ఉత్తర ప్రదేశ్‌లో చోటుచేసుకుంది. పోలీసులు, కుటుంబసభ్యులు చెప్పిన వివరాల మేరకు.. ఉత్తర ప్రదేశ్‌లోని బదౌన్‌కు చెందిన సునీల్ కుమార్, మమతా భార్యాభర్తలు. వీరికి 2002లో పెళ్లయింది. వీరికి నలుగురు పిల్లలు ఉన్నారు. 2022లో వీరి పిల్లల్లో ఒకమ్మాయికి పెళ్లయింది. ఇక, సునీల్ కుమార్ లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. డ్యూటీకి వెళితే.. రెండు నెలలు ఇంటికి వచ్చే వాడే కాదు. ఇంటి ఖర్చుల కోసం డబ్బు పంపేవాడు. ఈ నేపథ్యంలోనే కూతురి మామ శైలేంద్రతో మమతకు సంబంధం ఏర్పడింది.ప్రతీ మూడు రోజులకు ఒకసారి శైలేంద్ర మమత ఇంటికి వచ్చే వాడు. ఆ టైంలో మమత తన పిల్లల్ని వేరే రూముకు పంపేది. శైలేంద్ర తెల్లవారే వరకు ఇంట్లోనే ఉండే వాడు. తర్వాత వెళ్లిపోయేవాడు. పొరిగిళ్లలో ఉండే వారు అతడ్ని చూసేవారు. శైలేంద్ర .. మమతకు బంధువు అవ్వటం.. అది కూడా అన్న వరుస అవ్వటంతో పెద్దగా పట్టించుకోలేదు. అయితే, ఎలా తెలిసిందో ఈ విషయం భర్తకు తెలిసింది. ఆమెను మందిలించాడు. దీంతో మమత, శైలేంద్ర ఇంట్లోనుంచి పారిపోయారు. విషయం తెలిసి రెండు కుటుంబాల వారు షాక్ అయ్యారు. సునీల్ కుమార్ ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.కాబోయే అల్లుడితో అత్త జంప్..ఉత్తర ప్రదేశ్, అలీఘర్‌కు చెందిన స్వప్న అనే మహిళ కూతు రికి కాబోయే భర్తతో ఇంటినుంచి పారిపో యింది. పెళ్లికి పది రోజుల ముందు కాబోయే అల్లుడు రాహుల్‌తో వెళ్లిపోయింది. పోలీసులు వారి కోసం వెతుకుతు న్నారని తెలియటంతో.. ఊరికి వచ్చేశారు. పోలీసుల దగ్గరకు వెళ్లారు. ఎందుకు లేచిపో వాల్సి వచ్చిం దో వారికి వివరించి చెప్పారు. త్వరలో ఇద్దరూ పెళ్లి చేసుకోబోతున్నట్లు తెలిపారు. అయితే, స్వప్న కుటుంబం సభ్యులు ఆమెను ఎట్టి పరిస్థితుల్లో ఇంటికి తిరిగి రానిచ్చేది లేదని తేల్చి చెప్పారు.

## 42 ఏళ్ల వ్యక్తికి 22 ఏళ్ల యువతితో వివాహం.. అడ్డుకున్న భక్తులు!

**అన్నవరం-నవభూమి:** పెళ్లి అనేది రెండు మనసులు ఒక్కటయ్యే వేడుక. ఇద్దరు వ్యక్తులు తమ జీవితాలను ఒకరితో ఒకరు పంచుకునేందుకు తీసుకునే అందమైన నిర్ణయం. అలాంటి పెళ్లికి ఈడుజోడు సరిపోవాలి. పెళ్లి చేయాలంటే ఏడు తరాలు అటు, ఏడు తరాలు ఇటు చూడాలని అంటారు పెద్దలు. అలాంటి బలవంతంగా పెళ్లి చేసుకుంటే భార్యభర్తలు ఇద్దరూ జీవితాంతం నరకం అనుభవించాల్సి ఉంటుంది. వారు కోరుకున్న క్వాలిటీస్ ఉన్నవారు దొరకక పోతే ఆ బాధ వర్ణణాతీతం. పేరెంట్స్ బలవంతంగా పెళ్లి చేసినా తర్వాత అనుభవించేది మాత్రం ఆ వధూవరులే. అలాంటి ఓ పెళ్లిని అన్నవరంలో స్థానిక భక్తులు అడ్డుకున్నారు. రాజ్ కసిరెడ్డి సంచలన ఆడియో తూర్పు గోదావరి జిల్లాలోని ప్రఖ్యాత అన్నవరం సత్యనారాయణ స్వామి దేవస్థానం నిన్న పెళ్లి సందడితో నిండిపోయింది. ఎటు చూసినా పెళ్లి బంధంతో ఒక్కటవ్వబోతున్నజంటలు కనిపించాయి. కానీ, ఈ సంతోషకరమైన వాతావరణం ఉన్నట్లుండి విషాదంలోకి మారిపోయింది. ఆలయ ప్రాంగణంలో జరుగుతున్న ఒక పెళ్లి తంతు అందరి దృష్టిని ఆకర్షించింది. పెళ్లి పీటలపై కూర్చున్న వధువు ఏడుస్తూ కనిపించడంతో అక్కడ ఉన్న భక్తులు, భద్రతా సిబ్బంది ఒక్కసారిగా అప్రమత్తం అయ్యారు. పూర్తి వివరాల్లోకి వెళితే.. అన్నవరం దేవస్థానంలో ఒక 22 ఏళ్ల యువతికి 42 ఏళ్ల వ్యక్తితో వివాహం జరిపించేందుకు ఏర్పాట్లు చేశారు. పెళ్లి తంతు జరుగుతుండగా, పెళ్లి పీటలపై వధువు బిగ్గరగా ఏడుస్తుండడం చూసిన కొందరు భక్తులు అనుమానం వ్యక్తం చేశారు. పెళ్లి చేసుకోవాల్సిన అమ్మాయి ఆనందంగా ఉండాల్సింది పోయి.. అమ్మాయి ఎందుకు అంతలా బాధపడుతోందని వారు ఆరా తీయడం మొదలుపెట్టారు. అదే సమయంలో ఆలయ భద్రతా సిబ్బంది కూడా ఆ ప్రాంతానికి చేరుకున్నారు. సీఎం సీటు నుంచి దించేస్తం" పెళ్లి పీటలపై ఏడుస్తున్న యువతిని చూసిన ఒక మహిళా భక్తురాలు ఆమెను దగ్గరకు వెళ్లి విషయం అడిగి తెలుసుకునేందుకు ప్రయత్నించింది. మొదట భయపడిన ఆ యువతి, తర్వాత తన గోడు వెళ్లబోసుకుంది. తన ఇష్టం లేకుండా ఈ పెళ్లి చేస్తున్నారని కన్నీటితో చెప్పింది. ఈ విషయం తెలిసిన వెంటనే భక్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది బాల్య వివాహం కాదని స్పష్టంగా తెలుస్తున్నా, ఒక యువతిని బలవంతంగా వివాహం చేసుకోవడానికి ప్రయత్నించడం దారుణమంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

# తిరుమల శ్రీవారిని దర్శించుకున్న హీరోయిన్ సమంత



టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత నిర్మాణంలో రాబోతున్న తాజా చిత్రం 'శుభం'. 'చచ్చినా చూడాల్సిందే' అనేది క్యాప్షన్. ఈ సినిమాకు 'సినిమా బండి'ఫేమ్ ప్రవీణ్ కాండ్రేగుల దర్శకత్వం వహిస్తుండగా.. హర్షిత్‌రెడ్డి, శ్రీయా కొంతం, గవిరెడ్డి శ్రీనివాస్ తదితరులు ఇందులో ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. మే 09 ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సందర్భంగా వరుస ప్రమోషన్స్ చేస్తుంది చిత్రబృందం. ట్రాలాలా బ్యానర్‌పై నిర్మాతగా సామ్ ఫస్ట్ మూవీ కావడంతో భారీ అంచనాలున్నాయి. అయితే ఈ సినిమా విజయం సాధించాలని తాజాగా సామ్‌తో పాటు చిత్రయూనిట్ అంతా కలిసి తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు.నేడు ఉదయం తిరుమలకు చేరుకున్న సామ్‌తో పాటు శుభం చిత్రబృందానికి టీటీడీ ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. సామ్ క్రిస్టియన్ కావడంతో దర్శనంకి ముందు టీటీడీ డిక్లరేషన్‌పై సంతకం చేసిన ఆమె అనంతరం స్వామివారి సేవలో పాల్గొని మొక్కులు చెల్లించుకుంది. అనంతరం రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనం చేసి శాలువాతో సత్కరించారు. స్వామి వారి తీర్థప్రసాదాలు, చిత్ర పటం అందజేశారు.



# ఇలాంటి వ్యూ కనిపిస్తే హాలిడేనే!






రీసెంట్ గా ఓదెల2 సినిమాతో ప్రేక్షకుల ముందుకొచ్చిన మిల్కీ బ్యూటీ తమన్నా తన హాలిడేను ఎలా ఆస్వాదించిందో తెలుపుతూ ఇన్‌స్టాలో ఓ వీడియోను పోస్ట్ చేసింది. ఆ వీడియోలో గార్డెన్ లో బాతులు నడుస్తున్న ఒక ప్రశాంతమైన సీనిక్ వ్యూ కనిపించింది. రూమ్ బయట బాతులు కనిపించినప్పుడే మనకు హాలిడే అని తెలుస్తోందంటూ తమన్నా షేర్ చేసిన వీడియో ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతుంది.తాజాగా ఓదెల2 అనే సూపర్ నేచురల్ థ్రిల్లర్ తో ఆడియన్స్ ను పలకరించిన తమన్నా ఆ సినిమాలో తన నటనకు మంచి పేరు తెచ్చుకుంది. ఈ సినిమా షూటింగ్ టైమ్ లో తమన్నా చెప్పులు కూడా లేకుండా నడిచిందని, ఈ మూవీ కోసం తమన్నా పూర్తి వెజిటేరియన్ గా మారడంతో పాటూ సినిమా కోసం ఎంతగానో కష్టపడిందని ఓదెల2 స్టోరీ రైటర్ మరియు ప్రెజెంటర్ సంపత్ నంది వెల్లడించాడు.తమన్నా నాగ సాధువుగా నటించిన ఈ సినిమాలోని ఆ లుక్ వెనుక ఎంతో కష్టముందని, దాని కోసం మూడు డిఫరెంట్ లుక్స్ ను ట్రై చేసినట్టు సంపత్ నంది తెలిపాడు. తమన్నా ఎంతో అందంగా, తెల్లగా ఉంటుంది. కానీ నాగ సాధువులు ఎప్పుడూ ఎండలో ఉండటం వల్ల వాళ్ల స్కిన్ టోన్ భిన్నంగా ఉంటుంది. దీంతో తమన్నా కోసం ఎన్ని మేకప్స్ వాడినా, అవి రియలిస్టిక్ ఫీల్ ను తీసుకురాలేకపోయాయని ఆయన చెప్పాడు.అయితే నాగసాధువుల్లో కూడా ఫారినర్స్ ఉంటారు కాబట్టి వారు తెల్లగానే ఉంటారు కదా అనిపించిందని సంపత్ తెలిపాడు. ఎండలోకి రాగానే తమన్నా స్కిన్ టోన్ పింక్ కలర్ లోకి మారుతుందని, దీంతో సినిమాలో మేకప్ లేకుండా తమన్నాను చూపిద్దామనుకుని డిసైడ్ అయి, డిజైనర్ నీతా లుల్లాకు తాను అనుకున్న రిఫరెన్స్ కాస్ట్యూమ్స్ ను పంపగా, ఆమె కొన్ని డిజైన్స్ చేసిందని, వాటిలో అందరూ చూస్తున్న లుక్ ను ఫైనల్ చేసినట్టు సంపత్ నంది తెలిపాడు. ఆ లుక్ కోసం అందరూ ఎంతో కష్టపడ్డామని, చాలా టైమ్ లుక్ ను ఫైనల్ చేయడానికే పట్టిందని, తమన్నా ఎంతో గొప్ప నటి కాబట్టి ఆ పాత్రను చేయగలిగిందని ఆయన వెల్లడించాడు. అయితే ఎంత కష్టపడినప్పటికీ తమన్నాకు ఓదెల2తో అనుకున్న ఫలితం మాత్రం అందుకోలేకపోయింది.

# ప్రభాస్‌తో అనుష్క క్లోజ్ ఫొటో.. ఇలా తయారయ్యారెందుకు?



ప్రభాస్- అనుష్క ఈ జంట పలు సినిమాలలో నటించి బెస్ట్ పెయిర్‌గా మంచి పేరు తెచ్చుకుంది. వారు సినిమాలలోనే కాదు నిజ జీవితంలోను జట్టు కడితే చూడాలని ఎంతో మంది ఫ్యాన్స్ అనుకుంటున్నారు. కొన్నాళ్లుగా వారిద్దరి రిలేషన్ గురించి నెట్టింట అనేక వార్తలు హల్‌చల్ చేస్తుంటాయి. వారిద్దరు ప్రేమలో ఉన్నారని, త్వరలో పెళ్లి పీటలు కూడా ఎక్కబోతున్నారని ప్రచారం జరిగింది. అంతేకాదు ఇటీవలే ఏఐతో వీరిద్దరి పెళ్లి ఫొటోలను క్రియేట్ చేయడంతోపాటు వారికి పిల్లలు కూడా ఉన్నట్లు సృష్టించారు. ఇలా ప్రభాస్ అనుష్కలకి సంబంధించి నెట్టింట ఏదో ఒక ప్రచారం నడుస్తూనే ఉంటుంది. అయితే తాజాగా ప్రభాస్, అనుష్క క్లోజ్ ఫొటోలని తెగ వైరల్ చేస్తున్నారు. ఇందులో ప్రభాస్ , అనుష్క హగ్ చేసుకున్నట్టుగా ఉంది.ఏఐ సాయంతో ఈ ఫొటోలని రూపొందించినట్టు చెబుతున్నారు. ఇది చూసిన నెటిజన్స్.. ఎందుకు రా ఇలా తయారయ్యారు. ఫేక్ ఫొటోలని క్రియేట్ చేసి ఎందుకు ఇలా రచ్చ చేస్తున్నారు అంటూ మండిపడుతున్నారు. ఏది ఏమైన ఈ పిక్స్ మాత్రం సోషల్ మీడియాని షేక్ చేస్తున్నాయి. ఇక ఇప్పటికే ఎన్నోసార్లు డార్లింగ్ పెళ్లి గురించిన చర్చ సోషల్ మీడియాలో వైరలయ్యింది.

# ఎర్ర చీర కట్టులో సంయుక్త



మలయాళ సినిమా పాప్‌కార్న్‌తో దాదాపు దశాబ్ద కాలం క్రితం సినిమా ఇండస్ట్రీలో అడుగు పెట్టిన ముద్దుగుమ్మ సంయుక్త మీనన్. వరుసగా మలయాళ సినిమాలు చేస్తూ వచ్చిన ఈమెకు 2018లో కలరి అనే తమిళ సినిమాలో నటించే అవకాశం దక్కింది. అత్యధిక మలయాళ సినిమాల్లో నటించిన సంయుక్త మీనన్ ఆ తర్వాత తమిళ్‌లో ఎక్కువ సినిమాల్లో నటించింది. ఈ అమ్ముడు తెలుగు ప్రేక్షకులకు కూడా పలు సినిమాలతో సుపరిచితురాలు అయింది. తెలుగులో ఈమె భీమ్లా నాయక్ సినిమాలో ముఖ్య పాత్రలో నటించడం ద్వారా టాలీవుడ్‌లో ఎంట్రీ ఇచ్చింది. తెలుగు సినిమా ఇండస్ట్రీలో ఈ అమ్మడికి విరూపాక్ష సినిమాతో భారీ విజయం దక్కింది. తెలుగులో వరుసగా సార్, విరూపాక్ష, బింబిసార సినిమాలతో సక్సెస్‌లు దక్కాయి. దాంతో ఈ అమ్మడు ఎక్కువ ఆఫర్లు దక్కించుకుంది. ప్రస్తుతం తెలుగులో ఈమె మూడు సినిమాల్లో నటిస్తోంది. మూడు సినిమాలు సైతం ఈ ఏడాదిలోనే ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశాలు ఉన్నాయి. భారీ అంచనాల నడుమ రూపొందుతున్న అఖండ 2 సినిమాలోనూ ఈమె కీలక పాత్రలో కనిపించబోతుందనే వార్తలు వస్తున్నాయి. ఇప్పటి వరకు ఆ విషయమై అధికారికంగా క్లారిటీ రాలేదు. నారి నారి నడుమ మురారి సినిమాలోనూ ఈమె నటిస్తున్న విషయం తెల్సిందే. గతంతో పోల్చితే తెలుగులో ఈ సారి మరిన్ని క్రేజీ ప్రాజెక్ట్‌లు చేస్తున్న సంయుక్త మీనన్ సోషల్ మీడియాలో వైరల్ అయింది. రెగ్యులర్‌గా సోషల్ మీడియా ద్వారా ముఖ్యంగా ఇన్‌స్టాగ్రామ్ ద్వారా సంయుక్త మీనన్ తన అందమైన ఫోటోలను షేర్ చేస్తూ ఉంటుంది. ఇన్‌స్టాగ్రామ్‌లో దాదాపుగా 3.3 మిలియన్‌ల ఫాలోవర్స్‌ను కలిగి ఉన్న విషయం తెల్సిందే. ఇన్‌స్టాగ్రామ్‌లో రెగ్యులర్‌గా అందమైన ఫోటోలను షేర్ చేయడం ద్వారా వార్తల్లో నిలుస్తూ ఉంటుంది. తాజాగా ఈమె మరోసారి తన అందమైన ఫోటోలను షేర్ చేసింది. ఈసారి చీర కట్టు ఫోటోలతో సర్‌ప్రైజ్ చేసింది. ఆకట్టుకునే అందమైన ఎర్ర చీర కట్టు ఫోటోలతో సంయుక్త మీనన్ వైరల్ అవుతోంది. స్లీవ్‌లెస్ బ్లౌజ్ ధరించి, రెడ్ చీర కట్టులో అందంగా ఫోటోలకు ఫోజ్ ఇచ్చిన సంయుక్త మీనన్ అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. 2016లో షైన్ టామ్ చాకో కు జోడీగా పాప్‌కార్న్ సినిమాలో నటించడం ద్వారా ఇండస్ట్రీకి పరిచయం అయింది. తక్కువ సమయంలోనే సంయుక్తకి మలయాళ సినిమా ఇండస్ట్రీలో మంచి గుర్తింపు దక్కింది. ఏడాదికి రెండు మూడు సినిమాలు చేస్తూ వచ్చింది. ఆకట్టుకునే అందంతో పాటు, మంచి ఫిజిక్ ఉన్న సంయుక్త మీనన్ కాస్త ఆలస్యంగా టాలీవుడ్‌లో ఎంట్రీ ఇచ్చినప్పటికీ ఇప్పుడు వరుస సినిమాలతో దూసుకు పోతుంది. అందమైన ఈ మలయాళి ముద్దుగుమ్మ టాలీవుడ్‌లో రాబోయే రెండు మూడు ఏళ్లలో వరుస సినిమాలతో ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశాలు ఉన్నాయి. ఇలాంటి అందమైన ఫోటోలను షేర్ చేస్తే మరిన్ని సినిమా ఆఫర్లు వస్తాయనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది.

# రష్మిక 'నో' చెప్పకుంటే కష్టమే..!



నేషనల్ క్రష్ రష్మిక మందన్న కెరీర్ ప్రస్తుతం పీక్స్‌లో ఉంది. యానిమల్, పుష్ప 2, ఛావా సినిమాలతో బ్యాక్ టు బ్యాక్ భారీ విజయాలను సొంతం చేసుకుంది. ఆ మూడు సినిమాలతో రెండేళ్ల కాలంలో రష్మిక ఏకంగా రూ.3300 కోట్ల వసూళ్లను తన ఖాతాలో వేసుకుంది. మరే హీరోయిన్‌కి ఈ రికార్డ్ సాధ్యం కాలేదు, భవిష్యత్తులో అయినా సాధ్యం కాకపోవచ్చు. అలాంటి క్రేజ్‌ను దక్కించుకున్న రష్మిక మందన్న ఇటీవల సల్మాన్ ఖాన్‌తో నటించిన 'సికిందర్' సినిమాతో వచ్చింది. సల్మాన్ ఖాన్‌తో నటించడం తన డ్రీమ్ అంటూ ప్రమోషన్స్ సమయంలో చెప్పుకొచ్చిన రష్మిక మందన్న ఫలితం తర్వాత ఏం అంటుంది అంటూ చాలా మంది సోషల్ మీడియా ద్వారా ప్రశ్నిస్తున్నారు. సికిందర్ సినిమాలో సల్మాన్ ఖాన్‌కు జోడీగా రష్మిక నటించడంను చాలా మంది తప్పుబట్టారు. ఇద్దరి మధ్య వయసు తేడా చాలా ఉంది. ఇలాంటి కాంబినేషన్‌లను ఎలా ఆధరిస్తారు, ప్రేక్షకులు ఎలా ఇలాంటి వారి సినిమాలను చూస్తారు అంటూ కొందరు ట్రోల్ చేశారు. ఆ సమయంలో సల్మాన్ ఖాన్, రష్మిక మందన్న కూడా స్పందించారు. తాను సల్మాన్ ఖాన్‌తో నటించే అవకాశం దక్కించుకున్నాను అంటే కచ్చితంగా నేను పెద్ద విజయాన్ని సాధించినట్లే అంది. సల్మాన్ ఖాన్ గత దశాబ్ద కాలంగా ఫామ్ లేక కొట్టు మిట్టాడుతున్నాడు. ఆ విషయం రష్మిక కి తెలియనిది కాదు. అయినా కూడా రష్మిక సికిందర్ సినిమాకు ఓకే చెప్పడానికి కారణం మొహమాటం అయి ఉంటుందని చాలా మంది కామెంట్ చేస్తున్నారు. రష్మిక మందన్న కేవలం 'నో' చెప్పలేక పోవడం వల్లే సికిందర్ ఫ్లాప్‌ను నేడు మోయాల్సిన పరిస్థితి వచ్చిందని, వరుస విజయాలతో వెలు_న్న రష్మికకి ఆ ఫ్లాప్ కచ్చితంగా గట్టి ఎదురు దెబ్బ అనే టాక్ వినిపిస్తుంది. వరుస విజయాలు దక్కించుకున్న రష్మిక మందన్న సినిమాల ఎంపిక విషయంలో మొహమాట పడితే కచ్చితంగా భవిష్యత్తులో ఇబ్బందులు తప్పవు అనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. స్టార్ హీరో సినిమా అని, ప్రముఖ బ్యానర్ అని, పెద్ద దర్శకుడు అని కథ వినకుండా, పాత్రకు ప్రాముఖ్యత లేకుండా సినిమాలు చేస్తే కచ్చితంగా నష్టపోవాల్సి వస్తుంది. ఆ విషయాన్ని రష్మిక మందన్న గుర్తించకుంటే కచ్చితంగా ఇమేజ్‌కి డ్యామేజీ తప్పదనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. ప్రస్తుతం రష్మిక నటించిన 'కుబేరా' సినిమా విడుదలకు సిద్ధం అవుతోంది. మరో వైపు గర్ల్‌ఫ్రెండ్ సినిమా సైతం రెడీ అవుతోంది. ఇక హిందీలో ఈమె థామా అనే సినిమాను సైతం కమిట్ అయింది. ఆ సినిమా ఫలితం ఎలా ఉంటుందా అనే ఆసక్తి అందరిలోనూ కనిపిస్తుంది. హిందీలో రాణించాలంటే గ్లామర్ షో ఒక్కటి సరిపోదు, కమర్షియల్ విజయాలు దక్కడంతో పాటు నటనతో మెప్పించాల్సి ఉంటుంది. సికిందర్ వంటి సినిమాల్లో నటిస్తే రష్మిక మందన్న కెరీర్ బాలీవుడ్‌లో బ్రేక్ పడే అవకాశాలు ఉన్నాయనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. రష్మిక ఇకపై అయినా కథ నచ్చని సినిమాలకు, పాత్రకు ప్రాముఖ్యత లేని సినిమాలకు నో చెప్పడం నేర్చుకుంటే మంచిదనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. నో చెప్పకుండా మొహమాటంతో ఓకే చెప్తే కష్టాలు తప్పవనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది.

# ఎన్టీఆర్ వండే ఆ రెండు చాలా ఇష్టం..!



యంగ్ టైగర్ ఎన్టీఆర్ పలు సందర్భాల్లో తనకు వంట చేయడం అంటే చాలా ఇష్టం అంటూ చెప్పుకొచ్చిన విషయం తెల్సిందే. తెలుగు బిగ్ బాస్ మొదటి సీజన్‌కి హోస్ట్‌గా వ్యవహరించిన సమయంలో ఒక సారి హౌస్‌లోకి వెళ్లి కంటెస్టెంట్స్‌కి తన చేతులతో వండి పెట్టిన విషయం తెల్సిందే. ఒత్తిడిలో ఉన్న సమయంలో వంట చేస్తే తనకు చాలా రిలాక్స్‌గా ఉంటుందని, వంట చేసి ఎదుటి వారికి వడ్డించి వారు తింటూ ఉంటే చాలా సంతోషంగా ఉంటుందని కూడా ఎన్టీఆర్ చెప్పుకొచ్చారు. హీరోల్లో అతి కొద్ది మంది మాత్రమే ఇలాంటి అలవాటు కలిగి ఉంటారు. ఒకవేళ వంట చేసే ఆసక్తి, అభిరుచి ఉన్నప్పటికీ చాలా మంది బయటకు చెప్పుకోక పోవచ్చు. ఎన్టీఆర్ మాత్రం ఎప్పుడూ తన వారి కోసం వండి పెడుతూ, వారు తింటే సంతోషిస్తూ ఉంటాడు. ఒక్క రకం అని కాకుండా చాలా రకాల వంటలను ఎన్టీఆర్ చేస్తాడు. ఆయన చేతి వంట తిన్న వారు చాలా మంది వావ్ అన్నారు. ఆ మధ్య మ్యాడ్ 2 సినిమా ప్రమోషన్ సమయంలో నార్నె నితిన్ మాట్లాడుతూ ఎన్టీఆర్ చేసే వంట గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. బావ చేసిన ఎలిపాయ కారం తనకు చాలా ఇష్టం అన్నాడు. ఇప్పుడు నందమూరి కళ్యాణ్ రామ్ ఆ విషయమై మాట్లాడాడు. తమ్ముడు కి వంట అంటే చాలా ఇష్టం అంటూ కళ్యాణ్ రామ్ కూడా చెప్పుకొచ్చాడు. ఎన్టీఆర్ చేతులతో వండిన వంటకాలను కళ్యాణ్ రామ్ పలు సందర్భాల్లో తిన్నాడట. అర్జున్ సన్నాఫ్ వైజయంతి సినిమా ప్రమోషన్‌లో భాగంగా నందమూరి కళ్యాణ్ రామ్ మీడియా ముందుకు వచ్చాడు. ఒక ఇంటర్వ్యూలో కళ్యాణ్ రామ్ మాట్లాడుతూ.. తారక్‌కి వంట చేయడం చాలా ఇష్టం. ఒత్తిడిని తగ్గించుకోవడం కోసం వంట చేస్తాడు. అతడు ఏ వంట అయినా చేయగలరు. తారక్ చేసిన వంటల్లో నాకు మటన్ దాల్చా, నాటు కోడి పులుసు అంటే చాలా ఇష్టం అన్నాడు. తారక్ చేతుల మీదుగా ఆ వంటలను ఎప్పుడూ తినాలని అనుకుంటాను అన్నాడు. ఎన్టీఆర్ తన సన్నిహితులకు, స్నేహితులకు మాత్రమే కాకుండా అప్పుడప్పుడు తన అభిమానులకు సైతం తన చేతి వంట రుచి చూపించడం మనం చూస్తూ ఉంటాం. ఎంతో బిజీగా ఉండే ఎన్టీఆర్ సరదాగా వంట చేయడం, దాన్ని సన్నిహితులకు రుచి చూపించడం గొప్ప విషయం. వంట అనేది కేవలం ఆడవారు మాత్రమే చేసేది అంటూ కొందరి ఫీలింగ్ కానీ ఎన్టీఆర్ మాత్రం వంట చేయడం అభిరుచిగా పెట్టుకోవడంతో పాటు, తన సన్నిహితులకు ఎప్పటికప్పుడు వండి పెట్టడం, వారికి కొత్త వంటకాలను రుచి చూపించడం అభిరుచిగా పెట్టుకోవడం గొప్ప విషయం.

# నెవ్వర్ బిఫోర్ అనేలా అనసూయ గ్లామర్



టాలీవుడ్ లో యాంకర్‌గా, ఆ తర్వాత నటిగా ఓ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న అనసూయ భరద్వాజ.. తన వర్సటైల్ టాలెంట్‌తో మంచి క్రేజ్ అందుకుంది. ఇక 'రంగస్థలం' సినిమాలో రంగమ్మత్తగా మారి, తన పెర్ఫార్మెన్స్‌తో ప్రశంసలు అందుకుంది. తర్వాత పుష్ప వంటి ప్రాజెక్ట్స్‌తో పాన్ ఇండియా స్థాయిలో గుర్తింపు సాధించింది. మాస్, క్లాస్ అన్న తేడా లేకుండా అనసూయకి సోషల్ మీడియాలో ఫాలోయింగ్ గట్టిగానే ఉంది. ఆమె అందం, అభినయం, యాటిట్యూడ్ అన్నీ కలిపి ఫ్యాన్స్‌కు ఓ స్పెషల్ కనెక్ట్ కలిగించాయి. కమల్- మణిరత్నం ఇంత గ్యాప్ ఎందుకు? ప్రస్తుతం అనసూయ హోస్ట్ చేస్తున్న 'కిరాక్ బాయ్స్ అండ్ ఖిలాడీ గర్ల్స్ 2' షోలో ఆమె హోస్టింగ్ స్కిల్స్‌కి మెచ్చిపోతున్నారు. అయితే అంతకంటే ఎక్కువగా ఇప్పుడు ఆమె లుక్ సోషల్ మీడియాలో టాక్ ఆఫ్ ది టౌన్ అయింది. ఓ మెటాలిక్ గ్రీన్ కాస్ట్యూమ్‌తో, పింక్ టై వేసుకుని స్టైలిష్ పోజులతో మెరుపులు మెరిపించింది. బ్యాక్ స్టేజ్ సెట్టింగ్‌లో తీసిన ఈ ఫోటోలు.. ఆమె గ్లామర్, కాన్ఫిడెన్స్ రెండింటినీ హైలైట్ చేశాయి. ఈ లుక్‌లో అనసూయ తన బోల్డ్‌నెస్‌కి మరోసారి డెఫినిషన్ ఇచ్చింది. పొట్టి స్కర్ట్, స్లీవ్‌లెస్ కట్ టాప్‌లో అనసూయ ఇచ్చిన పొజులు ఫోటోగ్రఫీకి ఓ క్లాస్ ఫీల్ తీసుకురాగా, ఆమె బాడీ లాంగ్వేజ్ మరింతగా ఆకట్టుకుంది. జ్యూవెలరీ లేకపోయినా.. ఆమె ఎక్స్‌ప్రెషన్స్‌తోనే లుక్‌ని ఎలివేట్ చేసింది. మేకప్ సింపుల్ అయినా స్టైలిష్ గా ఉంటుంది అనే విషయం మళ్లీ నిరూపించింది. ఈ ఫోటోస్ చూసిన నెటిజన్స్ అనసూయ గ్లామర్ అండ్ గ్రేస్ వేరే లెవెల్, ఈ లుక్ గేమ్ చెంజర్ అంటూ కామెంట్స్ చేస్తున్నారు. ఇక ఆమె చేస్తున్న ప్రోగ్రామ్స్ అందమే పర్ఫెక్ట్ ప్రోమోషన్‌లా మారింది.

# ముంబై ఇండియన్స్ మ్యాచ్.. గ్యాలరీలో అనంత్- రాధిక జంట రొమాంటిక్ మూమెంట్స్..



**న్యూఢిల్లీ-నవభూమి:** రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీ చిన్న కుమారుడు అనంత్ అంబానీ చిన్న కోడలు రాధికా మర్చంట్ మరోసారి వార్తల్లో నిలిచారు. ప్రస్తుతం జరుగుతున్న ఐపీఎల్‌లో భాగంగా ముంబై ఇండియన్స్ మ్యాచ్‌లో వీరిద్దరూ స్టేడియంలో అందరి దృష్టిని ఆకర్షించారు. ముంబై ఇండియన్స్ జట్టుకు నీతా అంబానీ ఓనర్ అన్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ముంబై ఇండియన్స్ మ్యాచ్‌లు జరుగుతున్న సమయంలో అంబానీ ఫ్యామిలీ కచ్చితంగా హాజరవుతూ ఉంటుంది. తాజాగా అనంత్ %-% రాధిక జంట ఎంఐ టీమ్‌కు మద్దతు తెలిపేందుకు మ్యాచ్‌కు హాజరైంది. ఆ సమయంలో ఈ జంట గ్యాలరీలో పక్కపక్కన కూర్చొని సరదాగా కబుర్లు చెప్పుకుంటూ కనిపించారు. వారిద్దరికి సంబంధించిన క్యూట్ అండ్ రొమాంటిక్ మూమెంట్స్‌ను కొందరు తమ కెమెరాల్లో చిత్రీకరించి సోషల్ మీడియాలో పోస్టు చేయగా.. ప్రస్తుతం ఆ వీడియో వైరల్‌గా మారింది.కాగా, చిన్నతనం నుంచే స్నేహితులైన అనంత్, రాధిక గతేడాది జులైలో వివాహ బంధంతో ఒక్కటయ్యారు. వీరి వివాహం దాదాపు ఆరు నెలలు జరిగిందనే చెప్పాలి. ప్రీ వెడ్డింగ్, పార్టీలు, పూజలు అంటూ ఏడాదంటా వీరి వెడ్డింగ్ గురించే ప్రపంచం అంతా మాట్లాడుకుంది. వీరి వివాహానికి అంతర్జాతీయ ప్రముఖులు హాజరై సందడి చేసిన విషయం తెలిసిందే.


# డీకే శివకుమార్‌తో అనిల్ కుంబ్లే భేటీ..

## రాజకీయాల్లోకి రావాలని ఆహ్వానించినట్లుగా ప్రచారం..



**న్యూఢిల్లీ-నవభూమి:** టీమిండియా దిగ్గజ క్రికెటర్ అనిల్ కుంబ్లే కర్నాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌తో సమావేశమయ్యారు. ఇద్దరి భేటీ ప్రాధాన్యం సంతరించుకున్నది. మాజీ కెప్టెన్, కోచ్‌తో భేటీ అయిన విషయాన్ని డీకే శివకుమార్ సోషల్ మీడియా ద్వారా వెల్లడించారు. కుంబ్లే దేశానికి, కర్నాటకకు చేసిన సేవలను ప్రశంసించారు. భారత మాజీ కెప్టెన్, దిగ్గజ స్పిన్నర్ అనిల్ కుంబ్లేను తన నివాసంలో కలవడం ఆనందంది. కర్ణాటక, భారత క్రికెట్‌కు అపారమైన సేవలు అదందించారు.గర్వించదగ్గ కన్నడిగుడితో చర్చల్లో పాల్గొనడం ఆనందంగా ఉంది' అంటూ డిప్యూటీ సీఎం పోస్ట్‌లో పేర్కొన్నారు. ఇందుకు కుంబ్లే 'మీతో మాట్లాడడం అద్భుతంగా ఉందని.. తనకు సమయం కేటాయించినందుకు ధన్యవాదాలు' అని స్పందించాడు. అయితే, ఇద్దరి భేటీకి కారణం తెలియరాలేదు. ఇద్దరి భేటీపై సోషల్ మీడియాలో తెగ చర్చ నడుస్తున్నది. దేశ రాజకీయాల్లోకి రావాలని అనిల్ కుంబ్లేను డీకే శివకుమార్ కోరినట్లు ప్రచారం జరుగుతున్నది. అయితే, ఈ వార్తలను కుంబ్లే కొట్టిపడేశాడు. ఇది కేవలం వ్యక్తిగత సమావేశం మాత్రమేనని స్పష్టం చేశాడు.

# విరాట్ కోహ్లీ విషయంలో.. 18 ఏళ్ల తర్వాత సేమ్ సీన్ రిపీట్..!



**న్యూఢిల్లీ-నవభూమి:** ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో భాగంగా బెంగళూరు వేదికగా రాయల్ చాలెంజర్ బెంగళూరు పంజాబ్ కింగ్స్ మధ్య శుక్రవారం మ్యాచ్ జరిగింది. ఈ మ్యాచులో ఓ అనూహ్య ఘటన జరిగింది. ఇది కూడా స్టార్ బ్యాట్స్‌మెన్ విరాటం కోహ్లీ విషయంలో కావడం విశేషం. ప్రస్తుతం సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నది. 18 ఏళ్ల తర్వాత మళ్లీ సేమ్ సీన్ రిపీట్ అయ్యిందంటూ కామెంట్ చేస్తున్నారు. ఇంతకీ ఈ మ్యాచ్‌లో ఏం జరిగిందంటే.. పంజాబ్‌తో జరిగిన మ్యాచ్‌లో విరాట్ కోహ్లీ మూడు బంతులు ఆడాడు. ఇందులో కేవలం ఒక పరుగు మాత్రమే చేశాడు. అర్ష్‌దీప్ బౌలింగ్‌లో పెవిలియన్ బాట పట్టాడు. అయితే, 18 సంవత్సరాల కిందట.. ఏప్రిల్ 18న ఐపీఎల్ తొలి ఎడిషన్ మ్యాచ్ జరిగింది.2008లో విరాట్ అరంగేట్రం చేసిన మ్యాచులో కోల్‌కతాతో జరిగిన మ్యాచ్‌లో కేవలం ఒక పరుగు చేసి వెనుదిరిగాడు. ఆర్‌సీబీ-కేకేఆర్ మ్యాచ్ బెంగళూరు చిన్నస్వామి స్టేడియంలోనే జరుగడం విశేషం. ఆ సమయంలో విరాట్‌కు 19 ఏళ్ల వయసు. కేకేఆర్‌తో మ్యాచ్‌లో విరాట్ మూడోస్థానంలో బ్యాటింగ్‌కు వచ్చాడు. ఐదు బంతులు ఎదుర్కొని.. ఒక పరుగు చేసి అశోక్ దిండా బౌలింగ్‌లో పెవిలియన్‌కు చేశాడు. ఆ మ్యాచ్‌లోనూ బెంగళూరు కేకేఆర్ చేతిలో ఓటమిపాలైంది. తొలుత కేకేఆర్ నిర్ణీత 20 ఓవర్లలో మూడు వికెట్ల నష్టానికి 222 పరుగులు చేసింది.

Printed,Published & Owned by SHAIK SHAHANAZ, Printed at SUPER PRINTERS Web offset Printers 2-3-655/C/118,Azad Nagar,Amberpet Circle 23,HYDERABAD -500113(T.S.), and Published D.No: 10-2-287/1/,Ground Floor,Santhinagar,A.C Guards,Masabtank,HYDERABAD - 500028,State TELANGANA (India). Editor: **SHAIK SHAHANAZ**, Phone: 9246213493,Email : navabhoomidaily@gmail.com,navabhoomi1@gmail.com **RNI No: TEL TEL: 82083**